www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 184

శనివారం | 19-10-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ. 9.49 తదుపరి తదియ; నక్షత్రం: భరణి ఉ. 10.47 తదుపరి కృత్తిక; వర్జ్యం: రా. 9.39-11.05; దుర్ముహూర్తం: ఉ. 6.12-7.45; అమృతఘడియలు: ఉ. 6.30-7.56; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.12; సూర్యాస్తమయం: 5.46

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

100 రోజుల్లో టీసీఎస్‌కు శంకుస్థాపన

విశాఖ ఐటీ రంగానికి ఇది గేమ్ చేంజర్



సూపర్ 6 అమలుకు కట్టుబడి ఉన్నాం.. నవంబరు లేదా డిసెంబరులో పూర్తిస్థాయి బడ్జెట్

వాట్సాప్ ద్వారా జనన, మరణ ధ్రువీకరణ సేవలు.. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం కానివ్వం

జగన్ మీడియాలో తప్పుడు కథనాలు.. వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

రుషికొండ ప్యాలెస్‌ను ఏం చేయాలో ప్రజలే చెప్పాలి: మంత్రి లోకేశ్ 3

జగన్ పత్రికపై పరువు నష్టం కేసులో విశాఖ కోర్టుకు హాజరు



దోచుకున్న సొమ్మును బస్తాల కొద్దీ ఖర్చు చేసినా వైసీపీ నేతలు గెలవలేకపోయారు. డబ్బుతో ఏ ఎన్నికా జరగదు. డబ్బులతో ఎన్నికలు జరిగితే మన కూటమికి 93 శాతం సీట్లు వచ్చేవి కావు. ప్రజల్లో నమ్మకమే ముఖ్యం.

గత ప్రభుత్వం మాదిరిగా కక్ష సాధింపులకు పాల్పడితే మనకూ, వైసీపీ వాళ్లకూ తేడా ఉండదు. మన ప్రభుత్వంలో అవి ఉండవు. అలాగని తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

మీరు మంచి చేసినా, తప్పు చేసినా అవి పార్టీ, ప్రభుత్వానికి వర్తిస్తాయి. అందరికీ ఒక్కటే చెబుతున్నా.. మనం ప్రవర్తించే తీరుపైనే భవిష్యత్‌లో మనకు వచ్చే మెజారిటీ ఉంటుంది. ఈ నాలుగు నెలల్లో మన వాళ్ల ప్రోగ్రెస్ రిపోర్ట్ కూడా నా వద్ద ఉంది.

- టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు



టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జిలు, ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధినేత చంద్రబాబు

గీత దాటొద్దు..!

క్రమశిక్షణతో మెలగాల్సిందే.. ఇసుక, మద్యంలో జోక్యం వద్దు

చంద్రబాబు హెచ్చరిక

వైసీపీ తరహా దందాలు చేయొద్దు

ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు

ఎప్పటికప్పుడు దిద్దుబాటుకు పంచ సభ్య కమిటీ ఏర్పాటు

పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ

కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలుండవు

కానీ... తప్పుచేసినవారిని వదిలిపెట్టం: సీఎం చంద్రబాబు

క్యాడర్ కష్టం వల్లే ఈ విజయం
వారికి అండగా నిలవాల్సిందే: బాబు

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'కట్టుతప్పొద్దు. క్రమశిక్షణ మరవొద్దు' అని టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలకు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇసుక, మద్యం, ఇతర దందాల్లో జోక్యం చేసుకోవద్దని సూటిగా చెప్పారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జోనల్, ప్రాంతీయ ఇన్‌చార్జులతో చంద్రబాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గతంలో వైసీపీ పాలకులు పాల్పడిన దందాల జోలికి వెళ్లవద్దని హెచ్చరించారు. "ఇసుక విషయంలో ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు వేలు పెట్టవద్దు. తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించవద్దని అధికారులకు స్పష్టంగా చెప్పాను. ఇసుక విధానం సక్రమంగా అమలు కాకపోతే అధికారులను కూడా బాధ్యులను చేస్తాను. మద్యం విషయంలో కూడా ఎవరూ

మిగతా 13వ పేజీలో...

సహకార సంఘాలకు నామినేటెడ్ పాలకవర్గాలు

6 నెలల్లో ఎన్నికల నిర్వహణ

మిత్రపక్షాలకు 20 శాతం పదవులు

గతంలో అరాచకాలకు పాల్పడినవారిని శిక్షిస్తాం

ఏమీ జరగడం లేదన్న అపోహలొద్దు: సీఎం

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలకు ముగ్గురు సభ్యుల నామినేటెడ్ పాలక వర్గాలను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయం వెల్లడించారు. ఆరు నెలల్లో

మిగతా 14వ పేజీలో...

ఇసుకపై సీనరేజీ, జీఎస్టీ రద్దు!

టీడీపీ నేతల భేటీలో చంద్రబాబు నిర్ణయం

సొంత అవసరాలకు తవ్వుకుని తీసుకెళ్తే ఏ పన్నులూ ఉండవ్

డోర్ డెలివరీ కావాలనుకుంటే తవ్వకం, రవాణా చార్జీలు భరించాల్సిందే

తామే తీసుకెళ్తే ఖర్చులు ఉండవ్

ఓవర్ లోడ్ పేరుతో పెనాల్టీలూ ఉండవ్

పునాదుల్లో నింపే మట్టిపైనా పన్నుల్లేవ్

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇసుకపై ప్రస్తుతం విధిస్తున్న సీనరేజీ, జీఎస్టీ పన్నులు రద్దు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. శుక్రవారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేల నుంచి వచ్చిన సూచనలతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని మంత్రులు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే

మిగతా 13వ పేజీలో...



ట్రాక్టర్‌కూ రైట్.. రైట్..

స్థానిక అవసరాలకు ఇసుక తీసుకెళ్లవచ్చు

ఇప్పటివరకు ఎద్దుల బండికే అనుమతి

ఇకపై ట్రాక్టర్ ద్వారా కూడా ఇసుక రవాణా

సీఎం చొరవతో ఇసుక పాలసీలో మార్పులు 13

పర్మిట్ రూమ్‌లు లేవు

ప్రభుత్వ నిర్ణయంతో 170 కోట్ల నష్టం.. నూతన మద్యం పాలసీ అమల్లోకి

గతంలో ఒక్కో షాపు నుంచి 5 లక్షల ఆదాయం.. జగన్ హయాంలో తొలగింపు 12

ఫలితంగా రోడ్లపై తాగే సంస్కృతి.. ఇప్పుడు పాలసీ మారినా పాత రూలే.. బార్లకు మేలు

అవునా జగన్!



మీరు అబద్ధాలే ఆడరా?

అమరావతిలోనే రాజధాని అని చెప్పలేదా?

బాబాయిపై గొడ్డలి నిండా అబద్ధాల మరకలే..

ఉద్యోగుల సీపీఎస్‌పై 'వారాల అబ్బాయి' మీరు కాదా?

జాబ్ కేలండర్‌పై యువతను వంచించలేదా?

మద్య నిషేధంలో మహిళలను ముంచలేదా?

ప్రత్యేక హోదాపై ఐదేళ్లూ మీవి బొంకులేగా?

అధికారంలోకి వచ్చిందే అబద్ధాలతో కదా!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"ప్రతిపక్షంలోనైనా కూర్చుంటాను. కానీ అబద్ధాలు మాత్రం చెప్పను".. ఇవి గురువారం వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు. కానీ, 2019లో అధికారంలోకి వచ్చేందుకు ఆయన చెప్పిన అబద్ధాలు అన్నీ ఇన్నీ కాదు! అధికారంలోకి వచ్చాక చేసిన తప్పుడు ప్రచారం అంతా ఇంతా కాదు! అయినా సరే... 'అబద్ధాలు ఆడను' అంటూ జగన్ చేసిన ప్రకటన విని ప్రజలు విస్తుపోతున్నారు. 'అవునా.. నిజమా' అని వైసీపీ బాధితులైన జనం



మిగతా 14వ పేజీలో...



కీలక కేసుల నిగ్గు తేలుస్తాం

దర్యాప్తులో ఇబ్బందులు అధిగమించేందుకే ఐవో స్థాయి పెంపు

నిందితుల్లో ఐపీఎస్‌లు ఉన్నందునే సీఐడీకి బదలాయింపు: డీజీపీ 12

విలీనం జీవో రద్దు!

వివాదాస్పద జీవో 117 రద్దుకు ప్రభుత్వ నిర్ణయం

ఉన్నత పాఠశాలల్లో విలీనమైన తరగతులు వెనక్కి

మార్పుల ప్రక్రియకు పాఠశాల విద్యా శాఖ శ్రీకారం

ప్రాథమిక స్థాయిలో రెండు మీడియంలు కొనసాగింపు

పెద్ద పంచాయతీల్లో మోడల్ ప్రాథమిక పాఠశాలలు

శాఖ డైరెక్టర్‌తో చర్చల్లో ఉపాధ్యాయ నేతల వినతులు

పాఠశాలల నిర్వహణకు రూ.100 కోట్లు

రెండు, మూడు రోజుల్లో బడుల ఖాతాకు నిధులు

మంత్రి లోకేశ్ చొరవతో ఉపశమనం 13



అమరావతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తరగతుల విలీనంపై వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద జీవో 117ను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ జీవోను రద్దుచేస్తామని ప్రతిపక్షంలో ఉన్న

మిగతా 12వ పేజీలో...

బాల్యవివాహం సామాజిక దురాచారం

వ్యక్తిగత చట్టాలు బాల్యవివాహ నిరోధక చట్టాన్ని అడ్డుకోజాలవు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ.. విస్పష్ట మార్గదర్శకాల జారీ 2

చట్టం అమలుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారులు

ప్రత్యేక పోలీసు విభాగం ఏర్పాటు.. మూడు నెలలకోమారు సర్వే

న్యాయమూర్తులు సుమోటోగా తీసుకొని విచారించాలి

ప్రజల్లో అవగాహన పెంచాలి.. తీర్పుపై స్వచ్ఛందసంస్థల హర్షం

ఇక సుప్రీం అన్ని బెంచ్‌ల విచారణలు ప్రత్యక్ష ప్రసారం



ఆప్ నేత సత్యేందర్ జైన్‌కు బెయిల్

న్యూఢిల్లీ, అక్టోబరు 18: నగదు అక్రమ చలామణి కేసులో ఢిల్లీ మాజీ మంత్రి, ఆప్ నాయకుడు సత్యేందర్ జైన్‌కు శుక్రవారం రౌజ్ అవెన్యూలోని ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణ ఇంకా ప్రారంభం కాక పోవడం, సుదీర్ఘ కాలం పాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉండడంతో బెయిల్ మంజూరు చేస్తున్నట్టు ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే తెలిపారు. ఆదాయానికి మించి రూ.1.47 కోట్ల మేర ఆస్తులు కలిగి ఉన్నారంటూ సీబీఐ 2017లో కేసు నమోదు చేసింది. నాలుగు డొల్ల కంపెనీల పేరుతో మనీలాండరింగ్ పాల్పడ్డారంటూ అనంతరం ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఆ కంపెనీలకు చెందిన రూ.4.81 కోట్ల ఆస్తులను జప్తు చేసింది. 2022 మే 30న అరెస్టు చేసింది. మధ్యలో అనారోగ్య కారణాల దృష్ట్యా మెడికల్ బెయిల్‌పై విడుదలయ్యారు. మొత్తంగా 18 నెలల పాటు జైలులో గడపడంతో ప్రస్తుతం పలు షరతులతో కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై తీర్మానం

శ్రీనగర్, అక్టోబరు 18: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో తీర్మానం ఆమోదించారు. ఒకటి రెండు రోజుల్లో సీఎం ఒమర్ అబ్దుల్లా ఢిల్లీకి వెళ్లి ఈ తీర్మానం ముసాయిదాను ప్రధాని మోదీకి అందజేస్తారు. మరోవైపు ఈ తీర్మానం ఆర్టికల్ 370 రద్దును ధ్రువీకరించడమేనని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధి వహీదా పారా అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తామంటూ ఓట్లు దండుకుని ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీజేపీ కూడా ఒమర్ తీర్మానంపై విమర్శలు ఎక్కుపెట్టింది. తీర్మానాన్ని రాజకీయ స్టంట్‌గా అభివర్ణించింది. సరైన సమయంలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పిస్తామని మోదీ ఇప్పటికే స్పష్టం చేశారని బీజేపీ అధికార ప్రతినిధి సునీల్ సేథీ గుర్తు చేశారు.

అమెరికా ఈబీ-1 వీసా నిబంధనల్లో మార్పులు

న్యూఢిల్లీ, అక్టోబరు 18: గత వారం యూఎస్ సిటిజన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఈబీ-1 వీసా కేటగిరి నిబంధనల్లో మార్పులు చేసింది. అవి తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. సైన్స్, ఆర్ట్స్, విద్య, వ్యాపారం, ఆటల్లో 'అసాధారణ సామర్థ్యాన్ని' నిరూపించుకోవాలన్న దరఖాస్తుదారుని బాధ్యతను సరళతరం చేసింది. వీసా అర్హతగా నమోదయిన టీమ్ విజయాలను సాక్ష్యంగా చూపించినా సరిపోతుందంటూ వివరణ ఇచ్చింది. దీనివల్ల భారతీయులు ఎక్కువగా లబ్ధి పొందే అవకాశం ఉంది. వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభను ప్రదర్శించిన వారు ఈబీ-1(ఎక్స్‌ట్రార్డినరీ ఎబిలిటీ పర్మినెంట్ రెసిడెన్స్ వీసా) వీసాకు అర్హులు. వీరు శాశ్వతంగా అమెరికాలో నివసించవచ్చు, పనిచేయవచ్చు. ఈ వీసాను పొందిన వారి జీవిత భాగస్వామి, పిల్లలు కూడా గ్రీన్‌కార్డు దరఖాస్తుకు అర్హులు అవుతారు.

భారతీయులకు యూఏఈ వీసా-ఆన్-అరైవల్

న్యూఢిల్లీ, అక్టోబరు 18: భారతీయ ప్రయాణికుల కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వీసా-ఆన్-అరైవల్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. అర్హులైన భారత పౌరులకు 14 రోజుల వ్యవధితో కూడిన వీసా-ఆన్-అరైవల్ సదుపాయాన్ని యూఏఈ కల్పిస్తోందని అక్కడి భారత రాయబార కార్యాలయం గురువారం ప్రకటించింది. ప్రయాణికులు కనీసం 6నెలల పాటు చెల్లుబాటయ్యే పాస్‌పోర్టును కలిగి ఉండటంతో పాటు అమెరికా జారీ చేసిన గ్రీన్‌కార్డు/ వీసా, యూరోపియన్ యూనియన్, యూకే దేశాలు మంజూరు చేసిన చెల్లుబాటయ్యే శాశ్వత నివాస పత్రం/ వీసా ఉన్నవారు అర్హులని వివరించింది.

రూ.5 కోట్లు చెల్లించాలని సల్మాన్‌కు హెచ్చరిక

ముంబయి, అక్టోబరు 18: హీరో సల్మాన్ ఖాన్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ మరో బెదిరింపు మెసేజ్ పంపించింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌తో వైరం వద్దనుకుంటే రూ.5 కోట్లు చెల్లించాలని, లేకుంటే ప్రాణాలకే ముప్పు అని హెచ్చరించింది. ఈ మేరకు ముంబయి ట్రాఫిక్ పోలీసులకు వాట్సప్ మెసేజ్ అందింది. "ఒకవేళ డబ్బు ఇవ్వకపోతే ఇటీవలే హత్యకు గురయిన బాబా సిద్దిఖీకన్నా దారుణమైన పరిస్థితిని ఎదుర్కోవలసి ఉంటుంది" అని ఆ మెసేజ్‌లో పేర్కొంది. ఇది ఎక్కడ నుంచి వచ్చిందన్నదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. బాంద్రాలోని సల్మాన్ నివాసం వద్ద భద్రతను పెంచారు. సల్మాన్‌కు గతంలోనూ ఇలాంటి బెదిరింపులు వచ్చాయి.

606 పోస్టల్ పార్సిళ్లలో రూ.21 కోట్ల డ్రగ్స్

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బెంగళూరు చామరాజపేట ఫారిన్ పోస్టాఫీస్‌కు వివిధ దేశాల నుంచి వచ్చిన 606 పార్సిల్స్‌లో రూ.21 కోట్ల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొన్ని నెలలకాలంగా ఈ పార్సిల్స్ డెలివరీ కాలేదు. అమెరికా, బ్రిటన్‌తోపాటు ఆఫ్రికా దేశాలనుంచి ఈ డ్రగ్స్ వచ్చాయి.

తెలంగాణ స్కిల్స్ వర్సిటీకి అదానీ వంద కోట్లు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి భారీ విరాళం అందింది. దానికి అదానీ ఫౌండేషన్ రూ.100 కోట్ల విరాళాన్ని అందించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఈ మేరకు చెక్ అందించారు. ప్రభుత్వం నెలకొల్పనున్న స్కిల్స్ యూనివర్సిటీకి తమ గ్రూప్ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. స్కిల్స్ వర్సిటీని ప్రకటించిన తర్వాత కార్పొరేట్ కంపెనీల నుంచి అందిన అతి పెద్ద విరాళం ఇదే.

ఇక ఆ కేసులపై సీఐడీ విచారణ

- టీడీపీ ఆఫీసు, బాబు నివాసంపై దాడి కేసుల్లో ఫైళ్లు స్వాధీనం

గుంటూరు, అక్టోబరు 18: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మూడు ముఖ్యమైన కేసుల విచారణను బదిలీ చేశారు. గత ప్రభుత్వంలో టీడీపీ కార్యాలయం, చంద్రబాబు నివాసంపై జరిగిన దాడులకు సంబంధించిన కేసులను ఇప్పటికే సీఐడీకి బదిలీ చేయగా, తాజాగా ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. చంద్రబాబు నివాసంపై దాడి కేసుకు సంబంధించి గుంటూరు నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ నుంచి సీఐడీ రాష్ట్ర కార్యాలయ అధికారులు ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి సంబంధించిన కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు వివరాలను గుంటూరు సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. ఆ కేసుకు సంబంధించిన ఫైళ్లన లక్ష్మయ్య స్వాధీనం చేసుకున్నారు. శనివారం నుంచి ఆ రెండు కేసులకు సంబంధించిన దర్యాప్తును సంబంధిత సీఐడీ అధికారులు కొనసాగించనున్నారు. నరసాపురం మాజీ ఎంపీ, ప్రస్తుత ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కేసును ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌కు అప్పగించారు. రెండు రోజుల క్రితం ఎస్పీ దామోదర్ గుంటూరులోని రేంజ్ ఐజీ కార్యాలయానికి వచ్చి ఐజీ త్రిపాఠిని కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పీ రమణకుమార్ తదితరులు దర్యాప్తు పురోగతిని వివరించారు. ఆయా ఫైళ్లను ఆయనకు అప్పగించారు.

బచావత్ ట్రైబ్యునల్ పంచినట్లుగానే నీటి వినియోగం ఉండాలి

- దీనిపై సమీక్ష అవసరం లేదు: ఏపీ

హైదరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బచావత్ ట్రైబ్యునల్(కృష్ణా ట్రైబ్యునల్-1) తీర్పు మేరకు కేటాయింపులకు అనుగుణంగా నీటి వినియోగం ఉండాలని, దీనిపై సమీక్షించడానికి వీల్లేదని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది. కృష్ణా జలాల పంపిణీపై విచారణ జరుపుతున్న జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ (కృష్ణా ట్రైబ్యునల్-2)లో శుక్రవారం ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రొటోకాల్‌పై ఏపీ అఫిడవిట్‌ను దాఖలు చేసింది. తొలుత తాగునీటి అవసరాలు, ఆతర్వాత సాగునీటి అవసరాలు ఉన్నప్పుడే శ్రీశైలం, సాగర్‌లలో జలవిద్యుత్ ఉత్పాదన చేయాలని స్పష్టం చేసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుంచి తెలంగాణకు 122 టీఎంసీలు, ఏపీకి 386 టీఎంసీల నీటి కేటాయింపులు చేయాలని పేర్కొన్నట్లు తెలిపింది. బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపుల తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలతో శ్రీశైలం పెన్నా-కృష్ణా బేసిన్‌ల ఉమ్మడి రిజర్వాయర్‌గా మారిందని పేర్కొంది. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలను కేటాయించిందని, ఆ నీటిని ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి తరలించడానికి వీలు కల్పించిందని గుర్తు చేసింది. ఇందులో 299 టీఎంసీలు తెలంగాణకు, 367 టీఎంసీలు కోస్తాంధ్రకు, 144 టీఎంసీలు రాయలసీమకు కేటాయింపులున్నాయని పేర్కొంది. ఉమ్మడి రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల, వినియోగం కేటాయింపుల ఆధారంగానే ఉండాలని విన్నవించింది.

బాల్యవివాహం

సామాజిక దురాచారం

వ్యక్తిగత చట్టాలు బాల్యవివాహ నిరోధక చట్టాన్ని అడ్డుకోజాలవు



- సుప్రీం స్పష్టీకరణ.. మార్గదర్శకాల జారీ

న్యూఢిల్లీ, అక్టోబరు 18: బాల్య వివాహం ఓ సామాజిక దురాచారమని, పర్సనల్ చట్టాలు, వాటిలోని సంప్రదాయాలు బాల్య వివాహ నిరోధక చట్టాన్ని అడ్డుకోజాలవని సుప్రీంకోర్టు పేర్కొంది. మైనర్‌గా ఉన్నప్పుడే వివాహం చేయటం వల్ల తనకు నచ్చిన జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం సదరు వ్యక్తులు కోల్పోతారని గుర్తు చేసింది. బాల్య వివాహ నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ 'సేవ' అనే స్వచ్ఛందసంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపి 141 పేజీల తీర్పును వెలువరించింది. బాల్య వివాహాల నిరోధానికి తొమ్మిది శీర్షికల కింద పలు మార్గదర్శకాలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు, సంబంధిత ప్రభుత్వ సంస్థలకు ఈ తీర్పులో సుప్రీంకోర్టు జారీ చేసింది. బాల్య వివాహ నిరోధక చట్టం అమలుకు జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కొందరు అధికారులను నియమించాలని, వారికి ఇతర బాధ్యతలేవీ అప్పగించకూడదని ఈ మార్గదర్శకాల్లో సుప్రీంకోర్టు తెలిపింది. చట్టం అమలు తీరుపై మూడునెలలకోమారు సర్వే నిర్వహించాలని నిర్దేశించింది. జిల్లా స్థాయిలో బాల్యవివాహాలను నిరోధించే బాధ్యత ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు తీసుకోవాలని పేర్కొంది. అంతేగాక, ఒక ప్రత్యేక పోలీసు విభాగాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. బాల్య వివాహ ఘటనలపై న్యాయమూర్తులు కూడా సుమోటోగా తీసుకొని ఆదేశాలు జారీ చేయాలని తెలిపింది. బాల్యవివాహాలను అడ్డుకోవటంలో నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వ అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. 'బాల్యదశ అంటేనే చట్టబద్ధమైన నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోలేదని అర్థం. వివాహం అనేది ఒక చట్టబద్ధమైన వ్యవస్థ. వివాహం పరిధిలోకి ప్రవేశించే వ్యక్తుల బాధ్యతలను బాలబాలికలు అర్థం చేసుకోలేరు' అని ధర్మాసనం విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది.

పలు కారణాలు

బాల్యవివాహాలను లింగం, కులం, సామాజిక ఆర్థిక పరిస్థితి, ప్రాంతం వంటివి ప్రభావితం చేస్తున్నాయని.. పేదరికం, అసమానతలు, నిరక్షరాస్యత వంటివి మూల కారణాలుగా నిలుస్తున్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో, బాల్యవివాహాల నిరోధానికి ఒకే రకమైన విధానాలను పాటించకుండా, వేర్వేరు సమూహాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించింది. సమాజంలోని భిన్న భాగస్వామ్యపక్షాలను సమన్వయం చేసుకుంటూ సమష్టిగా చర్యలు తీసుకుంటేనే బాల్యవివాహ నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయటం వీలవుతుందని పేర్కొంది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంచటం, బాల్య వివాహాలు జరుగుతుంటే వాటిని అడ్డుకోవటానికి వీలుగా పోలీసు తదితర దర్యాప్తు సంస్థలకు వెంటనే సమాచారం అందించే వ్యవస్థలను ఏర్పాటు చేయటం, పోలీసులకు శిక్షణనివ్వటం తదితర చర్యలు చేపట్టాలని సుప్రీం కోర్టు నిర్దేశించింది. బాల్యవివాహాలు జరిపించిన వ్యక్తులు, కుటుంబాలపై నిరోధక చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవటం అవసరమేగానీ.. వాటికన్నా బాల్యవివాహాలను నిరోధించటం, బాలలను సంరక్షించటానికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని దర్యాప్తు సంస్థలకు సూచించింది. సదరు చట్టం, అది విధించే శిక్షలపైన కూడా ప్రజల్లో ప్రచారం చేయాలని తెలిపింది. కాగా.. బాల్య వివాహాలకు సంబంధించి కేంద్రం తన వైఖరిని వెల్లడిస్తూ.. పర్సనల్ చట్టాల కన్నా బాల్య వివాహ నిరోధక చట్టమే పైచేయిగా ఉండాలని ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఈ అంశానికి సంబంధించిన బిల్లు పార్లమెంటు పరిశీలనలో ఉన్న విషయాన్ని గుర్తు చేసింది.

కీలక విజయం

సుప్రీం తీర్పుపై 'సేవ'తోపాటు పలు స్వచ్ఛందసంస్థలు హర్షం వ్యక్తం చేశాయి. బాల్యవివాహం అనే సామాజిక దురాచారంపై జరుగుతున్న యుద్ధంలో ఇది కీలక విజయమని పేర్కొన్నాయి. 2030 నాటికి దేశంలో బాల్యావివాహాలను పూర్తిగా అడ్డుకునే లక్ష్యంతో 200కిపైగా స్వచ్ఛందసంస్థలు 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా' అనే ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి.

ఇకపై అన్ని బెంచ్‌ల విచారణలు ప్రత్యక్ష ప్రసారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): దేశ సర్వోన్నత న్యాయస్థానం చరిత్రలో మరో అధ్యాయం మొదలు కాబోతుంది. ఇప్పటి వరకు రాజ్యాంగ ధర్మాసనం కేసుల విచారణను మాత్రమే ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న సుప్రీంకోర్టు ఇకపై అన్ని ధర్మాసనాల ముందు నిత్యం జరిగే కేసుల విచారణలను సయితం ప్రత్యక్ష ప్రసారం(లైవ్ స్ట్రీమింగ్) చేయాలని భావిస్తోంది. శుక్రవారం ప్రయోగాత్మకంగా అన్ని ధర్మాసనాల ఎదుట జరిగిన విచారణలను లైవ్ స్ట్రీమ్ చేసి పరిశీలించింది. వీటిని అధికారిక యూట్యూబ్ ఛానెల్‌లో కాకుండా కోర్టు కోసం ప్రత్యేకంగా రూపొందించిన సొంత అప్లికేషన్ అయిన బీటా వెర్షన్ యాప్ ద్వారా ప్రసారం చేసింది. లోటుపాట్లను సమీక్షించిన తరువాత పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురానుంది. రాజ్యాంగ ధర్మాసనం విచారించే కేసులు అధిక ప్రాముఖ్యం ఉన్న వాటినే ప్రత్యక్ష ప్రసారం చేస్తుండగా దాన్ని మరింతగా విస్తరించాలని ప్రతిపాదించింది. పారదర్శకత ఉండాలన్న ఉద్దేశంతో 2018లో ఇచ్చిన కీలక తీర్పులో సుప్రీంకోర్టు లైవ్ స్ట్రీమింగ్‌కు అనుమతి ఇచ్చింది. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్వీ రమణ పదవీ విరమణ చేసిన రోజున ఆయన నేతృత్వంలోని ధర్మాసనం నిర్వహించిన కార్యకలాపాలను దేశ ప్రజలంతా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు.


బినామీ చట్టం రూల్స్‌పై తీర్పును తిరగదోడిన సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 18: బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధ చట్టంలోని రెండు నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమంటూ గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం తిరగదోడింది. కేంద్రం విజ్ఞప్తి మేరకు ఆ తీర్పుపై జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో త్రిసభ్య ధర్మాసనం సమీక్షకు అనుమతించింది. బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధ చట్టం-1988 సవరించని నిబంధనల్లోని సెక్షన్లు 3 (2), 5 రాజ్యాంగ విరుద్ధమని మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం 2022 ఆగస్టులో తీర్పునిచ్చింది. అయితే ఆ నిబంధనల చెల్లుబాటును కోర్టులో ఎవరూ సవాల్ చేయలేదని.. తీర్పును సమీక్షించాల్సిన అవసరముందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తాజాగా కోర్టు దృష్టికి తెచ్చారు.

డేరా బాబా కేసులపై స్టే తొలగింపు

న్యూఢిల్లీ, అక్టోబరు 18: దైవ దూషణకు పాల్పడ్డారంటూ డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాం రహీం సింగ్‌పై నమోదైన కేసుల విచారణపై ఉన్న స్టేను ఎత్తివేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. గురుగ్రంథ్ సాహిబ్‌ను అవమానపరచడంతో పాటు, దైవదూషణకు పాల్పడ్డారంటూ ఆయనపై 2015లో మూడు కేసులు నమోదయ్యాయి. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా పంజాబ్‌లోని ఫరీద్‌కోట్, బెహబాల్ కలాన్‌ల్లో జరిగిన ప్రదర్శనలు హింసకు దారి తీయడంతో ఇద్దరు మరణించారు కూడా. ఈ కేసుల విచారణ జరగకుండా ఈ ఏడాది మార్చి నెలలో పంజాబ్-హరియాణా హైకోర్టు స్టే ఇచ్చింది. దీనిని ఎత్తివేయాలని కోరుతూ పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది.

లోకం తీరు



అదృశ్యమైన వారి కేసు మినహా మిగిలిన కేసుల విచారణ

- ఈశా యోగా కేంద్రం వ్యవహారంపై సుప్రీంకోర్టు ఉత్తర్వులు

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో ఉన్న ఈశా యోగా కేంద్రం వ్యవహారంలో ఇద్దరు మహిళలు అదృశ్యమైన కేసును మూసివేసిన సుప్రీంకోర్టు.. మిగిలిన ఫిర్యాదులపై పోలీసులు విచారణ చేపట్టవచ్చని పేర్కొంది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. తన ఇద్దరు కుమార్తెలను ఈశా కేంద్రంలో నిర్బంధించారంటూ మాజీ ప్రొఫెసర్ ఎస్.కామరాజ్ దాఖలు చేసిన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ ఈషా కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై ఈ నెల 3వ తేదీన విచారణ చేపట్టిన ధర్మాసనం.. సవివరంగా నివేదిక దాఖలు చేయాలని తమిళనాడు పోలీస్‌శాఖను ఆదేశించింది. దీంతో కోయంబత్తూరు జిల్లా ఎస్పీ కార్తికేయన్ నేతృత్వంలోని పోలీసులు 23 పేజీలతో కూడిన నివేదిక దాఖలు చేశారు. యోగా కేంద్రంలో ఆరుగురు అదృశ్యమైనట్టు కేసులున్నాయని, అందులో ఐదు కేసుల్ని ఉపసంహరించుకోగా, మరో కేసు మాత్రం పెండింగ్‌లో ఉందని నివేదికలో పేర్కొన్నారు. అలాగే మరో ఏడు కేసులు నమోదు చేయగా, వాటిల్లో ఒక కేసు విచారణలో ఉందని వివరించారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం మరోమారు విచారణ జరగ్గా.. ఈశా కేంద్రం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గీ.. మాజీ ప్రొఫెసర్ కుమార్తెల వయసు 42, 39 వుందని, వారి ఇష్టప్రకారమే యోగా కేంద్రంలో ఉంటున్నారని వివరించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఆ పిటిషన్‌ను మూసివేస్తున్నట్టు ప్రకటించింది. అయితే ఈశా కేంద్రంపై ఉన్న ఇతర కేసులు విచారణకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొంది.

గవర్నర్‌ను వెంటనే రీకాల్ చేయండి



- కేంద్రానికి స్టాలిన్ డిమాండ్
- రాష్ట్ర గేయంలోని 'ద్రవిడ' పదాన్ని ఉద్దేశపూర్వకంగా పలకలేదని ఆరోపణ

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు గవర్నర్‌ను వెంటనే రీకాల్ చేయాలని సీఎం స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ రాష్ట్ర గేయంలోని 'ద్రవిడ' అనే పదాన్ని ఉద్దేశ పూర్వకంగానే పలకలేదని ఆయన ఆరోపించారు. "గవర్నర్ మీరు ఆర్యులా? ద్రవిడ అనే పదాన్ని తొలగించి రాష్ట్ర గేయాన్ని ఆలపించడం తమిళనాడు చట్టాలకు విరుద్ధం. ఆ చట్టాలను గౌరవించని, ఇష్టానుసారం ప్రవర్తించే వ్యక్తి గవర్నర్ పదవిలో కొనసాగేందుకు అర్హుడు కాదు. దేశంలో నివసిస్తున్న వివిధ జాతులు, మతాలకు చెందిన ప్రజల ఐక్యతను దెబ్బతీసేలా గవర్నర్ ప్రవర్తించారు" అని స్టాలిన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "ద్రవిడియన్ అలర్జీతో బాధపడుతున్న గవర్నర్ జాతీయ గీతంలో ద్రవిడ పదాన్ని తొలగించాలని కోరుతారా? ఉద్దేశపూర్వకంగా తమిళనాడును, తమిళనాడు ప్రజల మనోభావాలను కించపరుస్తున్న గవర్నర్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రీకాల్ చేయాలి" అని ముఖ్యమంత్రి కోరారు. ఇదిలా ఉండగా, హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో హిందీ మాసోత్సవాలు జరపడమెందుకని స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ప్రధాని మోదీకి శుక్రవారం లేఖ రాశారు. శుక్రవారం ఉదయం మద్రాస్ దూరదర్శన్ స్వర్ణోత్సవాలతో పాటు హిందీ మాసోత్సవాన్ని నిర్వహించడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విభిన్న భాషలకు నిలయమైన భారతదేశంలో హిందీ భాషకు ప్రత్యేక స్థానం ఇవ్వడం, హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో హిందీమాసోత్సవాలను నిర్వహించడం ఆయా రాష్ట్రాల్లోని మాతృభాషలను, ఇతర భాషలను కించపరచడమే అవుతుందని లేఖలో పేర్కొన్నారు.

పన్నూ హత్యకు భారతీయుల కుట్ర

డబ్బులిచ్చి అంతమొందించాలని చూశారు


పన్నూ


వికాస్ యాదవ్

- 'రా' మాజీ అధికారి వికాస్ యాదవ్ ప్రథమ నిందితుడు.. ఆయనకు నిఖిల్ గుప్తా సహకారం
- ఇద్దరూ కలసి 'హిట్‌మ్యాన్'తో బేరం
- అమెరికా న్యాయశాఖ అభియోగాలు

న్యూఢిల్లీ, అక్టోబరు, 18: ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ పన్నూ హత్యకు భారత్‌కు చెందిన పరిశోధన, విశ్లేషణ విభాగం (రా) మాజీ అధికారి వికాస్ యాదవ్ కుట్ర పన్నారని, అతనే ప్రథమ నిందితుడు అని అమెరికా న్యాయశాఖ తాజాగా అభియోగాలు మోపింది. గతంలో న్యూయార్క్ కోర్టుకు సమర్పించిన అభియోగపత్రంలో వికాస్ యాదవ్‌ను సీసీ-1గా పేర్కొంది. తాజాగా కోర్టుకు సమర్పించిన అభియోగపత్రంలో వికాస్‌కు మరో భారతీయుడు నిఖిల్ గుప్తా కూడా సహకరించారని తెలిపింది. వీరిపై కిరాయికి హత్య, కిరాయి హత్యకు కుట్ర, మనీ లాండరింగ్ కింద అభియోగాలు నమోదు చేసింది. నేరారోపణ రుజువైతే వీరికి నలభై ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఈ కేసులో వికాస్ యాదవ్ ఉనికిని గురువారం బహిర్గతం చేసిన యూఎస్ న్యాయశాఖ అతడు పరారీలో ఉన్నాడని పేర్కొంది. వికాస్, నిఖిల్ కలసి భారత మూలాలు కలిగిన అమెరికా పౌరుడిని ఈ నేలపై హత్య చేయడానికి కుట్ర పన్నారని అభియోగాలు మోపింది. హత్య కోసం నిఖిల్ గుప్తాను వికాస్ యాదవ్ గత ఏడాది మే నెలలో నియమించుకున్నట్లు అమెరికా ప్రాసిక్యూటర్లు భావిస్తున్నారు. ఆ అభియోగపత్రంలో వికాస్ యాదవ్ భారత విదేశాంగ నిఘా సర్వీస్ ఉద్యోగి నని, సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ హోదాలో సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, ఇంటెలిజెన్స్ విభాగాలను పర్యవేక్షించేవాడినని, సీఆర్‌పీఎఫ్‌లో కూడా పనిచేశానని, యుద్ధ విమానాల శిక్షణ కూడా తీసుకున్నానని చెప్పుకొన్నాడని పేర్కొన్నారు. అయితే దీనిని భారత ప్రభుత్వం మాత్రం నిర్ధారించలేదు. కానీ వికాస్ యాదవ్ మిలిటరీ డ్రస్‌లో ఉన్న ఫొటోను ఒకదానిని అభియోగపత్రానికి జత చేశారు. అలాగే ఒక కారులో కూర్చుని ఇద్దరు వ్యక్తులు అమెరికా డాలర్లు మార్చుకుంటున్న మరో ఫొటోను కూడా కోర్టుకు సమర్పించారు. నిఖిల్ గుప్తా, వికాస్ యాదవ్ తరఫున పనిచేసే మూడో నిందితుడు, ఇంకా గుర్తించాల్సిన 'హిట్‌మ్యాన్'కు కారులో ఆ డబ్బు ఇస్తున్నట్లు అభియోగాల్లో పేర్కొన్నారు. పన్నూను అంతమొందిస్తే గుజరాత్ కోర్టులో గుప్తాపై ఉన్న క్రిమినల్ కేసును విత్‌డ్రా చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రాసిక్యూషన్ పేర్కొంది. ఈ హత్యకు సంబంధించి వికాస్, నిఖిల్ కలసి అండర్ కవర్ ఫెడరల్ ఏజెంట్ 'హిట్‌మ్యాన్'ను కలిసి లక్ష డాలర్లకు బేరం కుదుర్చుకున్నారని, దానిలో భాగంగా గతేడాది జూన్‌లో 15 వేల డాలర్లు అడ్వాన్స్‌గా ఇచ్చారని ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. కొద్ది రోజుల్లో ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వస్తారనగా ఈ డీల్ జరిగిందని, ఆ తర్వాత కొద్ది రోజులకే కెనడాలో మరో ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య జరిగిందని తెలిపారు. జూన్‌లోనే పన్నూపై హత్యాయత్నం జరిగిందని ప్రాసిక్యూటర్లు తెలిపారు. మోదీ పర్యటన సమయంలో కానీ, పర్యటన ముగిసిన వెంటనే కానీ హత్య చేయవద్దని హిట్‌మ్యాన్‌కు గుప్తా సూచించాడని, అయితే జూన్ 18న నిజ్జర్ హత్య తర్వాత వారి ప్లాన్ మారిపోయిందని ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఇక నిరీక్షించాల్సిన అవసరం లేదని జూన్ 20న హిట్‌మ్యాన్‌కు గుప్తా చెప్పినట్లు యూఎస్ అధికారులు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం గుప్తా న్యూయార్క్‌లోని బ్రూక్లిన్‌లో అమెరికా కస్టడీలో ఉన్నాడు.

వికాస్ ప్రభుత్వ ఉద్యోగి కాదు

అభియోగాలు నమోదైన వెంటనే భారత ప్రభుత్వం ప్రతిస్పందించిందని, వికాస్ యాదవ్ ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగి కాదని, ఈ కేసు విషయంలో భారత సహకారానికి ప్రాసిక్యూటర్లు సంతృప్తిగా ఉన్నారని అమెరికా ప్రతినిధి మాథ్యూ మిల్లర్ పేర్కొన్నారు. అమెరికా అభియోగాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, సంబంధిత శాఖలు దీనిని ఇప్పటికే పర్యవేక్షిస్తున్నాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

ప్రపంచ పేదలు 110 కోట్లు

- భారత్‌లోనే 23.4 కోట్ల మంది
- ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక వెల్లడి



యునైటెడ్ నేషన్స్, అక్టోబరు 18: ప్రపంచవ్యాప్తంగా 110 కోట్ల మందికిపైగా ప్రజలు ఇంకా తీవ్రమైన పేదరికంలోనే జీవిస్తున్నారని ఐక్యరాజ్యసమితి తాజాగా విడుదల చేసిన 'గ్లోబల్ మల్టీడైమెన్షనల్ పోవర్టీ ఇండెక్స్-2024' నివేదికలో వెల్లడించింది. 23.4 కోట్ల మందితో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత పాకిస్థాన్, ఇథియోపియా, నైజీరియా దేశాలు ఉన్నాయి. మొత్తం పేదల్లో సగానికి పైగా(58.4 కోట్లు) 18 ఏళ్ల లోపు చిన్నారులు ఉండటం ఆందోళన కలిగించే అంశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పేదల్లో 83.2% మంది ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల్లోనే ఉన్నారని నివేదిక గుర్తించింది. మొత్తం పేదల్లో 83.7% మంది గ్రామాల్లోనే ఉన్నారని నివేదిక చెప్పింది. ఇళ్లు, పారిశుధ్యం, విద్యుత్తు, వంట గ్యాస్, పోషకాహారం లేమి తదితర అంశాలపై 2012-23 మధ్య అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా ఐరాసకు చెందిన యూఎన్‌డీపీ మరో సంస్థ ఓపీహెచ్ఐతో కలిసి ఈ నివేదికను రూపొందించింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 2023లో అధికంగా దేశాల్లో అంతర్గత ఘర్షణలు, పలు దేశాల మధ్య యుద్ధాలు నెలకొన్నాయని, దీని వలన 11.7 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవాల్సి వచ్చిందని నివేదిక తెలిపింది. మొత్తం 110 కోట్ల మంది పేదల్లో ఘర్షణలు, యుద్ధాలు, అశాంతియుత పరిస్థితులు నెలకొన్న రీజియన్లలో 40 శాతం(45.5 కోట్లు) ఉన్నారని వెల్లడించింది.

దేశం	పేదల సంఖ్య
భారత్	23.4 కోట్లు
పాకిస్థాన్	9.3 కోట్లు
ఇథియోపియా	8.6 కోట్లు
నైజీరియా	7.4 కోట్లు
కాంగో	6.6 కోట్లు

సిన్వర్‌ది వీరమరణం

- మృతిని ధ్రువీకరించిన హమాస్
- సిన్వర్ యోధుడని కీర్తించిన ఇరాన్

టెల్ అవీవ్, గాజా, అక్టోబరు 18: దక్షిణ గాజాలో ఇజ్రాయెల్ బలగాలు జరిపిన దాడిలో తమ చీఫ్ యాహ్యా సిన్వర్ మృతి చెందినది నిజమేనని హమాస్ మిలిటెంట్ గ్రూప్ స్పష్టం చేసింది. సిన్వర్ ఇజ్రాయెల్‌పై చివరిదాకా పోరాడి అమరుడయ్యాడని హమాస్ గ్రూప్ డిప్యూటీ చీఫ్ ఖలీల్ అల్ హయ్య కీర్తించారు. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కూడా సిన్వర్‌ను యోధుడిగా కీర్తిస్తూ నివాళులర్పించారు. మరోవైపు, హమాస్ కనుక ఆయుధాలను వదిలి తమ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ పౌరులను విడుదల చేస్తే గాజాలో యుద్ధం రేపే ముగుస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. సిన్వర్ మృతితో యుద్ధం ముగింపు దశ ఆరంభమైందన్నారు. బందీలను అప్పగించకపోతే హమాస్ ఉగ్రవాదులను వేటాడి హతమారుస్తామన్నారు. అయితే, బందీలను విడుదల చేయబోమని హమాస్ స్పష్టం చేసింది. గాజాలో యుద్ధం ఆపి ఇజ్రాయెల్ బలగాలు పూర్తి స్థాయిలో వెనక్కు వెళ్లడంతో పాటు జైళ్లలో మగ్గుతోన్న పాలస్తీనియన్లను విడుదల చేసేదాకా తమ పోరాటం కొనసాగుతుందని తెలిపింది.

చనిపోవడానికి ముందు తీవ్ర గాయాలతో కుర్చీలో ఉన్న సిన్వర్



చివరి క్షణాల వీడియో వైరల్

యాహ్యా సిన్వర్ చివరి క్షణాల వీడియో వైరల్ అయింది. ఐడీఎఫ్ బలగాలు ఈ వీడియోను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశాయి. తన దగ్గరకు వస్తున్న డ్రోన్‌పై సిన్వర్ తన చేతిలోని కర్రను విసురుతున్న దృశ్యాలు ఇందులో ఉన్నాయి. కర్ర విసరడాన్ని ఇజ్రాయెల్‌పై చివరిక్షణంలో కూడా పోరాడినట్లుగా సిన్వర్ సమర్థకులు అభివర్ణిస్తున్నారు. కాగా, ఇజ్రాయెల్ ట్రైనీ సైనికులే సిన్వర్‌ను హతమార్చారు. బుధవారం వారు దక్షిణ గాజాలో ఉగ్రవాదుల కోసం గాలిస్తుండగా ఓ భవనం నుంచి ఉగ్రవాదులు దాడి చేశారు. దీంతో సైనికులు డ్రోన్ల సాయంతో ప్రతిదాడి జరిపారు. బాంబులను ప్రయోగించారు. అప్పుడే సిన్వర్ హతమయ్యాడు.

100 రోజుల్లో టీసీఎస్‌కు శంకుస్థాపన

- విశాఖ ఐటీ రంగానికి ఇది గేమ్ చేంజర్
- సూపర్ 6 అమలుకు కట్టుబడి ఉన్నాం : లోకేశ్
- జగన్ పత్రికపై పరువు నష్టం కేసులో విశాఖ కోర్టుకు



విశాఖ కోర్టుకు హాజరవుతున్న మంత్రి లోకేశ్, పక్కన ఎంపీ శ్రీ భరత్

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ప్రతిష్ఠాత్మక టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సెంటర్ ఏర్పాటుకు వంద రోజుల్లోగా శంకుస్థాపన చేస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఇప్పటికే విశాఖలో పలు ఐటీ కంపెనీలు ఉన్నాయని, అయితే టీసీఎస్ విశాఖ ఐటీ రంగానికి గేమ్ చేంజర్ వంటిదని పేర్కొన్నారు. టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాక పెద్దఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. జగన్ మీడియాపై దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణకు హాజరయ్యేందుకు ఆయన శుక్రవారం విశాఖపట్నం వచ్చారు. అనంతరం కోర్టు బయట విలేకరులతో మాట్లాడారు. 2014-19 మధ్య తమ ప్రభుత్వ హయాంలో వచ్చిన పలు పరిశ్రమలన్నీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక వెళ్లిపోయాయన్నారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయిన తరువాత పరిశ్రమలు, ఐటీ కంపెనీలతో మాట్లాడి ఒక్కొక్కటి తిరిగి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పారిశ్రామికవేత్తలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇచ్చేందుకు యువ ఐఏఎస్ అధికారితో ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. వచ్చే నెలలో అమెరికా పర్యటన ఉందని, అక్కడ పలు కంపెనీల సీఈవోలతో భేటీ అవుతానని వివరించారు.

వర్సిటీల్లో అక్రమాలపై విచారణ

సూపర్ సిక్స్ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ స్పష్టం చేశారు. వచ్చే నవంబరు లేదా డిసెంబరులో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని తెలిపారు. ప్రజలకు సంబంధించినంత వరకూ జనన, మరణ, కులం, వివాహ ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా త్వరలో వాట్సాప్‌ల ద్వారా సేవలు అందిస్తామని వెల్లడించారు. విశ్వవిద్యాలయాలకు పూర్తిస్థాయి ఉపకులపతుల నియామకం చేపట్టిన తరువాత గత ప్రభుత్వ హయాంలో వర్సిటీల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి దోషులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

జగన్ ఎందుకు భయపడుతున్నారు?

గతంలో మంత్రిగా ఉన్నప్పుడు తనపై సాక్షి తప్పుడు కథనం రాసిందని, కోర్టులో పరువునష్టం దావా వేశానన్నారు. ఈ కేసుకు సంబంధించి క్రాస్ ఎగ్జామినేషన్‌కు రెండోసారి వచ్చానని, గతంలో కానీ, ఇప్పుడు కానీ ప్రభుత్వ వాహనాలు వినియోగించలేదన్నారు. ఇప్పటికీ సాక్షి తప్పుడు కథనాలు రాస్తోందని, వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెడ్‌బుక్ చూస్తే వైసీపీ అధినేత జగన్ ఎందుకు భయపడుతున్నారని లోకేశ్ ప్రశ్నించారు. ఎన్డీయే ప్రభుత్వం ఉన్నంత వరకు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రశ్నరాదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రుషికొండపై రూ.500 కోట్లతో ప్యాలెస్ నిర్మించారని, అక్కడ పర్యావరణ చట్టాలు ఉల్లంఘించడంతో ఎన్జీటీ రూ.200 కోట్లు జరిమానా విధించిందన్నారు. రుషికొండ ప్యాలెస్‌ను ఏ విధంగా వినియోగించుకోవాలో ప్రజలు సూచనలు ఇవ్వాలని లోకేశ్ కోరారు. ప్రైవేటు షాపుల్లో మద్యం ఎంఆర్‌పీకే అమ్మాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య సమన్వయం లేదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. తెలుగుదేశం పార్టీ పెద్ద కుటుంబమని, కుటుంబంలో చిన్నచిన్న సమస్యలు వస్తుంటాయని, కూర్చుని చర్చించుకుని పరిష్కరిస్తామన్నారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై

సీఎంతో చర్చిస్తా

- బార్ అసోసియేషన్ సమావేశంలో మంత్రి లోకేశ్

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు న్యాయవాదులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తామని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలో విశాఖ బార్ అసోసియేషన్ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. న్యాయవాదులకు హెల్త్ కార్డుల జారీ గురించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకంతో అనుసంధానం చేసి మెరుగైన స్కీమ్ తీసుకురావాలన్నదే తమ లక్ష్యమన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. అనంతరం మంత్రి లోకేశ్‌ను బార్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు.

జమిలిపై నిర్ణయం కాలేదు: ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 'జమిలి ఎన్నికలపై ఇంకా నిర్ణయం కాలేదు. అదంతా చర్చ మాత్రమే' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ సభ్యత్వాల నమోదుపై సమీక్ష జరిగింది. ఆ సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడారు. అనంతరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి బీజేపీ క్రియాశీల సభ్యత్వం తీసుకున్నారు.

ఎన్నారై కోటా సీట్లకు దరఖాస్తుల గడువు పెంపు

అమరావతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎన్నారై కోటా కింద ఎమ్మెస్సీ, ఎంటెక్, పీహెచ్‌డీ సీట్ల కోసం దరఖాస్తుల తేదీని వచ్చే నెల 15వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ రామచంద్రరావు తెలిపారు. ఈ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తులను పోస్టల్ లేదా వ్యక్తిగతంగా అందజేయాలని సూచించారు. ఈ నెల 22, 23తేదీల్లో ఎన్నారై కోటా అభ్యర్థులకు బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ రెండో దశ, బీఎస్సీ అగ్రికల్చర్ మూడో దశ కౌన్సెలింగ్ మాన్యువల్‌గా జరుగుతుందని తెలిపారు. వీటికి దరఖాస్తులను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చన్నారు.

కడపలో నవంబరు 10 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నవంబరు 10 నుంచి 15వ తేదీ వరకు కడప జిల్లాలోని డీఎస్ఏ స్టేడియంలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతుందని గుంటూరులోని బ్రాంచ్ రిక్రూటింగ్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, ఆఫీసు అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ 10వ తరగతి ట్రేడ్‌మెన్, 8వ తరగతి ట్రేడ్స్‌మెన్‌లకు రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతుందని పేర్కొంది. రిక్రూట్‌మెంట్ ర్యాలీ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించింది.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

తొలి అడుగు..!

పాకిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సుకు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరుకావడం ఒక విశేషమైన పరిణామం. దాదాపు పదేళ్ళ తరువాత భారతవిదేశాంగమంత్రి పాకిస్థాన్‌లో కాలూనిన సందర్భం ఇది. షాంఘై సహకార సంస్థ సదస్సుకు పాకిస్థాన్ అతిథ్యం ఇస్తున్నది కనుక, ఈ విస్తృత వేదికలో భాగస్వామిగా, ఆ సదస్సులో పాలుపంచుకోవడానికి మాత్రమే ఆయన వెడుతున్నారు తప్ప పాకిస్థాన్‌తో రాసుకుపూసుకొనేదేమీ ఉండదని ప్రయాణానికి ఎంతో ముందుగానే జైశంకర్ పక్షాన ఆయన మంత్రిత్వశాఖ ఓ మాట చెప్పింది కూడా. ఆయన ప్రయాణం, పెద్దలతో భేటీలు ద్వైపాక్షికవ్యవహారం కాకపోవచ్చును కానీ, ఉభయదేశాల మధ్యా గడ్డకట్టుకొనిపోయిన దౌత్యసంబంధాల్లో కాస్తంత సానుకూలమైన మార్పు తీసుకురావడానికి ఆయన పర్యటన పరోక్షంగా ఉపకరించవచ్చు. సదస్సు సందర్భంగా పాకిస్థాన్‌తో విడిగా ఎటువంటి మంతనాలు, చర్చలూ ఉండవని మనం తేల్చేయడమూ, అటు పాకిస్థాన్ కూడా అదే తరహాలో ద్వైపాక్షిక చర్చలు ఉండవంటూ స్పందించడం ఒక విధంగా వాతావరణాన్ని సానుకూలం చేసింది. అన్ని అనుమానాలు, శషబిషలు పక్కనబెట్టి చక్కగా పలకరించుకొని, చేయీచేయీ కలుపుకొని, కాస్తంత నవ్వుకోవడానికి ఈ పరిస్థితి అవకాశం ఇచ్చింది.

వాతావరణం బాగా ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో, వేరొక అవసరం చేత పొరుగుదేశానికి ప్రయాణం కట్టవలసివచ్చినా కూడా దానినుంచి మిగతావారు ఊహించేదీ ఎక్కువే ఉంటుంది. అందువల్ల, ఈ పర్యటనకు ఏ విలువా లేదని ఉభయులూ ముందుగానే తేల్చేస్తే ఆ మేరకు ఆశతో పాటు, ప్రమాదం కూడా తగ్గుతుంది. దౌత్యసంబంధాలను కాస్తంత చక్కదిద్దుకోడానికి కొంతకాలంగా తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం ఉన్న నేపథ్యంలో ఇది మరీ అవసరం. అంతవరకూ సంబంధాలు అద్భుతంగా ఉన్నాయని కాదు కానీ, జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు నిర్ణయం రెండు దేశాల మధ్యా అతిపెద్ద అగాధాన్ని సృష్టించింది. ఢిల్లీలో తన హైకమిషనర్‌ను ఉపసంహరించుకొని, తనదేశంనుంచి మనవారిని వెళ్ళగొట్టి, వాణిజ్యసంబంధాలను సైతం తెగదెంపులు చేసుకొని చాలా హడావుడి చేసింది. జమ్మూకశ్మీర్‌కు తిరిగి ఆ అధికారాలన్నీ దక్కితేనే తననుంచి ఓ మాట, ఓ పలకరింపు ఆశించాలని స్పష్టంచేసింది. మనకు మరింత దూరంగా పోయి, ద్వైపాక్షిక చర్చలను కాదనుకున్నది ఆ దేశమే.

ఈ పరిస్థితుల మధ్య, వెళ్ళిన పనేదో చూసుకొని రావడం తప్ప, జయశంకర్ పర్యటనలో ఏవో విశేషాలు, అనూహ్యమైన మలుపులూ ఉంటాయని ఎవరూ ఆశించలేదు. తన ప్రసంగంలో ఉగ్రవాదం గురించి, దానిని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ తదితర దేశాల గురించి తాను చెప్పదల్చుకున్నదేదో జైశంకర్ కూడా కుండబద్దలు కొట్టేశారు. పొరుగుదేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గుర్తించి గౌరవించుకోవడం నేర్చుకోమంటూ చైనా, పాకిస్థాన్‌కు గట్టిగానే చీవాట్లు వేశారు. ఉభయదేశాల మధ్యా దూరాన్ని పెంచుతున్న ఉగ్రవాదంతో నిజాయితీగా పోరాడాలంటూ పాకిస్థాన్‌కు హితవు చెప్పారు. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్‌ఐ) మరింత విస్తరించాలనీ, హైవేలు, ఓడరేవులు, రైల్వేలైన్లతో ఆసియా నుంచి ఆఫ్రికావరకూ అంతా కళకళలాడిపోవాలని పాకిస్థాన్ ప్రధాని చైనాను ఆకాశానికి ఎత్తేస్తే, దానికి పూర్తి భిన్నమైన, విరుగుడు వ్యాఖ్యలు జైశంకర్ చేశారు.

ఆర్థికం, వాణిజ్యం, పర్యావరణం తదితర అంశాలపట్ల ఆయా ప్రభుత్వాల అధికారిక వైఖరులు ఎలా ఉన్నప్పటికీ, ఈ సందర్భంగా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం. ఇటీవల ప్రతీసందర్భంలోనూ, అన్ని అంతర్జాతీయవేదికలమీదా ఆయన కశ్మీర్ ఊసులేకుండా ప్రసంగాలు చేయలేదు. అలాగే, విందు సందర్భంలో ఆయన జైశంకర్‌తో కాస్త ఎడంగా కొద్దిసేపు ముచ్చటించడం, పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగమంత్రులు కూడా సుదీర్ఘసమయం మాట్లాడటం వంటివి జరిగాయి. మరోవైపు, ఎస్సీవో సదస్సుకోసం పాకిస్థాన్ వెళ్ళిన భారతదేశ పాత్రికేయులతో పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్‌షరీఫ్, ఆయన కుమార్తె మరియం నవాజ్ ప్రత్యేకంగా భేటీ కావడం, జైశంకర్ పర్యటనను తొలి అడుగుగా అభివర్ణించడం విశేషం. భారతజర్నలిస్టులతో వారిరువురూ భేటీ కావడంపై పాకిస్థాన్ మీడియా సంస్థలు భిన్నంగా స్పందించాయి కూడా. సహకార సంస్థ సదస్సుకు భారతప్రధాని నరేంద్రమోదీ వచ్చివుంటే ఎంతో బాగుండేదని నవాజ్ షరీఫ్ ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్య కూడా అందరినీ ఆకర్షించింది. ఇవన్నీ చిన్నచిన్న విషయాలే అయినప్పటికీ, ఉభయదేశాల మధ్యా ఉన్న ఉక్కబోత వాతావరణాన్ని కాస్తంత ఉపశమింపచేసేందుకు ఉపకరిస్తాయి.

సంఘ్ శతాబ్ది వేళ భగవత్ మాట

మోహన్ భగవత్‌కు చిత్రమైన సమయ భావం ఉన్నది. ఆయన ఉపన్యాసాలు వెలువరించడం అరుదు. అయితే ఉపన్యసించడానికి ఆయన ఎంపిక చేసుకునే రోజు, సందర్భం ప్రశస్తమైనవి. తన భావాలను వ్యక్తం చేసేందుకు ఆయన వాడే మాటలు శ్రేష్ఠమైనవి. నేను ఆయన ఉపన్యాసాలను ఆంగ్లానువాదంలో మాత్రమే చదివాను. చాలా మంది ఆయన అభిప్రాయాలతో తీవ్రంగా విభేదిస్తారు. నాకూ వాటితో ఏ మాత్రం ఏకీభావం లేదు. ఏమైనా భగవత్ ముఖ్యంగా 2014 అనంతరం వెలువరిస్తున్న ఉపన్యాసాలు సంఘ్ శ్రేణులనే కాదు, ఇతరులనూ ఆకట్టుకుంటున్నాయనడంలో ఎవరికీ మరో అభిప్రాయం లేదు.

భగవత్ ఉపన్యాసాలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధికార వాణిగా సర్వత్రా గుర్తింపు ఉన్నది. అందుకు ఆ సంస్థ స్వభావమూ, నిర్మాణ విలక్షణతతో పాటు సర్ సంఘ్‌చాలక్‌గా భగవత్ సర్వోన్నత ప్రాధాన్యమే కారణం. భగవత్‌కు సంఘ్‌లో తిరుగులేని అధికారమున్నదని అందరూ విశ్వసిస్తారు. కనుక ఆయన ఉపన్యాసాలను, ముఖ్యంగా ఇటీవలి కాలంలో అందరూ గంభీరంగా ఆలకిస్తున్నారు, వాటి గురించి నిశితంగా ఆలోచిస్తున్నారు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

జూన్ 2024లో లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రకటించిన కొద్ది రోజులకే మోహన్ భగవత్ ఒక ఉపన్యాసం వెలువరించారు. ఆ ప్రసంగంలోని ప్రధానాంశం: 'అహంకారాన్ని విడనాడి వినయ విధేయతలతో ప్రవర్తించాలి'. లోక్‌సభ ఎన్నికల అనంతరం అది ఆయన మొదటి బహిరంగ ఉపన్యాసం. అందులో ఆయన ఇలా అన్నారు: అబద్ధాలతో కూడిన, నిందాపూర్వక భాషను ఉపయోగించిన ఎన్నికల ప్రచార ప్రసంగాలు రాజకీయ పార్టీలు పాటించాల్సిన మర్యాదలను పూర్తిగా ఉల్లంఘించినవే అవుతాయి; మీ ప్రత్యర్థి మీ శత్రువు కాదు. అతడు ఒక విరుద్ధ దృక్పథానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. శత్రువుగా కాక ప్రతిపక్ష అభ్యర్థిగా భావించాలి. ప్రతిపక్ష భావాలు, అభిప్రాయాలను కూడా తప్పక పరిగణనలోకి తీసుకోవాలి; ఒక నిజమైన స్వయం సేవకుడు హుందాగా ప్రవర్తిస్తాడు. ప్రత్యర్థికి మర్యాద ఇచ్చి మర్యాద పుచ్చుకుంటాడు. 'నేను ఈ పని చేశాను' అన్న అహంకారం అతడికి ఏ కోశాన ఉండదు, ఉండకూడదు. నరేంద్ర మోదీని, ఆయన ఎన్నికల ప్రచార సరళిని దృష్టిలో ఉంచుకునే భగవత్ ఈ ప్రసంగం చేశారని ఆనాడు అందరూ భావించారు.

జూలై 2024లో వెలువరించిన మరొక ఉపన్యాసంలో ఆయన ఈ సుప్రసిద్ధ వ్యాఖ్యలు చేశారు: 'ఒక వ్యక్తి తొలుత ఒక మహా మనిషి కావాలనుకున్నాడు, ఆ తరువాత ఒక దేవుడు అవ్వాలని ఆశించాడు; పిదప ఒక భగవాన్‌గా లోకులు తనను పూజించాలని కోరుకున్నాడు'. తాను అందరిలా జైవికంగా జన్మించలేదని నరేంద్ర మోదీ స్వయంగా చెప్పుకున్న గొప్పలను నిర్ద్వంద్వంగా నిరాకరించడమే కాదూ భగవత్ వ్యాఖ్యలు? తల్లి గర్భధారణ, గర్భావధి (గర్భధారణ నుంచి శిశు జననందాకా సమయం), ప్రసవం అనే సహజ ప్రక్రియలకు తాను అతీతుడినని, పరాత్పరుడు తనను నేరుగా 'సృష్టించాడు' అని భావించారా? అలా అయితే మోదీ ఒక పరిధి మించి మాట్లాడారని భగవత్ తన వ్యాఖ్యలతో స్పష్టంగా సూచించినట్టు అనుకోవచ్చు.



భగవత్ ఉపన్యాసాలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధికార వాణిగా సర్వత్రా గుర్తింపు ఉన్నది. అందుకు ఆ సంస్థ స్వభావమూ, నిర్మాణ విలక్షణతతో పాటు సర్ సంఘ్‌చాలక్‌గా భగవత్ సర్వోన్నత ప్రాధాన్యమే కారణం. భగవత్‌కు సంఘ్‌లో తిరుగులేని అధికారమున్నదని అందరూ విశ్వసిస్తారు. కనుక ఆయన ఉపన్యాసాలను, ముఖ్యంగా ఇటీవలి కాలంలో అందరూ గంభీరంగా ఆలకిస్తున్నారు.

విజయదశమి (అక్టోబర్ 12, 2024) రోజున రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తన 100వ సంవత్సరంలోకి ప్రవేశించింది. ఆ సందర్భంగా మోహన్ భగవత్ తన మూడవ సుప్రసిద్ధ ఉపన్యాసాన్ని వెలువరించారు (టైమ్స్ ఆఫ్ ఇండియా, ఇండియా టైమ్స్.కామ్ అనువదించి నివేదించిన ఆ ప్రసంగ పాఠాన్ని మాత్రమే నేను చదివాను) ఆ ఉపన్యాసం నాకు ఆశాభంగం కలిగించింది, అయితే ఆశ్చర్యపరచలేదు. భగవత్ ఆ ఉపన్యాసంలో వ్యవస్థిత ఆరెస్సెస్ భావజాల వైఖరులకు మళ్లీ మళ్లారు. ఆయన ఆ ఉపన్యాసంలో ధర్మం, సంస్కృతి, వ్యక్తిగత సౌశీల్యం, జాతీయ వ్యక్తిత్వం ధర్మ విజయం, మంగళప్రదమైన భవిష్యత్తు, నైతికత, స్వాభిమానం, ఆత్మగౌరవం ఇత్యాది మాటలు ధారాళంగా వాడారు. హమాస్, ఇజ్రాయిల్ మధ్య యుద్ధం గురించి పరోక్షంగా సూచించారు. అయితే ఆ మారణకాండలో 43 వేల మంది హతమయ్యారన్న విషయాన్ని ప్రస్తావించలేదు; అలాగే జమ్మూ–కశ్మీర్ ఎన్నికల గురించి కూడా. అయితే కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలుపనే లేదు; మణిపూర్ విషయానికి వస్తే అక్కడి పరిస్థితులు 'ఆందోళన' కలిగిస్తున్నాయని మాత్రమే ముక్తసరిగా పేర్కొన్నారు.

భగవత్ ప్రసంగంలోని మిగతా అంశాలన్నీ మోదీ తరహా ఉపన్యాస ధోరణిలో ఉన్నాయి: భారత్ ఎలా శక్తిమంతమైన జాతిగా ఎదిగింది, మన విశ్వ సౌభ్రాతృత్వ ఆదర్శాన్ని ప్రపంచం ఎలా అంగీకరించింది, భారత్ పేరు ప్రతిష్ఠలు, ప్రభావ ప్రాబల్యాలు అంతర్జాతీయంగా నిరంతరం ఎలా పెరుగుతున్నాయో భగవత్ ప్రస్తావించారు. మరిన్ని విషయాలు కూడా భగవత్ పేర్కొన్నారు. భారత్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయని, ఉదారవాద దేశాలుగా పేరు పొందిన పాశ్చాత్య రాజ్యాలు ఇతర దేశాలపై దాడి చేసేందుకు, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను చట్టవిరుద్ధంగా లేదా హింసాత్మక మార్గాలలో కూలగొట్టేందుకు వెనుకాడడం లేదని, అబద్ధాల ఆధారంగా భారత్ యశోవైభవాన్ని కళంకితం చేసేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తున్నాయని భగవత్ అన్నారు. తన తీవ్ర ఆరోపణలకు భగవత్ ఎలాంటి సాక్ష్యాధారాలు చూపలేదు. బంగ్లాదేశ్ గురించి ప్రస్తావిస్తూ ఆ దేశంలో హిందువులపై నిష్కారణంగా క్రూర దాడులు చేస్తున్నారని ఆయన అన్నారు. హిందువులతో సహా అన్ని మైనారిటీ మత వర్గాల భద్రత ప్రమాదంలో పడిందని ఆయన అన్నారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమ చొరబాట్లు పెరుగుతున్న పర్యవసానంగా జనాభాపరమైన అసమతౌల్యతలు ఏర్పడుతున్నాయని అన్నారు. ఉపన్యాసం ముగింపులో మోదీ మాదిరిగానే భగవత్ కూడా ఇలా అన్నారు: 'అసంఘటితంగా ఉండడం వల్ల బలహీనపడతామని, దుష్టుల దాడులు, దౌర్జన్యాలకు గురికావలసి వస్తుందనే పాఠాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు అందరూ నేర్చుకోవాలి'. ఆధునిక రాజకీయ పరిభాషను ఉపయోగించడంలో ఆరెస్సెస్ నైపుణ్యం సాధించినట్టు భగవత్ ఉపన్యాసం విశదం చేసింది. డీప్ స్టేట్, కల్చరల్ మార్క్సిస్ట్, ఫాల్ట్ లైన్స్, ఆల్టర్‌నేటివ్ పాలిటిక్స్ మొదలైన మాటలు, భావనలను ఆయన ఉదారంగా వాడారు. 'అర్బన్ నక్సల్స్', 'తుక్డే తుక్డే గ్యాంగ్' అనే మాటలను ఆయన ఎందుకనో విడిచిపెట్టారు.

మొత్తం మీద రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీ తమ విభేదాలు తొలగించుకుని కలసికట్టుగా ముందుకు సాగేందుకు సంకల్పించుకున్నట్టు కనిపిస్తుంది. నరేంద్ర మోదీ ప్రకటనలు, చర్యలను ఆక్షేపించి ఆయనను నిగ్రహించేవారు ఎవరూ లేకపోతే జరిగేదేమిటి? ఆయన తన అధికారాన్ని మరింత విచక్షణారహితంగా ఉపయోగించేందుకు, ప్రతిపక్షాలను ఛిన్నాభిన్నం చేసేందుకు; ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అసమానతలు, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, సామాజిక అణచివేత, మతతత్వ ఘర్షణలు, అన్యాయాలకు దారితీసిన తన విధానాలను మరింత ధైర్యంగా అమలుపరిచేందుకు ఆయన సాహసిస్తారు. గత పదేళ్ల మోదీ పాలనను మరింత తీవ్రస్థాయిలో చవిచూసేందుకు సర్వసన్నద్ధంగా ఉండండి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

'గంధర్వ' లోక మలయమారుతాలు


వృత్తిపరమైన వాగుడుకాయ (సంతోషాన్ని ఇవ్వడమే కాకుండా లాభదాయకమైన ఔద్యోగిక వ్యవహారం)కు ఎదురయ్యే సంకటాలలో ఒకటి ఉపన్యాసాన్ని వెలువరించిన అనంతరం స్వీకరించే కానుకలు. ఈ కానుకలు చాలా బరువుగా ఉండడం కద్దు. అయితే అవి చాలవరకు నిరుపయోగకరమైనవి. ఉదాహరణకు అతిథేయి సంస్థ పేరు, లోగో ముద్రించి ఉన్న ఫలకాలు. అప్పుడప్పుడు పుష్పగుచ్ఛం మొదలైన సౌందర్యాత్మక కానుకలు లభిస్తాయి. అయితే ఉపన్యాసం వెలువరించింది బెంగళూరు కాక ఇతర ప్రదేశాలలో అయితే ఆ పువ్వులు ఇంటికి రాకముందే వాడిపోతాయి.

మూడు దశాబ్దాలుగా వివిధ వేదికలపై ఉపన్యాసాలు వెలువరిస్తున్న నాకు చాలా అరుదుగా లభించిన ఒక విలువైన, నా మనస్సుకు అమితంగా నచ్చిన కానుక నేను చదువుకున్న ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి లభించింది. 2000 సంవత్సరం నాటి సందర్భమది. ఏ విషయంపై ఉపన్యసించానో నాకు ఇప్పుడు గుర్తులేదు. అయితే ఉపన్యాసం అనంతరం ఆతిథేయి నుంచి లభించిన కానుక ఏమిటో ఇప్పటికీ నాకు బాగా గుర్తు ఉన్నది. ఆ కానుక ఇప్పటికీ నావద్ద భద్రంగా ఉన్నది. అది కుమార్ గంధర్వ సంగీతపు ఎనిమిది వాల్యూమ్‌ల సీడీ సెట్. ఆ కానుకను ఆ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ అనిత రామ్‌పాల్ స్వయంగా ఎంపిక చేశారు. 1970ల్లో ఆమె, నేను ఢిల్లీ వర్శిటీ విద్యార్థులం. అప్పుడప్పుడు తన బాయ్‌ఫ్రెండ్ (ఆ తరువాత భర్త) అయిన భౌతిక శాస్త్రవేత్త వినోద్ రైనాతో కలిసి సంగీత కచేరీలకు నేను హాజరవుతుండడం ఆమెకు బాగా తెలుసు.

అప్పట్లో మేము వెళ్లిన గాన కచేరీలలో ఒకటి కుమార్ గంధర్వది. ఆయన తన భార్య వసుంధర కొమ్కలితో కలిసి ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు మండి హౌజ్ సమీపంలోని ఫిక్కి ఆడిటోరియంలో ఆ సంగీత కచేరి జరిగినట్టు నాకు గుర్తు. దాదాపు రెండు గంటలపాటు కుమార్ గంధర్వ స్వరకల్పన చేసిన భజన్‌లు, జానపద గేయాలను ఆ భార్యాభర్తలు మధురంగా గానం చేశారు. అద్భుతం, సంపూర్ణంగా అద్భుతం ఆ వీనుల విందు. ఆడిటోరియం చివరివరుసలో కూర్చున్నప్పటికీ కుమార్ గంధర్వ లోకోత్తర గాన మాధుర్యం నన్ను బాగా పరవశుడిని చేసింది. ఆ పరవశత్వం ఎన్నటికీ మరువలేనిది.

అనితా రామ్‌పాల్ నాకు కానుకగా ఇచ్చిన సీడీలలో ఆ రోజు కుమార్ గంధర్వ గానం చేసిన భజన్‌లు మరికొన్ని ఇతర కృతులు ఉన్నాయి. మనోహరమైన జోడ్ రాగాల గానం కూడా వాటిలో ఉన్నది. కవితాత్మక హమీర్, గ్రాండ్ శంకర రాగాలలో గానం చేసిన ఖయాల్స్ కూడా ఉన్నాయి. కుమార్ గంధర్వ రాగ నంద్‌లో అద్వితీయంగా గానం చేసిన రాజాన్ అబ్కీ ఆ రె మొదలైన బండిష్‌లూ వాటిలో ఉన్నాయి. ఇప్పుడు చాలా అరుదుగా విన్పించే పత్మాంజరి రాగంలో గానం చేసిన 15 నిమిషాల ఖయాల్ నొకదాన్ని ప్రత్యేకంగా మళ్లీ మళ్లీ వింటుంటాను.

నాకు కానుకగా లభించిన ఆ సీడీలను ఒక దశాబ్దం పాటు ఇంటి వద్ద పదే పదే వింటుండేవాణ్ణి. 2010లో కాబోలు ఐ పాడ్‌ను కొనుక్కున్న తరువాత వాటిని ఆ అధునాతన సాధనంలో భద్రపరిచాను. సుదూర విమాన ప్రయాణాలలో వాటిని వింటూ సుఖంగా విహరిస్తుంటాను. ఆ సీడీలలో సుప్రసిద్ధ నిర్గుణ్ భజన్‌లు ఉన్నప్పటికీ కుమార్ గంధర్వ స్వయంగా స్వరకల్పన చేయనప్పటికీ ఆయనకు అజరామర కీర్తిని సమకూర్చిన జమునా కినారే మోరాగావ్ వాటిలో లేదు.



akbar

కుమార్ గంధర్వ గాన శ్రవణానందంలో ఓలలాడుతూ నేను వృద్ధాప్యంలోకి ప్రవేశించాను. అజరామరమైన ఆయన సంగీతం నా అంతిమ క్షణాల దాకా నాతో సహవాసం చేస్తుంది. నేను ఈ భవబంధాల నుంచి విముక్తమై సుదూర తీరాలకు పయనమయినప్పుడు దయాశీలుడు అయిన స్నేహితుడో లేదా ప్రేమాస్పదుడయిన కుటుంబ సభ్యుడో, కుమార్ గంధర్వ లోకోత్తర మాధుర్యంతో గానం చేసిన జమునా కినారే మోరాగావ్ నాదాలు నా వీనుల్లో ప్రతిధ్వనించేలా శ్రద్ధ చూపగలరని ఆశిస్తున్నాను, చూపాలని ఆకాంక్షిస్తున్నాను.

కుమార్ గంధర్వ గానంతో నాకు ఆత్మీయాను బంధం ఉన్నది. అయితే జమునా కినారేతో నా అనుబంధం ప్రత్యేకమైనది, వ్యక్తిగతమైనది. డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో నేను పుట్టి పెరిగాను. నా తల్లిదండ్రుల గృహం ఆ సంస్థ ప్రాంగణం ఉత్తర దిక్కున చివరలో ఒక కొండపై టాన్స్ అనే నదీ దృశ్యాలు స్పష్టంగా కనిపించే చోట ఉన్నది. ఆ నది పశ్చిమ దిక్కుగా సాగి అసన్‌తో సంగమించి ఆ తరువాత మరింత పశ్చిమంగా మరికొన్ని మైళ్లు ప్రవహించి యమునా నదిలో కలుస్తుంది. క్షమార్హమైన అతిశయోక్తితో జమునా కినారే మోరాగావ్ పాట నా బాల్యంలో అంతర్భాగంగా ఉన్న టాన్స్ నది గురించేనని చెప్పుకోవడానికి సందేహించను. యమున ఉపనది తీరాన నేను పుట్టిన ప్రదేశం ఉన్నది. సెలవు రోజుల్లో మా కుటుంబం వ్యాహాళికై ఆ నదీతీరానికి వెళ్లేది. ఆ నది కొండల నుంచి మైదాన ప్రాంతంలోకి దిగే ప్రదేశంలో పావోంట సాహిబ్ అనే పవిత్ర సిక్కు మత ఆరాధనా మందిరం ఉండేది. ఆ గురుద్వారా నా బాల్య స్మృతులలో ప్రధానమైనది.



■ రామచంద్ర గుహ

గతానుగతం

కుమార్ గంధర్వ గానం చేసిన జమునా కినారే యు ట్యూబ్‌లో అందరికీ అందుబాటులో ఉన్నది. నేను ఏదైనా క్లిష్టమైన సమావేశాలకు వెళ్లే ముందు ఆ పాటను తప్పక వింటాను. అప్పుడప్పుడు కుమార్ గంధర్వ కుమారుడు ముకుల్ శివపుత్ర గానం చేసిన జమునా కినారేను కూడా వింటుంటాను. గంభీరమైన గానమది. ముకుల్ జై జయవంతి, కేదార్, ఖమాజ్ రాగాల ఆలాపన కూడా నాకు బాగా ఇష్టం.

ఈ శరదృతువు ఆరంభంలో జమునా కినారేను ప్రత్యక్షంగా విన్నాను. తండ్రి ప్రతిభను పుణికిపుచ్చుకున్న కుమార్ గంధర్వ కుమార్తె కలాపిని కోమ్కలి గాన మాధురి అది. తండ్రి శత జయంత్యుత్సవాలలో భాగంగా బెంగళూరులో ఆమె పాట కచేరి జరిగింది. ఆ రాగ సుధా స్రవంతికి ముందు, జీవిత వివిధ దశలలోను, విభిన్న సందర్భాలలోను కుమార్ గంధర్వ ఛాయా చిత్రాల స్లైడ్ షో నిర్వహించారు. నన్ను అమితంగా ఆకట్టుకున్న, భావోద్వేగానికి లోనుచేసిన ఛాయా చిత్రం 1991లో ధార్వాడ్‌లో మల్లికార్జున్ మన్సూర్‌తో కుమార్ జీ ఉన్న బొమ్మ.

బాంబే కర్ణాటకగా పిలవబడే ప్రాంతం (ఈ సీమ సాంస్కృతిక రాజధాని ధార్వాడ్)లో ఒక దశాబ్దంన్నర కాలంలో ఒకరి తరువాత ఒకరు పుట్టిన ఐదుగురు మహాగాయకులలో మన్సూర్ ఒకరు. ఆయనే అందరి కంటే పెద్దవాడు. ఆ సంగీత ప్రతిభామూర్తుల బృందంలో అందరికంటే చిన్నవాడు కుమార్ గంధర్వ. మిగతా ముగ్గురు గంగూబాయి హంగల్, భీమ్‌సేన్ జోషి, బసవరాజ్ రాజగురు. ఒకసారి కుమార్‌జీ ముందుగా తెలుపకుండా మన్సూర్ గృహానికి వెళ్లారు. సంగీతంలో తన సమస్కంధుడు అయిన కుమార్ గంధర్వ తన 'పెద్దన్న'ను చివరిసారి చూడడానికి వచ్చి ఉంటాడని మల్లికార్జున్‌జీ భావించారు. కుమార్‌జీ కంటే మన్సూర్ వయస్సులో చాలా పెద్దవాడు. పైగా నిరంతరాయంగా సిగరెట్‌పై సిగరెట్ కాల్చే ధూమపాన ప్రియుడు. ఆ మహాగాయకుల మధ్య ఈ చివరి సమావేశ మనంతరం కొద్ది రోజులకే కుమార్ గంధర్వ మరణించారు. మల్లికార్జున్ మన్సూర్ పరితాపానికి అంతులేకపోయింది. ఆయన్ను ఊరడించడం ఎవరికీ శక్యం కాలేదు. నా తమ్ముడు నా కంటే ముందే వెళ్లిపోయాడు అని మన్సూర్ రోదించారు (ఆ తరువాత కొద్ది నెలలకే మన్సూర్ కూడా మరణించారు).

కలాపిని కొమ్కలి తన గాన కచేరీని తండ్రి భీమ్ పలాసి రాగంలో స్వరకల్పన చేసిన మూడు కృతులతో ఆరంభించారు. భీమ్ పలాసి ఒక గంభీర, వైదుష్య వైభవోపేత రాగం. కలాపిని గానం ఆ రాగ గుణ విశేషాలకు సముచిత ఉదాత్తత కల్పించింది. ఆ తరువాత, తండ్రి కుమార్ గంధర్వ స్వయంగా సృష్టించిన జోడ్ రాగాలలో ఒకటైన శ్రీ కల్యాణ్‌లో కొన్ని కృతులను గానం చేశారు. ఆ తరువాత మాల్వా జానపద గేయాన్ని ఆమె ఆలాపించారు. బాంబేలో సంగీత శిక్షణ పొందిన కన్నడిగుడు అయిన కుమార్ గంధర్వ ఆరోగ్య కారణాల రీత్యా కొన్ని సంవత్సరాల పాటు మధ్యప్రదేశ్‌లోని మాల్వా ప్రాంతంలో నివసించారు.

కలాపిని గాన మాధురిని ఆస్వాదిస్తూ కచేరి ముగిసే లోగా ఆమె జమునా కినారే మోరాగావ్‌ను కూడా ఆలపిస్తే బాగుండునని అనిపించింది. ఆ మధుర గీతాన్ని కుమార్ గంధర్వ తనయ నోట వినాలనే ఉత్సుకత నాలో కలిగింది. ఇదే నేను నా యవ్వన కాలంలో అయితే నా 'ఫర్మాయిష్' (అభ్యర్థన)ను పెద్దగా అరుస్తూ చేసేవాణ్ణి లేదా ఒక కాగితం మీద రాసి పంపేవాణ్ణి. అయితే ఇప్పుడు ఇంత వయస్సులో అలా చేయడానికి వెనుకాడాను. పెద్దరికంతో వ్యవహరించాలి కదా. కనుక మౌనంగా ఉండిపోయాను. అయితే కలాపిని, తన తండ్రి కుమార గంధర్వ పేరు ప్రతిష్ఠలతో ముడివడి ఉన్న ఆ సుప్రసిద్ధ గీతాలాపనతో తన గాన కచేరిని ముగించారు (నేనే కాదు, అక్కడ ఉన్న శ్రోతలలో అత్యధికులు ఆ పాటను వినాలని ఆరాటపడుతున్నారనే విషయం బహుశా ఆమె గ్రహించే ఉంటారు).

జమునా కినారే మోరాగావ్‌ను తన తండ్రి శైలిలో ఆమె గొప్ప ఓజస్సుతో గానం చేశారు. ఆమె పాడుతుండగా అరమోడ్పు కళ్లతో కూచుండిపోయాను. నా మనస్సు నా బాల్యంలోకి పరుగెత్తింది. నాకు చిరపరిచితమైన అడవులు, యమునా తీర సుందర ప్రాంతాలు, పొడవైన, విశాల బాటలు మదిలో మెరిసాయి. మరుసటి రోజు ఉదయం యు ట్యూబ్‌కు వెళ్లాను. 'కుమార్ గంధర్వ/ వసుంధర కోమ్కలి భజన్ కన్సర్ట్ న్యూ ఢిల్లీ 1978' అని టైప్ చేశాను. ఆశ్చర్యకరంగా ఆ లింక్ లభించింది. ఆనాడు నేను వెళ్లిన కచేరీనే అది. 110 నిమిషాల పాటు సాగిన గాన ఉత్సవమది. అందులో 19 పాటలు ఉన్నాయి. దిగ్విజయ్ పాటిల్ అనే సంగీత రసికుడు సమకూర్చిన లింక్ అది. ఆ కచేరి 20 ఆగస్టు 1978న జరిగిందని కూడా ఆ లింక్ పేర్కొంది. అది కచ్చితమైన తేదీ. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా నా చివరి సంవత్సరం మొదటి నెలలో ఆ కచేరి జరిగింది. ఈ లింక్‌తో పాటు కుమార్ గంధర్వ ఇతర రికార్డింగ్‌లు కూడా నేను తరచు యు ట్యూబ్‌లో వింటుంటాను. ప్రొఫెసర్ అనితా రామ్‌పాల్ నాకు కానుకగా ఇచ్చిన ఎనిమిది సీడీలు ఇప్పటికీ నా ఐ పాడ్ నుంచి నన్ను ఆనందపరుస్తున్నాయి.

కుమార్ గంధర్వ గాన శ్రవణానందంలో ఓలలాడుతూ నేను వృద్ధాప్యంలోకి ప్రవేశించాను. అజరామరమైన ఆయన సంగీతం నా అంతిమ క్షణాల దాకా నాతో సహవాసం చేస్తుంది. నేను ఈ భవబంధాల నుంచి విముక్తమై సుదూర తీరాలకు పయనమయినప్పుడు దయాశీలుడు అయిన స్నేహితుడో లేదా ప్రేమాస్పదుడయిన కుటుంబ సభ్యుడో, కుమార్ గంధర్వ లోకోత్తర మాధుర్యంతో గానం చేసిన జమునా కినారే మోరాగావ్ నాదాలు నా వీనుల్లో ప్రతిధ్వనించేలా శ్రద్ధ చూపగలరని ఆశిస్తున్నాను, చూపాలని ఆకాంక్షిస్తున్నాను.

తిరుమలలో టైమ్‌స్లాట్‌ను తప్పక పాటించండి

తిరుపతి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవడానికి ఆగస్టు 16న వెళ్లాను. మర్నాడు ఉదయం 11 గంటలకు టైమ్ స్లాట్ టోకెన్ దొరికింది. ముందుగానే భక్తులను లోపలికి అనుమతించమని కొత్త ఈవో ఆదేశాలు ఉన్నందున 10.30కు వెడితే అనుమతించారు. 11 గంటల తరువాత టైమ్ స్లాట్ ఉన్నవారిని అనుమతించలేదు. లోపలికి వెళ్లిన దగ్గర నుంచి క్యూలైన్‌ను అనేకసార్లు ఆపారు. ఎందుకో తెలియదు. 11.45కి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో కూర్చోబెట్టారు. తరువాత అన్నప్రసాదం పంపిణీ చేశారు. 1.30కి దర్శనానికి వదిలారు. 2.45కి స్వామివారి దర్శనం అయింది. తిరిగి సెప్టెంబర్ 16న మళ్లీ దర్శనానికి వెళ్లాను. 11 గంటలకు టైమ్ స్లాట్, 10 గంటలకు ఎటిసి క్యూ లైన్ వద్దకు చేరుకున్నాను. ఈసారి 11.30 వరకు అనుమతించలేదు. తరువాత టైమ్ స్లాట్ చెక్ చేయకుండా అందరినీ అనుమతించారు. దీంతో విపరీతమైన రద్దీ ఏర్పడింది. ఒక్క నెలలోనే ఇలా నిబంధనలకు ఎందుకు తిలోదకాలు ఇచ్చారో తెలియదు. దర్శనం యథాప్రకారం మధ్యాహ్నం 2.45 గంటలకే అయింది. ఆగస్టులో వెళ్లినప్పుడు లాకర్ ఇచ్చారు. ఎలాంటి ప్రశ్నలూ వేయలేదు. సెప్టెంబర్‌లో వెళ్లినప్పుడు గట్టిగా మాట్లాడితే గాని లాకర్ ఇవ్వలేదు. చివరికి విసుక్కుంటూ ఇచ్చారు. అధికారులెంత మారినా కింద పనిచేసే ఉద్యోగులను మార్చలేకపోతున్నారు. వారిలో రాను రాను సేవాభావం తగ్గిపోతోంది.

టైమ్ స్లాట్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలి. ఒక గంట ముందో, అర గంట ముందో మాత్రమే క్యూలైన్‌లోకి వదలాలి. అలాగే 11, 12 గంటలు టైమ్ స్లాట్ వాళ్లకి అన్నప్రసాదం లైన్‌లో పంపిణీ చేయకుండా వారికి త్వరితగతిన దర్శనం చేయించగలిగితే, వారు తరిగొండ వెంగమాంబ కేంద్రంలో అన్నప్రసాదం స్వీకరిస్తారు.

డిస్‌ప్లే బోర్డుల గురించి ఈఓ పెద్ద పెద్ద ప్రకటనలు చేశారు. ఎటిసి టైమ్ స్లాట్ ఎంట్రీ వద్ద ఒక డిస్‌ప్లే బోర్డు పెట్టారు. కాని దానిలో ఎలాంటి వివరణా లేదు. శ్రీవారిమెట్టుకు వెళ్లడానికి టీటీడీ వారు ఫ్రీ బస్‌లు నడుపుతున్నారు. అలాగే ఆర్టీసీ వారు కూడా నడుపుతున్నారు. ఇవి ఎప్పుడు ఎక్కడి నుండి బయలుదేరుతాయో ఎలాంటి డిస్‌ప్లే బోర్డులూ లేవు. రైల్వేస్టేషన్ వద్ద ఇలాంటి బోర్డులు ఏర్పాటుచేయాలి. అలాగే శ్రీవారిమెట్టు వద్ద టైమ్ స్లాట్ టికెట్స్ ఇచ్చే కౌంటర్‌ను మెట్లు మొదలయ్యే దగ్గర ఏర్పాటు చేశారు. ఇక్కడ విపరీతమైన రద్దీ ఉంటోంది. దానిని పూర్వపు స్థానంలో అంటే సగం మెట్ల వద్ద ఏర్పాటు చేసి టికెట్ ఇష్యూకు సంబంధించిన వివరాల డిస్‌ప్లే బోర్డును మెట్లు మొదలయ్యే దగ్గర ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అలాగే శ్రీవారిమెట్టుకు వెళ్లడానికి రైల్వేస్టేషన్ నుంచి బస్సులు నడిపితే బాగుంటుంది. ఇక, తిరుమలలో ఫ్రీ బస్సులు ఎప్పుడు వస్తాయో, ఎక్కడ ఆగుతాయో కూడా డిస్‌ప్లే బోర్డులు పెడితే బాగుంటుంది. ఈ బస్సులలో కండక్టర్లు ఎప్పుడూ భక్తుల మీద విసుగునే ప్రదర్శిస్తారు.

– చదలవాడ శ్రీరంగప్రసాద్, హైదరాబాద్

మ్యూజియంల అభివృద్ధిపై దృష్టి సారించాలి

ఉమ్మడి రాష్ట్రంలో మ్యూజియంల అభివృద్ధి అంతా తెలంగాణ ప్రాంతంలోనే ఎక్కువగా జరిగింది. ఆంధ్ర ప్రాంత సాంస్కృతిక అభివృద్ధిలో భాగంగా మ్యూజియంల పురోభివృద్ధి ద్వారా, ఆంధ్రులకు గత వైభవాన్ని భావితరాలకు తెలిపే గురుతర బాధ్యతను గత పాలకులు పట్టించుకోలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన ప్రాచీన కళాఖండాలు, వ్రాతప్రతులు, తెలంగాణ మ్యూజియం ఆర్ట్ గ్యాలరీలలోని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శిల్పాలు, వివిధ కాలాల నాటి శాసనాలు ఇంకా ప్రాచీన ఆంధ్రదేశ వారసత్వ సంపదను విభజన చట్టాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావాల్సిన అవసరం ఉన్నది. దీనికి ముందుగా ఈ ప్రాచీన కళాఖండాలను భద్రపరచడానికి ఆధునిక హంగులతో, నూతన సాంకేతికత కలిగిన మ్యూజియం ఏర్పాటు దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

మన రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక మూలలో ప్రాచీన ఆనవాళ్లయిన శిల్పకళాఖండాలు, శాసనాలు, తాళపత్ర గ్రంథాలు లభ్యమవుతున్నా, వాటిని భద్రపరచి ఒకచోటుకు చేర్చడానికి నిధులు లేక రాష్ట్ర పురావస్తు విభాగం వాటి మీద శ్రద్ధ పెట్టడం లేదు. మన రాష్ట్రంలో 13 మ్యూజియంలు అరకొర వసతులతో, సిబ్బందితో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు, ప్రదర్శన శాఖ అలాగే పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా రాష్ట్రంలోని మ్యూజియంలలో వివిధ రకాలైన కార్యశాలలు, సెమినార్లు, ఉచిత ప్రదర్శనశాలలు, ఫోటో ఎగ్జిబిషన్లు నిర్వహించాలి. అలాగే పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం వివిధ కార్యక్రమాలు, అతిథి ఉపన్యాసాలు, ఆయా ప్రత్యేక దినాలలో వివిధ రకాల కార్యక్రమాలను ప్రోత్సహించాలి. ఇంకా స్థానిక ప్రజల ఆచార వ్యవహారాలు, ప్రభుత్వం గుర్తించిన సంస్కృతీ సంప్రదాయకమైన కొన్ని వేడుకలను కూడా క్రమం తప్పకుండా నిర్వహించాలి. గత ప్రభుత్వం ఈ కార్యక్రమాలను అటకెక్కించింది.

ప్రస్తుతం విజయవాడలోని బాపూ మ్యూజియం, విశాఖ మ్యూజియం, అరకులోని గిరిజన మ్యూజియం, తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని శ్రీ వేంకటేశ్వర మ్యూజియం మొదలైనవి నూతన సాంకేతికత ద్వారా ఆంధ్రుల గత వైభవ ప్రాచీనతను తెలిపే ఆయా విశేషాలతో శిక్షకులైన సాంస్కృతిక గైడ్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ప్రభుత్వం మరింత శ్రద్ధ తీసుకోవాలి. మానవ వనరుల అభివృద్ధి, పురావస్తు, దేవాదాయ, యువజనుల సర్వీస్ వంటి శాఖలను సమన్వయం చేసుకొని రాష్ట్ర పర్యాటక శాఖ మ్యూజియాల అభివృద్ధికి తన వంతు ప్రోత్సాహాన్ని అందించాలి. అంతేకాకుండా రాష్ట్రానికి వివిధ జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా కృషి చేయాలి. విశాఖపట్నంలో సబ్ మెరైన్ మ్యూజియంను, కళింగ ఆంధ్ర చారిత్రక వైభవాన్ని భావితరాలకు తెలియజేయడం కోసం విశాఖ మ్యూజియం నిర్వహణకు అవసరమైన నిధులను కేటాయించి, సరికొత్త హంగులతో ఆధునీకరించి, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిచేయాలి. నూతన జిల్లాలలో కూడా మ్యూజియాలను స్థాపించడం వల్ల ఆ ప్రాంత గత చరిత్ర విశిష్టతను యువతకు, భావితరాలకు తెలియజేయడం సులభమవుతుంది. రాష్ట్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధిని పెంపొందించడంలో పర్యాటక, సాంస్కృతిక రంగం పాత్ర మరువలేనిది. ఈ రంగాల ద్వారా యువతకు ఉపాధి కల్పన కోసం రాష్ట్రంలోని అన్ని మ్యూజియాలను ఆధునీకరించాలి. స్థానిక చారిత్రక అవశేషాలను, గత వైభవ చిహ్నాలను సేకరించి నూతనంగా ఏర్పడిన జిల్లా కేంద్రాలలో మ్యూజియాలు నెలకొల్పి ప్రజలలో సాహిత్య, సాంస్కృతిక స్పృహను పెంపొందించేలా ప్రభుత్వం కృషి చేయాలని చరిత్రకారులు, పరిశోధకులు, విద్యార్థులు, సాహితీవేత్తలు, పర్యాటక ప్రేమికులు కోరుతున్నారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తుందని ఆశిద్దాం.

– డాక్టర్ గోవిందు సురేంద్ర, స్థపతి, చరిత్ర అధ్యాపకులు

పీడితుల పిల్లనగ్రోవి అరుణోదయ నాగన్న

ఒక గాయకుడు ఎందుకు పాడతాడు? పాటలు ప్రత్యేకంగా ఒక గొంతుని కోరుకుంటాయా? పాటలు ఎలా పలుకుతాయి? ఎవరు రాసినా, కన్నతల్లి గర్భంలా ఎవరు మోసి జన్మనిచ్చినా, పాట పెరిగి పెద్దదై జీవించేది గాయకుడి గొంతులోనే. పసితనాన్ని, బాల్యాన్ని, యవ్వనాన్ని, వృద్ధాప్యాన్ని, మరణాన్ని, ఆపై అమరత్వాన్ని పలికించేది ఆ గొంతు తడితోనే.



నాగన్న గాయకుడు. అరుణోదయ పాటలు కోరుకున్న ఆత్మీయ గొంతుక. నాగన్న గొంతు పీడితుల పిల్లన గ్రోవి. నాగన్న ఎన్నో పాటలని ప్రాణప్రదంగా పలికించాడు. లాలిగా, జోలగా, లయగా, గోదావరి లోయగా, పోరుగా, నక్సల్బరీ హోరుగా, ఎరుపు దిక్కుగా, నెత్తుటి జెండాగా, అడవి మల్లెగా, వేకువజాము పల్లెగా, అరుణోదయ బాటగా పాడుతూనే ఉన్నాడు.

పాటలు ఎన్నో కదా! ఒక గాయకుడు ఎన్నిసార్లు తన కోసం పాడుకుంటాడు? తన కోసం కొన్ని, జనం కోసం కొన్ని, తన జన కోసం మరికొన్ని పాడుకుంటాడా? ఏమో! తెలియదు. కాని, పాట ఏదైనా గాయకుడి గొంతులో ఒక దృశ్యం ఉంటుంది. పక్షిలా, పక్షుల గుంపుల్ని మోస్తున్న మహా వృక్షంలా గాయకుడు కదులుతూ, మెదులుతూ కనిపిస్తాడు. ఒంటరిగా, తుంటరిగా, ముసి ముసిగా, మసి మసిగా, కన్నీళ్లలా, కాలిపోతున్నట్టు, గాలి ఆగి పోతున్నట్టు ఉంటాడు. దగ్గరగా వస్తాడు. కళ్ళ మీదికొచ్చి, మనసుకార్చి రెప్పపాటులో దూరమవుతాడు. మనసులో భావాలని, భావోద్వేగాలని తాకి కొత్త సముద్రాల్ని సృష్టిస్తాడు. సప్త స్వరాల ఆరోహణ–అవరోహణల కెరటాలుగా వినిపిస్తాడు.

నాగన్న గాన కెరటం. నాజర్‌లా, కానూరి తాతలా, అరుణోదయ రామారావులా మన మనసులో కూర్చొని గుండెల్ని కెలుకుతుంటాడు. "కొమ్మల్లో రెమ్మల్లో కమ్మంగా పాడేటి నల్లాని ఓ కోయిలమ్మ, నల్ల నల్లాని నా కోయిలమ్మ" అంటూ వెంటపడతాడు. పాట వెంట పాట. నాగన్నది పాటల జీవితం. నాగన్న గొంతు పాటల ప్రవాహం! ఆ ప్రవాహం అడవిలా చిక్కగా ఉంటుంది. అమరత్వంలా రమణీయంగా ఉంటుంది. నాగన్నకు ఆయన గొంతు ఒక ఆభరణం. రాజకీయ విశ్వాసం, నిర్మాణ నిబద్ధత ఆయనకు అవార్డులు. విప్లవ ఆరాటం, పోరాటం ఆయన వ్యక్తిత్వం. నాగన్న అస్తిత్వానికి పునాది ఆయన తోడబుట్టిన మధుర స్వరం. పీడిత ప్రజల విముక్తి ఆయన స్వప్నం. ఆ స్వప్నాన్ని సజీవంగా ఆలపించే అరుణోదయ నాగన్న జీవితం ధన్యం.

– లెల్లే సురేష్

(నేటి సాయంత్రం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో అరుణోదయ నాగన్నకు సుద్దాల హనుమంతు జాతీయ పురస్కార సత్కార సభ)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
శనివారం 19 అక్టోబరు 2024



పుట్టిన రోజు, పెళ్లి రోజు, స్నేహితుల కలయిక ఇలా సందర్భం ఏదైనా బిర్యానీ పార్టీ మాత్రం ఉండాల్సిందే. ఏదో ఒక రెస్టారెంట్, హోటల్‌కు అందరూ వెళ్లాల్సిందే అన్నట్లుగా నేడు నగర వాసుల జీవన విధానం మారిపోయింది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొందరు నిర్వాహకులు కస్టమర్లను ఆకట్టుకునేందుకు యథేచ్ఛగా చైనా సాల్ట్ (మోనో సోడియం గూటామేట్)ను వినియోగిస్తున్నారు. దీనే వాడుక భాషలో అజినో మోటో అంటారు. ఆకర్షణీయంగా కనిపించేందుకు రసాయనాలతో తయారు చేసిన రంగులు కలిపేస్తున్నారు. ఇవి రెండు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నాడీ వ్యవస్థ దెబ్బతిని నరాల బలహీనత, బీపీ పెరిగి గుండెపై ప్రభావం చూపుతాయని హెచ్చరిస్తున్నారు. ఫుడ్‌సేఫ్టీ నిబంధనలకు విరుద్ధంగా తయారు చేసే ఆహారం భుజించేటప్పుడు అప్రమత్తత ఎంతైనా అవసరం.



బిర్యానీ భద్రమేనా!

యథేచ్ఛగా చైనా సాల్ట్, రంగుల వినియోగం

- నాణ్యతాప్రమాణాలకు తిలోదకాలు
- బరితెగిస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లు
- ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్న బయటి ఆహారం

8

నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం



హోటళ్లు, రెస్టారెంట్లలో రుచి కోసం వినియోగిస్తున్న టేస్టింగ్ సాల్ట్ ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ప్రధానంగా నాడీవ్యవస్థ దెబ్బతిని నరాల బలహీనత వస్తుంది. బీపీ పెరిగి గుండె సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతాయి.

- డాక్టర్ సరిత, డయాబెటిక్ వైద్యురాలు

దివిలో పోస్టింగ్‌కు పైరవీలు

జలవనరుల శాఖలో ఇన్‌చార్జి డీఈ పోస్టుపై కన్ను



ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న ఆర్సీ సెక్షన్ అధికారి

వైసీపీ హయాంలో అడ్డగోలుగా వ్యవహారాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) జలవనరుల శాఖలో ఇన్‌చార్జి పోస్టులకు డిమాండ్ పెరుగుతోంది. ఇప్పట్లో పదోన్నతులు కల్పించే అవకాశం లేకపోవడంతో ఇన్‌చార్జి పోస్టులను దక్కించుకోవడానికి అధికారులు పోటీ పడుతున్నారు. ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖలో కీలక పోస్టుల్లో అసలు అధికారుల కంటే ఇన్‌చార్జి అధికారులే ఎక్కువగా కనిపిస్తున్నారు. తమకు పదోన్నతులు కల్పించి ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయాలని ఇంజనీర్లు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గడచిన ప్రభుత్వం అర్హులకు పదోన్నతులు ఇవ్వకుండా తమకు అనుకూలంగా ఉన్న వారిని కీలక స్థానాల్లో నియమించి అడ్డగోలు వ్యవహారాలు చేయించింది. ఇటీవల జరిగిన బదిలీల్లో కొంతమంది స్థానాలు కదిలాయి. తాజాగా కొన్ని డివిజన్లకు ఖాళీగా ఉన్న ఈఈ స్థానాల్లో ఇన్‌చార్జిలుగా డీఈలను నియమించారు. ఇదే అదునుగా భావించిన ఓ అసిస్టెంట్ ఇంజినీర్ ఇప్పుడు డీఈ పోస్టులో ఇన్‌చార్జిగా కూర్చోవడానికి తహతహలాడుతున్నారు. ఇందుకోసం అన్ని విధాల పైరవీలు సాగిస్తున్నారు. వైసీపీ హయాంలో అవనిగడ్డ డివిజన్‌లో పనిచేసిన ఆ ఏఈ అప్పటి ప్రజాప్రతినిధులకు ముఖ్యఅనుచరుడిగా వ్యవహరించారు. వాళ్లు చెప్పిన పనులకు వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. మోపిదేవిలోని ఆర్సీ సెక్షన్‌లో పనిచేస్తున్న దివి సబ్‌డివిజన్‌లోని ఇరిగేషన్ ఇన్‌చార్జి డీఈ పోస్టులో కూర్చోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ డివిజన్ కింద నాలుగు సెక్షన్లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌కు ఒక్కో ఏఈ ఉంటారు. ప్రస్తుతం ఏఈగా ఉన్న ఆయన డీఈ కుర్చీలో కూర్చుంటే మరింత బల పడవచ్చని భావిస్తున్నారు.

బినామీతో వరద పనులు!

నిబంధన ప్రకారం జలవనరుల శాఖలో పదోన్నతులు అయినా, ఇన్‌చార్జిలు అయినా 3:1 నిష్పత్తిలో ఇవ్వాలి. అంటే ముగ్గురు డీఈలకు, ఒక ఏఈకి ప్రయారిటీ ఇవ్వాలి. దీనికోసం విద్యార్హతల ఆధారంగా ఒక జాబితాను రూపొందిస్తారు. ఈ జాబితాలో పేరు లేకుండానే ఆ ఏఈ ఇన్‌చార్జి డీఈ కోసం ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. ఇందుకోసం కూటమి ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంతకుముందు ఈయన హెడ్‌వర్క్స్ ఏఈగా పనిచేసేవారు. ఇక్కడ పనిచేస్తూనే చల్లపల్లి స్పెషల్ సబ్ డివిజన్ డ్రెయినేజీ ఇన్‌చార్జి డీఈగా వ్యవహరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఈ డివిజన్‌కు కొత్తగా బాబునాయక్ వచ్చారు. దీనితో ఈ డివిజన్‌ను వదిలేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఆర్సీ సెక్షన్‌కు వెళ్లారు. ఈ ఏఈపై అనేక ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బినామీ పేర్లతో పనులు చేయించారన్నది ప్రధాన ఆరోపణ. అప్పటి ఎమ్మెల్యే చెప్పిన వారికే వర్క్‌ఆర్డర్లు ఇచ్చినట్టు సమాచారం. ఇటీవల వచ్చిన వరదలకు దెబ్బతిన్న కట్టలను పటిష్టం చేసే పనులు జరుగుతున్నాయి. వాటిని ఆయన బినామీ పేర్లతో నామినేషన్ పద్ధతిన దక్కించుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పుడు ఈయన కన్ను దివి సబ్ డివిజన్‌పై పడింది. ఈ డివిజన్ కింద శ్రీకాకుళం, చల్లపల్లి, కోడూరు, హెడ్ వర్క్స్(పులిగడ్డ) సెక్షన్లు ఉన్నాయి. ఇన్‌చార్జి డీఈగా ఉంటే ఈ నాలుగు సెక్షన్ల కింద జరిగే పనుల ద్వారా భారీగా వెనుకేసుకోవచ్చన యోచనలో ఆ ఏఈ ఉన్నట్టు తెలిసింది. ఉన్నట్టుడి దివి సబ్‌డివిజన్ డీఈగా వెళ్లడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

పక్షం రోజుల్లో ఖాళీ చేయండి

పాతరాజరాజేశ్వరిపేటను పక్షం రోజుల్లో ఖాళీ చేయాలని రైల్వేశాఖ శుక్రవారం వేయించిన దండోరా తీవ్ర దుమారం రేపింది. పొట్టకూటి కోసం వలసవచ్చి తినీ తినక కట్టుకున్న గూడును వదిలి పొమ్మంటే ఎక్కడికి పోతామంటూ పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 40 ఏళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడి అన్నీ వసతులు సమకూర్చుకున్నామని.. ఇప్పుడు ఉండవద్దు అంటే ఎలా అని వాపోతున్నారు. రైల్వేశాఖ మాత్రం ఈ సారీ ఎట్టిపరిస్థితుల్లో ఖాళీ చేయించాల్సిందేనన్నట్లు వ్యవహరిస్తోంది. ఈ పరిణామాలు దేనికి దారితీస్తాయోనని అంత టా ఉత్కంఠ నెలకొంది.

పాత రాజరాజేశ్వరిపేట వాసులకు రైల్వేశాఖ హెచ్చరిక



- ఖాళీ చేయకపోతే కఠిన చర్యలకు దిగుతామని దండోరా!
- విజయవాడ-హైదరాబాద్ రైల్వే లైన్ వెంబడి పెద్ద ఎత్తున ఆక్రమణలు
- 40 ఏళ్లలో అన్ని సౌకర్యాలతో ఓ కాలనీగా రూపాంతరం
- జీ ప్లస్ త్రీ భవనాలే అధికం
- రైల్వేశాఖ తీరుపై మండిపడుతున్న కాలనీవాసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/రైల్వేస్టేషన్) : రైల్వే భూముల్లో ఏర్పాటైన పాత రాజరాజేశ్వరిపేటను పక్షం రోజుల్లో ఖాళీ చేయాల్సిందిగా విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు ఈ ప్రాంతంలో శుక్రవారం దండోరా వేయించటం తీవ్ర కలకలాన్ని సృష్టించింది. కొన్నాళ్లుగా పాత రాజరాజేశ్వరి పేట వాసులకు నోటీసుల మీద నోటీసులు ఇస్తున్న రైల్వే అధికారులు అంతిమంగా భవనాలను కూలగొట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఇళ్లకు సీరియల్ నంబర్లు వేస్తూ మార్కింగ్ కూడా ఇచ్చారు. తాజాగా ఇళ్లను ఖాళీ చేయాల్సిందిగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా దండోరా వేయించారు.

40 ఏళ్లుగా మొద్దు నిద్రలో రైల్వేశాఖ

విజయవాడ- హైదరాబాద్ రైల్వే మార్గం వెంబడి రైల్వేస్థలాలు నలభై ఏళ్ల కిందటి నుంచి ఆక్రమణలకు గురవుతూ వస్తున్నాయి. దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా విజయవాడ ఉండటంతో ఉపాధి కోసం వివిధ ప్రాంతాల నుంచి వలసలు వచ్చిన పేదలు విజయవాడ జంక్షన్ పరిధిలోని రైల్వే స్థలాల్లో ఇళ్లు వేసుకున్నారు. వీటిలో పాత రాజరాజేశ్వరిపేట ప్రధానమైన ఆక్రమణ ప్రాంతంగా మారింది. ఏకంగా ఒక కాలనీగా రూపాంతరం చెందింది. ఆక్రమణలు అడ్డుకోవాల్సిన రైల్వే అధికారులు ఇన్నాళ్లు మొద్దునిద్ర పోయారు.

నాలుగు లైన్లకు పెంచాలన్న ప్రతిపాదనలతో..

విజయవాడ - హైదరాబాద్ రైలు మార్గం ప్రస్తుతం రెండు లైన్లుగా ఉంది. దీనిని నాలుగు లైన్లకు పెంచాలన్న ప్రతిపాదనలు నడుస్తున్నాయి. వీటికి సంబంధించి డీపీఆర్‌లు కూడా జరుగుతున్నాయి. ఇలాంటి సందర్భంలో రైల్వేశాఖ తమ స్థలాలలోని ఆక్రమణలపై దృష్టి సారించింది. విజయవాడ - హైదరాబాద్ మార్గంలో అదనపు పాసెంజర్ రైళ్లతో పాటు గూడ్స్ లైన్స్ వంటివి విస్తరించటానికి కూడా రైల్వేకు తమ భూములను స్వాధీనం చేసుకోవడం చాలా ముఖ్యంగా మారింది.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు

ఐదెకరాల్లో విస్తరించిన కాలనీ

పాత రాజరాజేశ్వరిపేట 40 ఏళ్ల కిందటే ఆక్రమణల రూపంలో ఏర్పడింది. నేడు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో అతి పెద్ద కాలనీగా అభివృద్ధి చెందింది. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో అంతర్భాగంగా మారిపోయింది. సుమారు ఐదెకరాల్లో విస్తరించి ఉంది. సాధారణ డివిజన్ల మాదిరిగానే ఈ ప్రాంతంలో కూడా సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు, మంచినీటి సదుపాయాలు ఏర్పాటయ్యాయి. ఇళ్ల పన్నులు కూడా కడుతున్నారు. క్రమంగా పాత రాజరాజేశ్వరిపేట కాస్తా చిన్న చిన్న భవనాల స్థానంలో జీ ప్లస్ త్రీ భవనాల స్థాయికి చేరుకుంది. పాత రాజరాజేశ్వరిపేట ప్రస్తుత ముఖ చిత్రం చూస్తే జీ ప్లస్ త్రీ భవనాలే ఎక్కువగా కనిపిస్తాయి. మొత్తం 1,000 కుటుంబాలు ఈ కాలనీలో నివశిస్తున్నాయి. దాదాపుగా పది వేల జనాభా ఈ ప్రాంతంలో ఉంటోంది. ఏడాదికేడాది ఆక్రమణలు పెరిగిపోతూ రైల్వే ట్రాక్ వరకు వచ్చేశాయి. పాత రాజరాజేశ్వరిపేట బుడమేరు ముంపు ప్రాంతంగా ఉంది. ఇటీవల బుడమేరుకు వరద వచ్చినప్పుడు మొదటి ఫ్లోర్ వరకు వరద నీరు చేరింది. ఆక్రమణల కారణంగా వరద నీరు ఎటూ పోలేక రైల్వే పట్టాలను కూడా ముంచెత్తింది. ఈ అంశాన్ని కూడా ఇప్పుడు ఈ ఆక్రమణల తొలగింపునకు అస్త్రంగా వాడుకునేందుకు రైల్వేశాఖ సిద్ధమవుతోంది.

నందిగామ మున్సిపల్ చైర్మన్ పదవిపై తేలని ఉత్కంఠ

6లో

బెంగళూరు, చెన్నైలకు దీటుగా..

- గన్నవరం విమానాశ్రయ కారిడార్ సుందరీకరణ పనులు ప్రారంభించిన యార్లగడ్డ

ఉద్యోగాలు, భూములు ఇప్పిస్తామని..

రూ. కోటికి పైగా టోకరా!

- డబ్బు తిరిగివ్వాలని అడిగితే చంపుతామని బెదిరింపులు
- టీడీపీ నేతను ఆశ్రయించిన బాధితులు
- పోలీసుల అదుపులో త్రిమూర్తులు



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో నిందితుడు షేక్ అహ్మద్

6లో

ముందు కొరియర్.. తర్వాత రవాణాదారుడు

8లో

- గంజాయి నిందితుల కేసులో కొత్త కోణం



ఆర్టీసీ అవస్థలు



విజయవాడ సిటీ పరిధిలో ఒక్కసారిగా తగ్గిన 100 బస్సులు

- ఉన్న బస్సులపై విపరీతమైన భారం
- అవి కూడా కాలం తీరినవి, స్క్రాప్‌కు సిద్ధంగా ఉన్నవే..
- మెట్రో బస్సులకే ప్రయాణికుల ఆదరణ
- మహిళల ఉచిత ప్రయాణ పథకంతో మరింత ప్రభావం
- సామర్థ్యం పెంచకపోయినా.. కొత్తవి కొనకపోయినా ఇబ్బందులే!

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విజయవాడ సిటీ బస్సుల పరిస్థితి ఏమాత్రం బాగాలేదు. అమరావతి రాజధాని ప్రాంతంలో అతిపెద్ద నగరంగా ఉన్న విజయవాడలో 14 లక్షల మంది జనాభా నివసిస్తోంది. ఆర్టీసీ సబర్బన్ లిమిట్ విజయవాడ నగరాన్ని దాటి ఇబ్రహీంపట్నం, షైలవరం, నున్న, నూజివీడు, గన్నవరం, హనుమాన్‌జంక్షన్, ఉయ్యూరు, కంకిపాడు, అమరావతి, మంగళగిరిల వరకు ఉంది. అంటే దాదాపుగా ఆర్టీసీ సిటీ సబర్బన్ పరిధి విజయవాడ నగరాన్ని దాటి మరీ పరిధి విస్తరించి ఉంది. ఆర్టీసీ సబర్బన్ పరిధిలో 20 లక్షల మంది జనాభా రవాణా అవసరాలను తీర్చాల్సింది ఈ సిటీ బస్సులే. మరి ఇలాంటి పరిస్థితుల్లో సిటీ బస్సుల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం తక్షణం ఉంది. సిటీ బస్సుల సామర్థ్యాన్ని పెంచకపోతే రానున్న రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేయడంలో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే జనాభాకు అనుగుణంగా బస్సులు తగిన సంఖ్యలో లేవు. ఉన్న బస్సులు కూడా కండీషన్‌లో లేవు. మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభించే క్రమంలో విజయవాడ సబర్బన్ పరిధిలో సిటీ బస్సులతో తీవ్ర సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఉచిత బస్సు పథకం కాబట్టి మహిళలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు ఎక్కే అవకాశం ఉంది. ఈ కారణంగా రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్న సిటీ బస్సులతో తంటా తప్పేట్టు కనిపించటం లేదు. ఇలా కండీషన్ లేని, కాలం తీరిన డొక్కు బస్సులతో అధిక రద్దీ కారణంగా మరింత మొరాయించే అవకాశాలు ఉన్నాయి. ఏదైనా అపశ్రుతి దొర్లితే తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సిటీ బస్సులను సాధ్యమైనంత త్వరగా బలోపేతం చేసుకోవాలి. ఈ దిశగా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉంది.

విజయవాడ సిటీ ఆపరేషన్స్ ఇలా

విజయవాడ నగర సబర్బన్ పరిధిలో గవర్నర్‌పేట - 1, 2, ఇబ్రహీంపట్నం, విద్యాధరపురం బస్ డిపోలు ఉన్నాయి. ఒక్కో డిపోకు సగటున 100 బస్సుల చొప్పున మొత్తం 400 ఉండేవి. ప్రస్తుతం ఈ డిపోల పరిధిలో మొత్తంగా 283 సిటీ బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. వీటిలో 108 బస్సులు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు కాగా, 175 సిటీ బస్సులు ఉన్నాయి. గవర్నర్ పేట - 1 బస్ డిపో పరిధిలో మొత్తం 60 బస్సులు ఉండగా.. వీటిలో 18 మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ బస్సులు 42 ఉన్నాయి. ఇబ్రహీంపట్నం పరిధిలో 59 బస్సులు ఉండగా.. మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు 26, సిటీ బస్సులు 33 వరకు ఉన్నాయి. గవర్నర్‌పేట - 2 డిపో పరిధిలో మొత్తం 84 బస్సులు ఉండగా.. మెట్రోలు 52, సిటీ బస్సులు 33 ఉన్నాయి. విద్యాధరపురం డిపోలో మొత్తం 80 బస్సులు ఉండగా.. మెట్రో 12, సిటీ బస్సులు 68 ఉన్నాయి. సబర్బన్ పరిధిలో ఈ 283 బస్సులతోనే సర్వీసులను నడపాల్సి వస్తోంది.

మెట్రో బస్సులపై మితిమీరిన భారం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో కూడా ఉంటుంది. ఈ లెక్కన చూస్తే మిగతా 6లో..

దారుణంగా పడిపోయిన ఓఆర్

విజయవాడ నగరంలో తిరిగే సిటీ బస్సులలో ఓఆర్ దారుణంగా పడిపోయింది. సిటీ సబర్బన్‌లో మెట్రో బస్సులు కొంత వరకు బాగానే ఉన్నాయి. సిటీ బస్సుల ఆక్యుపెన్సీయే మరీ దారుణంగా ఉంది. నగర పరిధిలోని అన్ని సిటీ బస్సులలో (మెట్రో మినహా) 47 శాతం ఆక్యుపెన్సీ రేషియో మాత్రమే ఉంది. ఈ బస్సులు ఎక్కితే ఒళ్లు హూనమైపోతుండటంతో ప్రయాణికులు ఈ బస్సులు ఎక్కటం లేదు. దీని ఫలితమే ఓఆర్ పడిపోవటానికి నిదర్శనం. ఏ డిపోకు చెందిన సిటీ బస్సులు చూసినా.. ఓఆర్ దారుణంగా ఉంది. గవర్నర్ పేట- 1 45 శాతం, ఇబ్రహీంపట్నం 58 శాతం, గవర్నర్‌పేట-2 47 శాతం, విద్యాధరపురం 44 శాతం ఓఆర్ చొప్పున ఉంది.

ప్రేమజంట ఆత్మహత్య

కులాంతర వివాహానికి పెద్దలు అంగీకరించలేదని ఘాతుకం

గుంటూరు జిల్లా నంబూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఘటన

యువతిది ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రుద్రవరం




దానబోయిన మహేష్, నండూరు శైలజ (ఫైల్)

పెదకాకాని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహానికి పెద్దలు అంగీకరించలేదని ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంటూరు జిల్లా నంబూరు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం గుంటూరు జిల్లా పెదకాకాని యాదవపాలేనికి చెందిన దానబోయిన సాంబశివరావు చిన్న కుమారుడు దానబోయిన మహేష్ (22) డిగ్రీ వరకు చదువుకుని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సెల్‌ఫోన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అదే కంపెనీలో పనిచేస్తున్న ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన నండూరు వెంకయ్య కుమార్తె శైలజతో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలియజేశారు. వారు ఒప్పుకోలేదు. ఈ క్రమంలో ఇద్దరు హైదరాబాద్ నుంచి గుంటూరు వచ్చేశారు. మహేష్ సెల్ ఫోన్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, శైలజ గుంటూరు నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో రిసెప్షనిస్టుగా మిగతా 6లో..

చెరకు రైతుకు కేసీపీ తీపి కబురు

» టన్ను ధర రూ.3,576

ఉయ్యూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేసీపీ చక్కెర కర్మాగారం 2024-2025 సీజన్‌కు చెరకు ధర టన్నుకు రూ. 3,576గా ప్రకటించింది. కర్మాగార ఆవరణలో శుక్రవారం యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామదాస్ అధ్యక్షతన చెరకు రైతుసంఘం నేతలతో జరిగిన సమావేశంలో చెరకు గానుగాడు ప్రస్తుత సీజన్‌కు ధర సబ్సిడీతో కలిసి రూ.3,576గా ప్రకటించారు. యాంత్రీకరణకు అనువుగా సాగుచేసిన రైతులకు టన్నుకు రూ.3,676 సబ్సిడీతో కలిపి చెల్లించనున్నట్టు సీతారామదాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబరులో అకాల వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతులకు సంఘం విన్నపం మేరకు రూ.40.89లక్షల ఆర్థికసహాయం ప్రకటించారు. రానున్న సీజన్‌కు ఈ సంవత్సరం నవంబరు నుంచి 2025 ఫిబ్రవరి వరకు నాటే చెరకు తోటలకు ఎకరానికి రూ.10,000 సబ్సిడీ ఇవ్వనున్నట్టు తెలిపారు. సబ్సిడీతో పాటు సంప్రదాయ పద్ధతుల్లో నాటిన తోటలకు టన్నుకు రూ.400 లేదా యా ంత్రీకరణ అనువుగా వేసిన తోటలకు టన్నుకు రూ.500 సబ్సిడీగా ప్రకటించారు. రై తులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని విరివిగా చెరకు సాగుచేసి తోడ్పడాలని కోరారు.

ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌పై వేటు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మచిలీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : 'ల్యాండ్ కన్వర్షన్ మాయ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఈనెల 17న ప్రచురితమైన కథనానికి కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ స్పందించారు. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ కృష్ణచైతన్యను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. చల్లపల్లి మండలంలో ల్యాండ్ కన్వర్షన్‌కోసం వచ్చిన దరఖాస్తుల్లో నకిలీ చలానాలను సృష్టించి, ప్రభుత్వ ఆదాయాన్ని దారిమళ్లించిన ఘటనపై కృష్ణచైతన్య, అతడికి సహకరించిన ఆయన బంధువు బి.రామాంజనేయులుపై క్రిమినల్ కేసులు నమోదైనట్టు ఆయన తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ కృష్ణచైతన్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తూ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్‌కు నివేదికను సమర్పించినట్టు కలెక్టర్ తెలిపారు.

పోర్టు, గన్నవరం విమానాశ్రయం

పనులు వేగవంతం చేయండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పోర్టు, గన్నవరం విమానాశ్రయ పనులు వేగవంతం చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం జేసీ గీతాంజలిశర్మతో కలిసి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మచిలీపట్నం పోర్టు, గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2025డిసెంబరు నాటికి పోర్టుపనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోర్టుకు సంబంధించి ఇప్పటివరకు 27శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. పోర్టు నిర్మాణానికి అవసరమైన ఇసుక కోసం జిల్లాలో ఒక రీచ్‌ను కేటాయించాలన్నారు. మచిలీపట్నం మెడికల్ కళాశాల పనులు, జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా చేసే అభివృద్ధి పనులకు మరొక రీచ్‌ను కేటాయించాలని సూచించారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించి, నివేదిక అందించాలన్నారు. పోర్టు, విమానాశ్రయం కోసం భూసేకరణలో అసలైన భూమి యజమానులకే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గన్నవరం విమానాశ్రయం విస్తరణలో నెలకొన్న భూ సమస్యలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, రైతులకు పరిహారం చెల్లింపు, కాలనీలకు అప్రోచ్‌రోడ్ల నిర్మాణం, కాలువలపై వంతెనల నిర్మాణం తదితర అంశాలపై అధికారులనుంచి వివరాలు సేకరించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, , పోర్టు నిర్మాణ సంస్థ మెఘా జీఎం తులసీదాస్, ఏపీ మేరీటైమ్‌బోర్డు డీఈఈ ఎం. శివయ్య, బందరు, గుడివాడ ఆర్డీవోలు కె.స్వాతి, జి.బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు, భూములు ఇప్పిస్తామని..

కోటికి పైగా టోకరా!

» డబ్బు తిరిగివ్వాలని అడిగితే చంపుతామని బెదిరింపులు

» టీడీపీ నేతను ఆశ్రయించిన బాధితులు

» పోలీసుల అదుపులో త్రిమూర్తులు



వెంకటరమణను ప్రశ్నిస్తున్న టీడీపీ నేత చిన్న సుబ్బయ్య



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో షేక్ అహ్మద్ (ఫైల్)

విద్యాధరపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి ప్రజలకు ఉద్యోగాలు, భూములు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి ఒక్కొక్కరి వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేసిన ముగ్గురు మోసగాళ్లను టీడీపీ నాయకులు శుక్రవారం రాత్రి భవానీపురం పోలీసులకు అప్పగించారు. మాయమాటలు చెప్పిన వారికి కోటి రూపాయలకు పైగా నగదు ఇచ్చినట్టు బాధితులు చెబుతున్నారు. జాబులు, భూములు ఇప్పించమని సంవత్సరాల తరబడి వారి చుట్టూ తిరిగినప్పటికీ రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో విద్యాధరపురం, కుమ్మరిపాలెం ప్రాంతంలో నివాసం ఉండి, ప్రస్తుతం జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో ఉంటున్న ఎస్.కె.అహ్మద్, ఏసు, చెరువు సెంటర్ ప్రాంతానికి చెందిన టి. వెంకట రమణరావు అతని వద్ద గుమస్తాగా పనిచేస్తున్న ఎస్.కిషోర్‌లు కలిసి 2022లో స్థానికంగా ఉంటున్న పలువురికి హైకోర్టులో ఓ లాయర్‌తో పరిచయం ఉందని, అతని ద్వారా జిల్లా కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరికి, మరికొందరికి భూములు ఇప్పిస్తామని నమ్మబలికారు. ఒక్కొక్కరి నుంచి ఐదు లక్షల నుంచి సుమారు రూ.40 లక్షల వరకు తీసుకున్నారు. అప్పటి నుంచి బాధితులకు ఎటువంటి ఉద్యోగాలు, భూములు ఇప్పించకపోవటంతో వారిని అడుగుతూనే ఉన్నారు. డబ్బులు తీసుకున్న వారు రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. కొందరు బాధితులు తమ డబ్బులు తిరిగి ఇమ్మని ఒత్తిడి చేస్తే షేక్ అహ్మద్, వెంకట రమణరావులు అసభ్యకరంగా దూషించి చంపుతామని బెదిరిస్తున్నారు. దీంతో బాధితులు శుక్రవారం 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పి.వి.చిన్న సుబ్బయ్యను కలిసి తమ బాధను విన్నవించుకున్నారు. ఆయన అహ్మద్, వెంకట రమణరావు, కిషోర్‌లను పిలిపించి మోసం చేసిన వ్యవహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో బాధితులు మాట్లాడుతుండగా ఆ ముగ్గురిలో ఒకరు ఓ మహిళను అసభ్యకరంగా దూషించి బెదిరింపులకు దిగాడు. దీంతో అక్కడ ఉన్న సుబ్బయ్య, మరికొందరు టీడీపీ నాయకులు వారిని అడ్డుకుని భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావుకు సమాచారం తెలిపారు. పోలీసులు ఘటనా ప్రదేశానికి వెళ్లి అహ్మద్, వెంకటరమణ, కిషోర్‌లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. మొత్తం బాధితులు సుమారు 25 మందికి పైగా ఉన్నారని తోకలపల్లి గ్రామానికి చెందిన బాధితుడు శ్రీనివాసరావు, మరికొందరు చెబుతున్నారు. శ్రీనివాసరావు తన బంధువులు, స్నేహితుల నుంచి సుమారు 36 లక్షల రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగాలు, భూములు ఇవ్వలేని పక్షంలో తాము ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితుడు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. అహ్మద్ చేసిన మోసం వల్ల తాను సొంత ఊరు తోకలపల్లి వదిలి భవానీపురం బ్యాంక్ సెంటర్‌కు వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు.

జూనియర్ బాలబాలికల జిల్లా ఖో-ఖో జట్ల ఎంపిక రేపు

గుడివాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 20న జిల్లా జూనియర్ బాలబాలికల ఖో-ఖో జట్ల ఎంపిక నిర్వహించనున్నట్టు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మడక ప్రసాద్, ఎంవీ సత్యప్రసాద్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు నవంబరు, 2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని, క్రీడాకారులు ఎత్తు, బరువు కలిపి 250 పాయింట్లకు విఎంచకూడదన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ 20వ తేదీ లోగా ఆధార్, వయస్సు ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.



కోతకు గురైన రోడ్డు మార్జిన్, రోడ్డుపై గుంతలు (సర్కిల్)

అధ్వాన దారిలో.. అవస్థలెన్నో!

ఇటీవల అవనిగడ్డ నుంచి కుటుంబ సమేతంగా హంసలదీవి వెళుతున్న కారు జయపురం వద్ద, రోడ్డుపై లేచిన కంకర రాళ్ల కారణంగా అదుపు తప్పి పంటకాలువలోకి దూసుకెళ్లింది.. 108 వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న మురుగు కాలువలోకి వెళ్లిపోయింది.. మాచవరం గ్రామసమీపంలో కోడూరు వస్తున్న కారు అదుపు తప్పి పంట కాలువలో బోల్తా పడింది.. విజయవాడ నుంచి విశ్వనాథపల్లికి శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు వి.కొత్తపాలెం గ్రామం వద్ద రోడ్డుపై ఉన్న కంకర రాళ్లపై జారి వెనుక వస్తున్న లారీ కిందపడి మృతి చెందాడు.. ఇదీ అధ్వాన రోడ్డు దుస్థితి..



వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళితో నిండిన రోడ్డు

» గోతులమయంగా కోడూరు-అవనిగడ్డ రోడ్డు

» దుమ్ము, ధూళితో వాహనదారులకు నరకం

» రాళ్లు తేలిన రోడ్డుపై తీవ్ర ప్రమాదాలు

» ప్రభుత్వం స్పందించాలని ప్రజల వినతి



(కోడూరు, ఆంధ్రజ్యోతి)

నిత్యం వందలసంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. రహదారి నిర్మాణ దశలోనే నిలిచిపోవటంతో రోడ్డుపై లేచిన కంకర రాళ్ల కారణంగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు రహదారి నిర్మాణం పూర్తిచేసిన తర్వాతే ప్రజలను ఓట్ల కోసం వస్తానని హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో బహిరంగ సభలో రోడ్డు నిర్మాణానికి రూ.33 కోట్లు మంజూరు చేస్తున్నట్టు వాగ్దానం కూడా చేయించారు. కానీ వారి మాటలన్నీ నీటి మీద రాతలుగానే మిగిలాయి. రోడ్డు నిర్మాణానికి రూ.16.80 కోట్లు నిధులు మంజూరైనట్టు ప్రకటన చేసి ఎన్నికల నోటిఫికేషన్ ముందు హడావిడిగా శంకుస్థాపన చేశారు. ఆ సమయంలోనే రోడ్డు పనులు జరుగుతున్నట్టు పైపైన పనులు చేశారు. ఎన్నికల్లో వైసీపీ పరాభవంతో రోడ్డు నిర్మాణం ఆగమ్యగోచరంగా మారింది.

13కిలోమీటర్ల మేర ఉన్న అవనిగడ్డ-కోడూరు ప్రధాన రహదారిని 7.5 కిలోమీటర్ల మేర గ్రావెల్ తోలి చదును చేసి వదిలేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవటంతో పక్కనే పంట కాలువలోకి రోడ్డు కుంగిపోతున్నది. రోడ్డుకిరువైపులా వేసిన బుసక వర్షానికే కారిపోతోంది. రోడ్డుపై ముందు వెళుతున్న వాహనాల తాకిడికి లేచిన దుమ్ములో ప్రయాణించాలంటే వాహనదారులకు, పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో రోడ్డుపై గుంతలను గుర్తించలేక, కంకర రాళ్ల మధ్య వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తీవ్ర అవస్థలు పడుతున్నాం..

- తోట శ్రీరాములు, జరుగు కిరణ్‌కుమార్





కోడూరు రోడ్డు పూర్తిగా అధ్వానంగా ఉండటంతో అత్యవసర పరిస్థితిలో తప్ప ఇతర ప్రాంతాలకు వెళ్లలేకున్నాం. గత ఐదేళ్లుగా తీవ్ర అవస్థలు పడుతున్నాం. వెంటనే రహదారి నిర్మాణం పూర్తి చేయండి

గత వైసీపీ ప్రభుత్వం మాటలు చెప్పి కాలం గడిపింది. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించా. 100 రోజులైనా ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాకపోవటం బాధాకరం.

ఇదే విషయమై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను వివరణ కోరగా, కోడూరు - అవనిగడ్డ రోడ్డు అధ్వానంగా ఉన్నమాట వాస్తవమేనని, సంబంధిత కాంట్రాక్టర్‌తో రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయిస్తానన్నారు. కొద్దిరోజుల్లో పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ తెలిపినట్టు ఎమ్మెల్యే చెప్పారు.

ప్రేమజంట ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)



పనిచేస్తుంది. కులాంతర వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో వారం రోజుల కిందట ఇద్దరు ఇంట్లో చెప్పకుండా వచ్చేశారు. తమ కుమార్తె అదృశ్యమైందని, దీనికి పెదకాకానికి చెందిన మహేష్ కారణమని నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మహేష్ తల్లిదండ్రులను నందిగామ పోలీసులు పిలిపించి విచారించారు. ఈ క్రమంలో మా అబ్బాయి కూడా వారం రోజుల నుంచి కనిపించడం లేదని వారు పోలీసులకు చెప్పారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఈ ప్రేమజంట నంబూరు రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నారు. రైలు పట్టాలపై తలలు పెట్టి ఒకరి చేయి మరొకరు పట్టుకొని మరణించారు. గమనించిన స్థానికులు పెదకాకాని పోలీసులకు సమాచారం అందించారు. పెదకాకాని పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న రైల్వే సీఐ అంజిబాబు, ఎస్సై రమేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

రుద్రవరం గ్రామంలో విషాదఛాయలు

నందిగామ రూరల్ : ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం నందిగామ మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన నంద్రు శైలజ (19) కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. నంద్రు వెంకయ్య అలియాస్ ఇజ్రాయిల్, విజయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వెంకయ్య ఇటీవల మృతి చెందటంతో భార్య విజయ వ్యవసాయపనులకు వెళుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. పెద్ద కుమార్తె ఝాన్సీరాణికి వివాహం కాగా రెండో కుమార్తె ఎస్తేరు రాణి మండలంలోని పల్లగిరి సమీపంలోని మరియనివాస్ కళాశాలలో టీటీసీ చదువుతోంది. ఈ క్రమంలో ఈనెల 16న ఇంటికి వస్తున్నానని కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి తెలిపింది. సాయంత్రమైనా రాకపోవటంతో తల్లి విజయ నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో సీఐ వైవీఎల్ నాయుడు కేసు విచారణ చేపట్టారు. శుక్రవారం ఉదయం శైలజ తల్లికి ఫోన్ చేసి పెద్దకాకాని రావాలని చెప్పింది. అనంతరం తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందన్న సమాచారం తెలిసి ఆ తల్లి గుండెలవిసేలా రోదిస్తుండటం చూపరులను కంటతడి పెట్టించింది.

బెంగళూరు, చెన్నైలకు దీటుగా..

గన్నవరం విమానాశ్రయ కారిడార్ సుందరీకరణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరు, చెన్నై ఎయిర్‌పోర్టులకు దీటుగా గన్నవరం ఎయిర్‌పోర్టు కారిడార్ సుందరీకరణ పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కారిడార్ సుందరీకరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఫిలిం సిటీ తరహా ఆర్కిటెక్ నైపుణ్యాలు, అత్యద్భుత ల్యాండ్ స్కేపింగ్‌తో అబ్బుర పరిచేలా ఉంటుందన్నారు. శుక్రవారం గన్నవరం విమానాశ్రయం వద్ద జాతీయ రహదారి సుందరీకరణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ, గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎంతోమంది విదేశీయులు, పారిశ్రామికవేత్తలు ప్రముఖులు వస్తుంటారని, రోడ్డు మార్గంలో గ్రీనరీ సరిగా లేని పరిస్థితి నెలకొందన్నారు. విజయవాడ మార్గంలో ఫుట్‌పాత్ రెయిలింగ్‌లు పాడయ్యాయని చెప్పారు. కేసరపల్లి నుంచి విమానాశ్రయం వరకూ 15వేల చదరపు అడుగుల్లో గ్రీనరీ పనులు 15రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో విమానాశ్రయం నుంచి చిన అవుటపల్లి వరకూ సుందరీకరణ పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. బెంగళూరు, చెన్నై ఎయిర్‌పోర్టుకు దీటుగా ఇక్కడ కూడా తీర్చిదిద్దుతామని తెలిపారు. మల్లవల్లిలో 426 పరిశ్రమల స్థాపనకు భూములు కేటాయించారని, 18నెలల్లో పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు ఎదురుగా 15ఎకరాల ప్రభుత్వ భూమిలో 10 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్, 2.5 ఎకరాల్లో ప్రభుత్వ గెస్ట్ హౌస్ ఏర్పాటుచేయాలని సీఎం చంద్రబాబును కోరినట్టు తెలిపారు. ట్రిపుల్ ఐటీని గన్నవరం తీసుకువచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. బీజేపీ నేత చిగురుపాటి కుమారస్వామి, టీడీపీ నేతలు జాస్తి వెంకటేశ్వఉరావు, దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, గూడవల్లి నరసింహారావు, గుజ్జర్లపూడి బాబూరావు, గొట్టిపూళ్ల శ్రీనాథ్, మూల్పూరి సాయి కళ్యాణి, మేడేపల్లి రమాదేవి, నెక్కంటి శ్రీదేవి, గుమ్మడి వెంకట్రామయ్య, తుమ్మల లక్ష్మణరావు, నల్లూరి వె ంకటరత్నం, యనమదల సతీష్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి, జీఎం దయాకర్ బాబు, సత్యన్నారాయణ, శ్రీధర్‌రెడ్డి, డీపీవో అరుణ, వెటర్నరీ కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్, తహసీల్దారు శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



సుందరీకరణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



కృష్ణానదిపాయలో పడవల ద్వారా గాలిస్తున్న మత్స్యకారులు, మూర్తి (ఇన్‌సెట్)

కృష్ణానది పాయలో

యువకుడు గల్లంతు

తోట్లవల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిపాయలో శుక్రవారం శుక్రవారం ఉయ్యూరుకు చెందిన సెప్టిక్ ట్యాంకు వ్యాన్ డ్రైవర్ జగన్నాథం మూర్తి(39) గల్లంతయ్యాడు.. జగన్నాథం శ్రీను, సత్తిబాబు, మరియమ్మతో కలిసి తోట్లవల్లూరులో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్‌కు వచ్చారు. ట్యాంక్ క్లీనింగ్ అనంతరం జగన్నాథం మూర్తి, శ్రీను, సత్తిబాబు తోట్లవల్లూరులో మద్యం సేవించారు. తర్వాత నదీ పాయలో స్నానానికి వచ్చారు. జగన్నాథం శ్రీను, సత్తిబాబు స్నానం చేస్తుండగా వారి వెనుక స్నానానికి దిగన మూర్తి కొట్టుకుపోయాడు. తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, ఎస్ఐ అర్జునరాజు ఘటనా స్థలానికి చేరుకుని మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టారు. పడవలతో వలలు వేసి రెండు గంటల పాటు గాలించినా ఫలితం లేదు. ఎస్ఐ అర్జునరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వీఎంసీ మహిళా ఉద్యోగి మృతి

వన్‌టౌన్, అక్టోబరు 18 ఆంధ్రజ్యోతి : కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్ వద్ద విధుల్లో ఉన్న విజయవాడ నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలతో గవర్నర్‌పేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట పోతిన అప్పన్నవీధిలో రేఖలక్ష్మి(55) కుటుంబసభ్యులతో ఉంటున్నది. సుమారు 25 సంవత్సరాల నుంచి పారిశుధ్య విభాగంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నది. ఈ క్రమంలో ఈనెల 17వ తేదీ ఉదయం5గంటలకు కాళేశ్వరరావు మార్కెట్ బస్ టెర్మినల్ వద్ద విధుల్లో ఉండగా పంజా సెంటర్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో ఆమె తలకు బలమైన గాయమైంది. సహ ఉద్యోగులు స్థానికుల సహాయంతో బాధితురాలిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏఎన్ఆర్ కళాశాలలో ఎన్‌సీసీ రిక్రూట్మెంట్

గుడివాడ : ఏఎన్ఆర్ కళాశాలలో శుక్రవారం 16వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సన్నార్ సింగ్ పర్యవేక్షణలో ఎన్‌సీసీ రిక్రూట్మెంట్ నిర్వహించినట్టు కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీజేఎస్ కుమార్ తెలిపారు. 21 మంది బాలు రు, 12 బాలికలు ఎంపికయ్యారని తెలిపారు.

సందిగ్ధంలో చైర్మన్ పదవి!

» నందిగామ మున్సిపల్ పీఠంపై తొలగని ఉత్కంఠ

» ఎన్నిక కోసం ఆశావహుల ఎదురుచూపు

» పాలన చక్కదిద్దే పనిలో కూటమి ప్రభుత్వం

(నందిగామ, ఆంధ్రజ్యోతి)



నందిగామ మునిసిపల్ పీఠం కోసం ఆశావహుల ఆరాటం, పట్టణ ప్రజల ఉత్కంఠకు తెరపడే సూచనలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నందిగామ మునిసిపల్ పీఠంపై చర్చ సాగుతోంది. ఇరవై వార్డులు ఉన్న పట్టణంలో గత ఎన్నికల్లో వైసీపీ 13 స్థానాలు కైవశం చేసుకొని మునిసిపాలిటీని సాధించింది. ఈ ఎన్నికల్లో టీడీపీకి ఆరు, జనసేనకు ఒక స్థానం దక్కింది. ఛైర్‌పర్సన్‌గా ఉన్న మండవ వరలక్ష్మి, వైస్ చైర్మన్‌గా ఉన్న మాడుగుల నాగరత్నంల అకాల మృతితో వైస్ చైర్‌పర్సన్-2గా ఉన్న ఓర్సు లక్ష్మిని ఇన్‌చార్జి ఛైర్‌పర్సన్‌గా నాటి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈక్రమంలో సాధారణ ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో ఛైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల సమయంలో వైసీపీకి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ మారం అమరయ్య, 13వ వార్డు కౌన్సిలర్ గేద్ద శేషకుమారి, 16వ వార్డు కౌన్సిలర్ అచ్చి దివ్యలు టీడీపీలో చేరారు. సాధారణ ఎన్నికలలో కూటమి నేతలు తిరుగులేని మెజారిటీతో గెలుపొందడంతో పాటు ఫలితాలు వెలువడిన వారం రోజుల్లోనే వైసీపీకి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ తానూరి రాము, 17వ వార్డు కౌన్సిలర్ పాపట్ల సాంబయ్య, 9వ వార్డు కౌన్సిలర్ విశ్వనాథపల్లి కృపారావులు టీడీపీలో చేరారు. భాగస్వామ్య పక్షానికి చెందిన జనసేన కౌన్సిలర్‌తో కలిపి కూటమి బలం 11కు పెరిగింది. ఎమ్మెల్యే, ఎంపీలకు కూడా ఛైర్‌పర్సన్‌ను ఎన్నుకునేందుకు ఓటు హక్కు ఉండటంతో సునాయాసంగా చైర్మన్ పీఠం దక్కే అవకాశం ఏర్పడింది. అందివచ్చిన అవకాశం కోసం టీడీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు ఆరాటపడుతున్నారు. ఎవరికి వారు స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో పాటు ఎంపీ కేశినేని చిన్నిల వద్దకు మద్దతుదారులతో వెళ్లి చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. అంతటితో ఆగక మంత్రి నారా లోకేశ్ వద్ద లాబీయింగ్‌కు దిగినట్టు సమాచారం. పదవి ఆశిస్తున్న ఆనలుగురు తమకు అనూకూలంగా ఉండే ప్రవాసాంధ్రులను సైతం రంగంలోకి తెస్తూ లోకేశ్‌కు మెయిల్స్ పెట్టిస్తున్నట్టు తెలిసింది. ఎమ్మెల్యే సౌమ్య ఈ వ్యవహారంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాతే ఛైర్‌పర్సన్ అభ్యర్థిని ప్రకటిస్తానని ఆమె స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామాలపై పట్టణ ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది

సాంకేతిక సమస్యలు..

చైర్మన్ పీఠం కోసం ఆశావహులు బలం చూస్తున్నారు తప్ప సాంకేతిక సమస్యను పరిగణలోకి తీసుకోవడం లేదు. పీఠం దక్కాలంటే.. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. దీనికి ముందుగా ఖాళీగా ఉన్న 7, 11 వార్డులకు ఎన్నికలు జరపాలి. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లకు కూడా చైర్మన్ ఎన్నికలో ఓటు వేసే అవకాశంతో పాటు పోటీ చేసే అవకాశం కూడా కల్పించాల్సి ఉంది. అలా చేయాలంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీల సమాచారం తీసుకొని అన్నింటికీ ఒకే పర్యాయం ఎన్నికలు జరపాల్సి ఉంది. దీనికి కనీసం మూడు నెలల సమయం పడుతుంది. అప్పటి వరకూ వేచి ఉండాల్సిందే. లేదా నాలుగేళ్లు పూర్తయిన తరువాత అవిశ్వాస తీర్మానం ద్వారా ఛైర్‌పర్సన్‌ను దింపేలా చేయాలంటే వచ్చే ఏడాది మార్చి 17 వరకూ వేచి ఉండాల్సిందే. డెలిగేషన్ హోదాలో ఉన్న ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం కౌన్సిలర్లుకు ఉండదు. కాబట్టి ఎన్నికల సంఘం ముందు ఖాళీగా ఉన్న 7, 11 వార్డులకు ఎన్నికలు జరిపి అనంతరం ఛైర్‌పర్సన్ ఎన్నిక జరపాల్సి ఉంది.

రాజకీయ కోణం..

రాష్ట్రంలో పలుచోట్ల కౌన్సిలర్, వార్డు సభ్యుల, సర్పంచ్ స్థానాలకు ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వం కోరితే వీటికి ఎన్నికల సంఘం త్వరితగతిన ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉంటుంది. కానీ కూటమి ప్రభుత్వం పాలనలో స్థిరపడే పనిలో ఉన్నందున.. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వ అక్రమాల ద్వారా స్థానిక సంస్థలన్నీ కైవశం చేసుకుంది. ప్రస్తుత స్థానిక సంస్థల్లో ఎనభై శాతం వైసీపీ నేతలే పదవుల్లో ఉన్నారు. ఉప ఎన్నికకు బదులు స్థానిక సంస్థలకు ముందస్తు ఎన్నికలు జరిపి తమవారిని కూర్చోబెట్టాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తున్నది. అదే నిజమైతే ప్రస్తుత ఆశావహులకు పదవి అందని ద్రాక్షగానే మిగలనుంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

గుణదల శివారు ప్రాంతాల్లో సీఐ తనిఖీలు

గుణదల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో గుణదల పోలీస్ స్టేషన్ సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ శుక్రవారం డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి బ్యాచ్‌కి చెక్ పెట్టడమే లక్ష్యంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. నగరాన్ని గుణదల శివారు ప్రాంతమైన పెద్ద రైలు కట్ట వెంబడి ఇన్నర్ రింగ్ రోడ్డు దిగువ భాగాన నిర్మానుష్యంగా ఉండే ప్రాంతంలో గంజాయి సేవించేవారి కోసం గాలించామని తెలిపారు. ప్రతి రోజు ఇక మీదట ఇటువైపు పెట్రోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఇటుగా ప్రయాణాలు చేసేవారు గంజాయి బ్యాచ్ కంటపడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. గంజాయి బ్యాచ్‌ని ఉపేక్షించేది లేదన్నారు.

ప్రమాదకరం.. సర్వీస్ రోడ్డు మార్జిన్లు

- కోతకు గురవుతున్న రోడ్లు
- రక్షణ గోడ లేని మార్జిన్లు
- గత ఐదేళ్ల పాలనలో కనిపించని అభివృద్ధి



గుణదల సెంటర్ పోస్టాఫీస్ రోడ్డులో కోతకు గురైన రోడ్డు

(ఆంధ్రజ్యోతి, భారతీనగర్)

ప్రధాన రహదారుల వెంబడి ఉన్న సర్వీస్ రోడ్డులోని మార్జిన్లు ధ్వంసం కావడంతో వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారాయి. రమేష్ ఆసుపత్రి సెంటర్‌లోని ఎగ్జిక్యూటివ్ క్లబ్ వద్ద, లయోలా కళాశాల సమీపంలో, కరెన్సీనగర్ సర్వీస్ రోడ్డు, గుణదల సెంటర్ సమీపం వద్ద ఉన్న పోస్టాఫీసు రోడ్డులో సర్వీస్ రోడ్ల మార్జిన్ కోతకు గురై ధ్వంసమయ్యాయి. ఈ సర్వీస్ రోడ్డు వెంబడి ప్రధాన అవుట్‌పాల్ డ్రెయినేజీ ప్రవహిస్తుంది. డ్రెయినేజీకి రోడ్డుకు రక్షణగా ఏర్పాటు చేసిన గోడ నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో పలు చోట్ల ధ్వంసమైపోయాయి. దీంతో మురుగు నీరు ప్రవాహానికి సర్వీస్ రోడ్డు కోతకు గురవుతోంది. ఈ ప్రాంతాలు మూడు రోడ్ల కూడలి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. సర్వీస్ రోడ్డులో నుంచి మెయిన్ రోడ్డులోకి ప్రవేశించే రోడ్డు మలుపు కావడంతో రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రోడ్ల పక్కన రక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించారని పలు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రక్షణగా దిమ్మలు ఏర్పాటు

రమేష్ ఆసుపత్రి సెంటర్ సమీపంలో ఎగ్జిక్యూటివ్ క్లబ్ వద్ద డ్రెయినేజీకి రోడ్డుకు రక్షణగా దిమ్మలు ఏర్పాటు చేశారు.

వరద నీరు చేరితే...

వర్షం పడితే రమేష్ ఆసుపత్రి జంక్షన్ నుంచి లయోలా కళాశాల వెంబడి ఉన్న ప్రధాన అవుట్‌పాల్ డ్రెయినేజీలో వరద నీరు చేరుతుంది. ఈ ప్రాంతంలో రోడ్డు మార్జిన్‌కు రక్షణ గోడలు లేక పోవడంతో వరద నీరు రోడ్డు మీదకు చేరుతుంది. దీంతో రోడ్డేదో, డ్రెయినేదో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.



ఎగ్జిక్యూటివ్ క్లబ్ వద్ద రక్షణగా దిమ్మలు



కరెన్సీనగర్ సర్వీస్ రోడ్డులో, లయోలా కళాశాల మెయిన్ గేట్ వద్ద, కళాశాల సమీపంలో ప్రమాదకరంగా మారిన రోడ్డు మార్జిన్

ఈఎస్ఐకు వెళ్లడానికి తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేయండి

- మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ ధ్యానచంద్ర

గుణదల, అక్టోబరు 18 (అక్టోబరు): ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఈఎస్ఐ హాస్పటల్‌కు వెళ్లేందుకు తాత్కాలిక దారిని ఏర్పాటు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఉదయం గుణదల ఈఎస్ఐ హాస్పటల్ ఏరియాలో పర్యటించారు. ఈఎస్ఐ హాస్పటల్ ప్రధాన రహదారి వద్ద జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. పూర్తిస్థాయి డ్రెయిన్ నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక దారిని ఏర్పాటు చేసి అదే సమయంలో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. డ్రెయిన్ల నిర్మాణం చేపట్టే సమయంలో తాత్కాలిక డ్రెయిన్ సౌకర్య కల్పిస్తే ఎటువంటి ఇబ్బందులు ఎదురుకావని చెప్పారు. ఈ పర్యటనలో ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ జి.సామ్రాజ్యం పాల్గొన్నారు.

డాక్టర్ వేణుగోపాలరెడ్డికి సీఎం ప్రశంసలు



ముఖ్యమంత్రి నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ వేణుగోపాలరెడ్డి

ఆటోనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వీజీఆర్ డయాబెటిస్ ఎడ్యుకేషనల్ అండ్ అవేర్‌నెస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలకు ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ కొండా వేణుగోపాలరెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాలరెడ్డి సమాజానికి చేస్తున్న సేవలను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. సంస్థ తరఫున ప్రకృతిని రక్షించడానికి 50 వేల చెట్లను పంపిణీ చేసినట్లు వేణుగోపాలరెడ్డి తెలిపారు. వీజీఆర్ డయాబెటిస్ అట్లాస్ పుస్తకాన్ని ముఖ్యమంత్రికి అందజేసినట్లు వెల్లడించారు.

మాజీ జస్టిస్ అంబటి లక్ష్మణరావు మృతికి సంతాపం

ఆటోనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అలహాబాద్ హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ జస్టిస్ అంబటి లక్ష్మణరావు మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక అధ్యక్షుడు టి. లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయ వ్యవస్థలో అపారమైన సేవలందించడంతోపాటు రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా నిరంతరం ప్రజా సేవలో నిమగ్నమైన గొప్ప వ్యక్తని కొనియాడారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పటమట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు అయ్యప్పనగర్, యనమలకుదురు లాక్‌రోడ్డు, చౌదరి పేట ఏరియా, పప్పుల మిల్లు సెంటర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ సంస్థ ఈఈ పి. హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

రానున్నవన్నీ ప్రజలకు మంచి రోజులే

21వ డివిజన్ సమావేశంలో ఎమ్మెల్యే గద్దె



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజులన్నీ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలకు మంచి రోజులేనని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. విదేశాల నుంచి ఎంతో మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చి పరిశ్రమలు స్థాపించడానికి సిద్ధంగా వున్నారని చెప్పారు. తూర్పు పరిధిలోని 21వ డివిజన్ కృష్ణలంకలో శుక్రవారం టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గద్దె రామ్మోహన్ హాజరయ్యారు. అనంతరం కృష్ణలంకకు చెందిన గజ్జవరపు ఏసుకు ఎమ్మెల్యే గద్దె రూ.25 వేలతో కొనుగోలు చేసిన వినికిడి యంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో ఒక రోజు నియోజకవర్గంలోని ఒక డివిజన్‌లో సమావేశం నిర్వహించి స్థానికంగా వున్న సమస్యలను తెలుసుకొని వారం రోజుల పాటుగా ఆ సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఆ సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ వారంలోనే పరిష్కారం అయ్యేలా కొత్త విధానాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈ విధానాన్ని రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అమలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. ఆ విధానంలోనే భాగంగానే ఇప్పుడు కృష్ణలంక 21వ డివిజన్‌లో సమావేశం నిర్వహించామని చెప్పారు. ఇక్కడ వున్న భూగర్భ డ్రెయినేజీ సమస్యను మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. ఆరు నెలల వ్యవధిలో రాష్ట్రంలోని అన్ని సమస్యలు పరిష్కారంతో పాటుగా ప్రజా సంక్షేమ పథకాలు అన్నీ కూడా అమలవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, కేశనం భావన్నారాయణ, వేజర్ల రంగారావు, పుప్పాల సుబ్బారావు, పైడి ఈశ్వరరావు, తాడివాయి సత్యనారాయణ, పోడూరు పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు అవార్డు



ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్

ప్రసాదంపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారతదేశం లో కో ఎడ్ డే కమ్ బోర్డింగ్ పాఠశాలల విభాగంలో ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజయవాడకు ఆంధ్రప్రదేశ్‌లో మొదటి స్థానం, ఆల్ ఇండియా లో 17 ర్యాంకును సాధించిందని పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ మంగళవారం తెలిపారు. ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ ప్రతినిధుల నుంచి ఈ అవార్డును పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1500 పాయింట్లకు గానూ 1183 పాయింట్లను స్కోర్ చేసినట్లు వెల్లడించారు. ఈ అత్యుత్తమ విద్యా సంబంధ నైపుణ్యానికి పాఠశాల నిబద్ధతను ప్రతిబింబించడమే కాకుండా ఉత్తేజపరిచే అభ్యాస వాతావరణం ఉంటుందన్నారు. కఠినమైన పాఠ్యాంశాలు, అత్యాధునిక సౌకర్యాలు, అనుభవజ్ఞుల ఉపాధ్యాయ బృందం అంకిత భావంతో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఈ ఘనత సాధించిందన్నారు.

లయోలా కళాశాలలో సైన్స్ ప్రదర్శన



సైన్స్ ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

భారతీనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలోని సెమినార్ హాల్ 2కె24సైన్స్ ఫెయిర్ జరిగింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సగయ రాజ్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్ తదితర విషయాలను విద్యార్థులు ప్రదర్శనలో ఉంచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీఆర్ జాన్, కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ నెహ్రూ, కో-ఆర్డినేటర్ కె అపర్ణ, వివిధ పాఠశాలల నుంచి 500మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మూగబోయిన టెలిఫోన్ ఎక్స్ఛేంజ్

- అవుట్ సోర్సింగ్ టెలిఫోన్ ఆపరేటర్ తొలగింపుతో ఇబ్బందులు



ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆఫీసు మూతపడింది. ఇక్కడ పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై ఆరోపణలు రావడంతో అతడ్ని విధుల నుంచి రెండు నెలల క్రితం తొలగించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అతని స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో ఫోన్స్ ఆపరేటింగ్ చేసే వారు లేకపోవడంతో అటు రోగులు, ఇటు ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అత్యవసర సేవలకు మరిన్ని కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణం టెలిఫోన్ ఆపరేటర్‌ను నియమించి ఇబ్బందులు తొలగించాలని పలువురు రోగులు, ఉద్యోగులు కోరుతున్నారు.

కొండంత కష్టాలు

- మెట్లు అధ్వానం... వీధి దీపాలు వెలగని వైనం
- రెండో డివిజన్ కొండప్రాంతవాసుల పాట్లు



అధ్వానంగా ఉన్న మెట్లపై పెరిగిన మొక్కలు, సగం విరిగిపోయిన మెట్లు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రెండో డివిజన్ పడవల రేవు నుంచి చెరుకూరి కృష్ణ ఇంటి వెనుక నుంచి దేవినేనినగర్ కొండపైకి, కార్మికనగర్ కొండపైకి ఎక్కేందుకు సరైన మెట్లు లేక కొండ ప్రాంత వాసులు అనేక కష్టాలు పడుతున్నారు. సగం విరిగి మెట్లతో బాధపడుతుంటే రాత్రి వేళల్లో వీధి దీపాలు సైతం వెలగడం లేదు. స్తంభాలు సైతం లేకుండా పోయాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులకు వెళ్లి వచ్చే కార్మికులు అధ్వానంగా ఉన్న మెట్లపై నుంచి పడిపోయి గాయపడుతున్నారు. కొందరికైతే వెన్నుపూసలు కూడా విరిగినట్లు బాధితులు బోరుమంటున్నారు. విష సర్పాలు సైతం తిరుగు తున్నాయని భయం గుప్పిట్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నామని పిల్లలు, వృద్ధుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెట్లమార్గాన్ని సరిచేసి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో సుహాసిని



ఆటోనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సుహాసిని అయోధ్యనగర్, దుర్గాపురం పట్టణ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రోగులకు మంచి వైద్య సేవలు అందించాలన్నారు. దుర్గాపురంలోని 197వ సచివాలయం పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై సమీక్షించారు.

దుర్గగుడిలో అన్నవితరణకు విరాళం

వన్‌టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మల్లికార్జునపురం కాలనీకి చెందిన ఇనుకొల్లు సునీల్ కుమార్, హారిక శుక్రవారం దుర్గగుడికి విచ్చేసి అన్నవితరణ నిమిత్తం రూ.1,11,111లు విరాళంగా అందజేశారు. అధికారుల ద్వారా దేవస్థానానికి చెక్కును జమచేశారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

యువ కళాకారుడు కానుక

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ చిత్రాన్ని స్వయంగా చిత్రించిన పటాన్ని శ్రీకాకుళానికి చెందిన యువకళాకారుడు దాకోజు లాల్ ప్రసాద్ శుక్రవారం అమ్మవారి ఆలయంలో అధికారులకు అందజేశారు. దసరా ఉత్సవాల సమయంలో దీక్షను తీసుకుని ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి రూపాన్ని చిత్రీకరించినట్లు ప్రసాద్ తెలిపారు. దీక్షను విరమించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేయటం పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు. అధికారులు లాల్ ప్రసాద్‌ను అభినందించారు. అమ్మవారి దర్శనానంతరం ఆశీస్సులు, శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

కళావేదికపై చిన్నారుల నృత్య ప్రదర్శన

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శుక్రవారం పోలిశెట్టి సూర్యకాంతి ఆధ్వర్యంలో సాయిసంగీత నృత్య అకాడమీ వారిచే భరత నాట్య ప్రదర్శన జరిగింది. చిన్నారులు చక్కని హావ,భావాలతో లయబద్ధంగా నృత్యాలు చేసి ఆహూతులను ఆకట్టుకున్నారు.

కోర్టు నుంచి పారిపోయిన రవికుమార్‌పై కేసు నమోదు

వన్‌టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయిగా ఉన్న మరుపిళ్ల రవికుమార్ తమ కస్టడీలో ఉండగా, మరో ఇద్దరితో కలిసి స్కూటీపై పారిపోయినట్టు భవానీపురం పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ దుబ్బాక రామారావు సూర్యారావుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయిపురం కాలనీకి చెందిన మరుపిళ్ల రవికుమార్‌ను గురువారం అరెస్టు చేసి కోర్టుకు తీసుకువెళ్లారు. అతడిని కానిస్టేబుల్ రామారావు వెంటపెట్టుకుని సెకండ్ ఎ ఎం కోర్టు వద్ద హాజరుపరిచారు. జడ్జి సెలవులో ఉన్నందున మరో జడ్జి వద్దకు ముద్దాయిని తీసుకువెళ్లారు. ముద్దాయి తరఫున లాయర్ వచ్చి రీకాల్ చేస్తామన్నారు. దీంతో జడ్జి ఇరు వర్గాలు ఆలోచించుకుని రావాలని చెప్పారు. తరువాత కోర్టు గుమాస్తాతో కానిస్టేబుల్ మాట్లాడుతుండగా మరుపిళ్ల రవికుమార్ మరో ఇద్దరితో కలిసి స్కూటీపై పారిపోయారు.



మీరు తినే.. బిర్యానీ భద్రమేనా..?

- నగరంలో బరితెగిస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లు
- ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలకు నీళ్లు
- విచ్చలవిడిగా పసుపు రంగు, చైనా సాల్ట్ వినియోగం
- నరాల బలహీనత వచ్చే అవకాశం



అప్పటికప్పుడు వేడివేడిగా టేబుల్ మీదకు వస్తున్న డిష్ తాజాగా తయారు చేసిందేనా? ఇది కొంతమంది ఆహారప్రియులకు వస్తున్న సందేహం.. చికెన్, మటన్ బిర్యానీలు ఆర్డర్ ఇచ్చేశాం. ఈ రెండూ ఫ్రెష్షేనా? మరికొందరి ప్రశ్న.

ఈ రెండింటిలో వాస్తవం లేకపోలేదు. ఆహార పదార్థాలకు, వెరైటీ డిష్‌లకు కేరాఫ్ అడ్రస్ విజయవాడ. ఇక్కడ ఆహార భద్రత ప్రశ్నార్థకం. తోపుడుబండ్లపై విక్రయించే ఆహారం నుంచి హోటళ్లలో సరఫరా చేసే ఆహారం వరకు అన్నీ అనుమానాలు, సందేహాలే. తాజా ఆహారమని చెప్పి సర్వర్లు టేబుళ్లపైకి తెస్తున్న డిష్‌ల్లో తేడాలుంటున్నాయి. తాజాదనం లోపించి కల్తీతత్వం కనిపిస్తోంది. ఈ డిష్‌ల్లో ఆరోగ్యానికి హానిచేసే రసాయనాలు, రంగులు కలుపుతున్నట్టు తేలింది. - ఆంధ్రజ్యోతి - విజయవాడ

మోనో సోడియం గ్లూటోమేట్.. దీన్నే చైనా సాల్ట్ అని వ్యవహరిస్తారు. అజినోమోటో అంటే త్వరగా గుర్తిస్తారు. దీన్ని డిష్‌ల్లో రుచి కోసం విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నట్టు ఫుడ్‌సేఫ్టీ అధికారులు గుర్తించారు. ముఖ్యంగా దీన్ని బిర్యానీల్లో ఎక్కువగా ఉపయోగిస్తున్నారని తేలింది. దీని వాడకం వెనుక పెద్ద వ్యవహారమే ఉంది. వాస్తవానికి ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపని పదార్థాలను ఉపయోగించి బిర్యానిని రుచికరంగా తయారు చేయాలి. సాధారణంగా బిర్యానీలో మసాలా ఫ్లేవర్ ఉంటుంది. దీన్ని చైనా సాల్ట్ పెంచుతుంది. హోటళ్లకు వచ్చే ఆహారప్రియులను ఆకట్టుకోవడానికి దీన్ని బిర్యానీల్లో అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. అంతేగాకుండా పసుపు ఛాయ కోసం రంగులు ఉపయోగిస్తున్నారు. బిర్యానీ, చికెన్ కర్రీ, మటన్ కర్రీ, చేప ఫ్రై, చికెన్ మంచురియా, ఎగ్ మంచురియా, ఇవన్నీ నాన్ విజిటేరియన్ డిష్‌లు.

వంటనూనెలో అనేక వ్యత్యాసాలు

వారాంతంలో నగర వాసులు ఏదోక రెస్టారెంట్‌కు కుటుంబ సమేతంగా వెళ్లి పార్టీలు చేసుకుంటారు. ఏ సందర్భంలో వెళ్లినా నాన్‌వెజ్ డిష్‌లను ఆర్డర్ చేస్తున్నారు. వాటి తయారీలో ఉపయోగించే వంటనూనెలో అనేక వ్యత్యాసాలుంటున్నాయని అధికారులు గుర్తించారు. ఈ నూనెలో పోలార్ కంటెంట్లు 25 శాతానికి మించి ఉంటున్నట్టు తేలింది. ఒక లీటరు నూనెను రెండు, మూడుసార్లు కంటే ఎక్కువగా మరిగించకూడదు. మించి మరిగిస్తే అందులో ఉండే టోటల్ పోలార్ కాంపొనెంట్స్ (టీపీసీ) ఫ్రీ రాడికల్స్‌గా మారుతోందని అధికారులు చెబుతున్నారు. అధికారులు టీపీసీ మీటర్‌తో పరిశీలించినప్పుడు నూనెలో 25శాతం మించి ఉండకూడదు. పలు హోటళ్లలో ఈ టీపీసీ 50 నుంచి 75 శాతం చూపించింది. ఈ నూనె అత్యంత ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి నూనెలతోనే క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయని స్పష్టం చేస్తున్నారు. కొన్నిచోట్ల నూనె బాగా మరగబెట్టిన అడుగునున్న మడ్డిని తీసి పారేసి అదే నూనెలో కొత్త నూనె కలుపుతున్నారు. ఫుడ్‌కోర్టుల నుంచి రెస్టారెంట్లు, హోటళ్ల వరకు ఇదే తంతు. ఆయా కిచెన్లలో ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణం. మాంసాహారాల్లో స్పైసీ కోసం రంగులు విపరీతంగా పూస్తున్నారని అధికారులు గుర్తించారు.

ముందు కొరియర్... తర్వాత రవాణాదారుడు

- గంజాయి నిందితుల కేసులో కొత్త కోణం
- ఒకరి వద్ద పనిచేసిన వినేష్
- ట్రిప్‌కు రూ.25వేలు వసూలు
- తర్వాత రవాణాదారుడిగా రూపాంతరం
- బీహార్‌లో రూ.75వేలకు నాటు తుపాకీ కొనుగోలు

విజయవాడ/గుణదల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులకు గంజాయితో దొరికిన రమేష్ వినేష్‌కుమార్, మరిముత్తు కుమారన్ కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయి. వారిని రామవరప్పాడు రింగ్ వద్ద పోలీసులు 148 కిలోల గంజాయితో పట్టుకుని నాటు తుపాకీ సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ వివరాలను రూరల్ డీసీపీ మహేశ్వర రాజు, ఏసీపీ దామోదర్, ఇన్‌స్పెక్టర్ పవన్‌కిషోర్‌తో కలిసి పటమట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వెల్లడించారు. తమిళనాడుకు చెందిన రమేశ్ వినేశ్ కుమార్ (38), మరిముత్తు కుమారన్ (39) స్నేహితులు. వినేష్‌కుమార్‌కు గంజాయి సరఫరాలో అనుభవముంది. చెన్నైకి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తికి పనిచేసేవాడు. శ్రీనివాస్ సమకూర్చిన కారులో తుని వెళ్లి గంజాయిని తెచ్చేవాడు. విశాఖ జిల్లా నర్సీపట్నానికి చెందిన దుర్గ అనే వ్యక్తి ఈ గంజాయిని తుని వరకు తీసుకెళ్లి వినేష్‌కు ఇచ్చేవాడు. దాన్ని కారులో సేఫ్‌గా చెన్నైకి తీసుకెళ్లి శ్రీనివాస్‌కు అప్పగించేవాడు. ఇలా చేసినందుకు వినేష్‌కు రూ.25వేలు ఇచ్చేవాడు. ఇలా రెండు మూడు సార్లు చేసిన వినేష్ తర్వాత సొంత తెలివితేటలతో సొంతంగా కారు కొనుక్కుని తానే రవాణా చేయడం మొదలుపెట్టాడు. తుని వద్ద దుర్గ నుంచి సరుకును కొనుగోలు చేసి చెన్నై తీసుకెళ్లి మరో పార్టీకి విక్రయించడం మొదలుపెట్టారు. శ్రీనివాస్‌ను పక్కన పెట్టేశాడు. ఇలా ఆరుసార్లు గంజాయిని తీసుకెళ్లాడు. ఎప్పుడూ పోలీసులకు చిక్కలేదు. పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు ఈ గ్యాంగ్‌ను పట్టుకున్నారు. వినేష్ తన వద్ద ఉన్న నాటు తుపాకీని బిహార్‌లో రూ.75వేలకు కొనుగోలు చేశాడు. పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకునే సమయానికి తుపాకీలో 6 రౌండ్ల బుల్లెట్లు లోడై ఉన్నాయి. గ్రామాల్లోని పాత కక్షల నేపథ్యంలో తుపాకీ కొన్నానని చెబుతున్నా పోలీసులు నమ్మట్లేదు. ప్రయాణం మొత్తం జాతీయ రహదారిపైనే జరుగుతుండడంతో ఎవరైనా ఆపితే అటాక్ చేయడానికి ఉంచాడన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీరిని పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు.

నగరంలో సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు చేయండి

- మంత్రి మనోహర్‌కు బెజవాడ బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల వినతి



పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెళ్ల మనోహర్‌ను కలిసిన బెజవాడ బార్ న్యాయవాదులు

విజయవాడ లీగల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఉన్న జిల్లా వినియోగదారుల ఫోరం-2లోని దాదాపు 300 కేసులను మచిలీపట్నంలోని జిల్లా కన్స్యూమర్ ఫోరానికి బదిలీ చేయడం వల్ల వినియోగదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని బెజవాడ బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా) మంత్రి నాదెండ్ల మనోహర్, ఫోరం చైర్మన్ డి.శ్రీనివాసరావును కలిసి విన్నవించారు. వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని విజయవాడలోనే ఒక సర్క్యూట్ బెంచ్‌ను ఏర్పాటు చేసి వారానికి రెండు రోజులు విజయవాడ పరిధిలోని బదిలీ చేయబడిన కేసులను నగరంలోనే విచారణ చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి, ఫోరం చైర్మన్‌కు విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందచేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి, ఫోరం చైర్మన్ త్వరలో కార్యాచరణ రూపొందించి తెలియజేస్తామని తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్, బార్ మాజీ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, న్యాయవాది రమేష్ పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వంలో కార్మికుల దోపిడీ

- కర్నాటక హైకోర్టు న్యాయవాది బాలన్



సదస్సులో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నేతలు

గవర్నర్‌పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో కార్మికులు దోపిడీకి గురౌతున్నారని ప్రముఖ కార్మిక నేత, కర్నాటక హైకోర్టు న్యాయవాది బాలన్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉభయ ఐఎఫ్‌టీయూ సంస్థలు శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకే భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించాయి. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నేతలు ఎం.వెంకటేశ్వర్లు, ఏసు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలన్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో రెగ్యులర్ ఉద్యోగులు, కార్మికుల సంఖ్య 15శాతం తగ్గితే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య 85 శాతానికి పెరిగిందన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను కాపాడుకోవడానికి, కార్పొరేట్లకు ప్రభుత్వ సొమ్ము దోచిపెట్టడానికే మోదీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. వీటిని లేబర్ కోడ్‌లు అనేకంటే డెకాయిట్ కోడ్స్ అనడం సముచితంగా ఉంటుందని విమర్శించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకు విధానాల ప్రయోగశాలగా మారుస్తోందన్నారు. మోటారు, హమాలీ వంటి అసంఘటిత వర్గాల సంక్షేమం కోసం బోర్డుల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయించుకునేందుకు ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పొలారి, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి. భారతి ప్రసంగించారు. సదస్సులో పలు తీర్మానాలను ఆమోదించారు.

'ఉల్లాస్ అక్షరాస్యత'పై దృష్టిపెట్టండి

- ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా



మాట్లాడుతున్న డాక్టర్ నిధి మీనా

విజయవాడ లీగల్, అక్టోబరు 18: పదిహేనేళ్లకు పైబడిన వారిలో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా మార్చడంతోపాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత పెంపొందించేందుకు ఉద్దేశించిన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అమలుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా ఆదేశించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉల్లాస్ అమలుపై నిధి మీనా పాఠశాల విద్య, వయోజన విద్య, డీఆర్‌డీఏ, గ్రామ-వార్డు సచివాలయాలు, ఐసీడీఎస్, సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉల్లాస్ అమలుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిసారించాయని, ఈ పథకం లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని సూచించారు. నిరక్ష్యరాస్యులైన స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని ఆయాలు, కుక్‌లు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్‌వాడీ సహాయకులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. ఇందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన, మండల స్థాయిలో ఎంపీడీవో చైర్మన్‌గా కమిటీలు పనిచేస్తాయన్నారు. ఇది మూడేళ్లపాటు జరుగుతుందని, తొలిదశలో జిల్లాలో 7వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. నవంబర్ నుంచి సాయంత్రం 2 గంటల పాటు తరగతుల నిర్వహించాలని సూచించారు. ఉల్లాస్ నోడల్ అధికారి జి.ప్రసాదరావు, ఏపీవో ఎం.సింగయ్య, డీఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఆర్‌ఆర్‌వో ఎస్‌వీ మోహన్‌రావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం మోపొద్దు

- సీపీఎం రాష్ట్ర నేత సీహెచ్ బాబూరావు



భారతీనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఆందోళనకు సిద్ధమవుతామని, చార్జీలు తగ్గించే వరకు ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం రూ.8114 కోట్ల ట్రూ అప్ చార్జీల భారం మోపేందుకు సిద్ధమైందన్నారు. ఇందుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో రమేష్ ఆసుపత్రి సెంటర్‌లోని ఏపీసీడీసీఎల్ విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలను విపరీతంగా దోపిడీ చేసిందన్నారు. మమ్మల్ని అధికారంలోకి తెస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు విద్యుత్‌పై శ్వేతపత్రం ప్రకటించి గత ప్రభుత్వం ఎలా అవినీతికి పాల్పడ్డారో తెలిపాలన్నారు. 4 నెలలు గడవకుండానే టీడీపీ కూటమి ప్రభుత్వం అదే దారిలో నడుస్తుందన్నారు. ఇందులో భాగంగా రూ.8114 కోట్ల ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపబోతోందన్నారు. 2022-23లో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు అదనంగా కట్టమంటున్నారన్నారు. ఇప్పటికే 1.03పైసలు రెండు రకాలుగా సర్దుబాటు చార్జీలు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఇదే కాకుండా 2023-24 సంవత్సరానికి గాను కొత్తగా రూ.11వేల కోట్ల సర్దుబాటు పోటు రాబోతోందన్నారు. మొత్తంగా రూ.20వేల కోట్లను ప్రజలపై భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. చిత్తశుద్ధి ఉంటే టీడీపీ ప్రభుత్వం ఆ జీవోను నిలుపుదల చేసి దానిపై విచారణ చేసి డబ్బును రాబట్టాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, బోయ సత్యబాబు, జిల్లా కమిటీ సభ్యులు బి.రమణ, పి.కృష్ణ, నేతలు చిన్నారావు, జి.క్రాంతి, టి.చంద్రశేఖర్, వై.సుబ్బారావు, కోరాడ రమణ, రవీంద్ర, మురహరి పాల్గొన్నారు.



ధ్యాన యజ్ఞంలో మాట్లాడుతున్న ఈవో రామారావు

దుర్గగుడిలో అఖండ ధ్యాన యజ్ఞం

వన్‌టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు 12 గంటలపాటు ధ్యాన యజ్ఞాన్ని నిర్విరామంగా నిర్వహించారు. ప్రతి నెలలో పౌర్ణమి సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ధ్యాన యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు.



రైతులతో మాట్లాడుతున్న సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్

కౌలు సమస్యలు పరిష్కరిస్తాం

- సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యప్రవీణ్ చంద్

కృష్ణలంక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో రైతులకు చెందాల్సిన కౌలు సమస్యలను ఇప్పటికే కొన్ని పరిష్కరించి వారి ఖాతాల్లో నగదు జమచేశామని మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ హామీ ఇచ్చారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్‌డీఏ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో రాజధాని రైతులు పాల్గొని తమ సమస్యలను ఆయనకు విన్నవించుకొన్నారు. అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై వచ్చిన సమస్యల్లో అధిక శాతం అక్కడికక్కడే పరిష్కారం చూపారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని అదనపు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.విశ్వేశ్వరనాయుడు, కె.స్వర్ణమేరీ, బి.సాయిశ్రీనివాస్ నాయక్, జి.భీమారావు, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రెయిన్ల సమస్య పరిష్కారానికి కమిటీ

- ఆర్‌యూబీ ప్రారంభోత్సవంలో ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే ఉమా



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

మధురానగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ నుంచి రైల్వే లైన్లు వెళుతున్న చోట్ల డ్రెయినేజీలు పొంగుతున్న సమస్యను పరిష్కరించడానికి రైల్వే శాఖ, వీఎంసీ నుంచి సంయుక్త కమిటీ వేస్తామని అందులో తాను ఎమ్మెల్యే బొండా ఉమా ఉంటామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చెప్పారు. గత టీడీపీ హయాంలో శంకుస్థాపన చేసుకుని ప్రస్తుత టీడీపీ హయాంలోనే పూర్తయిన దేవీనగర్, మధురానగర్ ఆర్‌యూబీని శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బొండా ఉమ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ఎమ్మెల్యే బొండా ఉమ నియోజకవర్గంలో అనేక పనులకు శంకుస్థాపనలు చేసి పూర్తి చేశారని తరువాత వచ్చిన వైసీపీ ఒక్క ఇటుక వేసి ఒక్క అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు. ఇటీవల రైల్వే అధికారులతో సమావేశనప్పుడు సెంట్రల్‌లో కొన్ని సమస్యలు రైల్వేతో ముడిపడి ఉన్నాయని వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఒక స్థలానిక సంబంధించి రైల్వేకు వీఎంసీకి మధ్య సమస్య ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఉమ మాట్లాడుతూ తాను శంకుస్థాపన చేసి 60 శాతం పనులు పూర్తి చేసిన ఆర్‌యూబీలో మిగిలిన 40 శాతం పనులు ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేయలేదంటే వారి అసమర్థత, అవినీతే కారణమన్నారు. మధురానగర్‌కు ప్రధాన సమస్యలు ఇక్కడి రైల్వే గేటు, పప్పులమిల్లు రైల్వే గేటు అన్నారు. ఇక్కడ డబుల్ లైన్ ఆర్‌యూబీ పూర్తిచేసి ట్రయల్ రన్ చేసి ప్రజలకు అంకితం చేస్తున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, జనసేన సెంట్రల్ సమన్వయ కర్త బొలిశెట్టి వంశీకృష్ణ, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, డివిజన్ ఇన్‌చార్జి నెక్కంటి ప్రసాద్, కార్పొరేటర్ వీరమాచనేని లలితా కిషోర్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సింగం వెంకన్న, డివిజన్ నేతలు అడపా కోటేశ్వరరావు, బర్మాశ్రీనివాస్, ఏవీ రాంబాబు, తుంగం జాన్సీ మనిముక్కు వాసు, కెంబూరి కృష్ణ పాల్గొన్నారు.

నేడు గుళ్లపల్లి జ్యోత్స్న సంస్మరణ సభ

విజయవాడ లీగల్, అక్టోబరు 18: ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి గుళ్లపల్లి జ్యోత్స్న రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈనెల 8న మృతిచెందిన విషయం విదితమే. ఆమె ప్రముఖ న్యాయవాది, ఆలిండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి. ఆమె విద్యార్థి దశ నుంచి అభ్యుదయ భావాలతో పనిచేస్తూ, సారా వ్యతిరేక ఉద్యమం, మహిళల హక్కుల కోసం, విద్యార్థినుల సమస్యలపై సమానత్వం కోసం అనేక సంఘాలను ఏర్పాటు చేసి వారి అభ్యున్నతి కోసం పాటుపడ్డారు. ఆమెతో ఉన్న మధుర స్మృతులను, ఉద్యమ సహచర అనుభవాలను పంచుకోవడానికి శనివారం ఉదయం 11 గంటలకు ఆమె సంస్మరణ సభ మంగళగిరి డీజీపీ ఆఫీస్ సమీపంలో గల సీకే కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసినట్టు సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు.



అకాడమీలో బాణం సంధిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

ఓల్గా ఆర్చరీ అకాడమీకి.. శాప్ చైర్మన్

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని మహానాడు రోడ్డులోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీని శాప్ చైర్మన్ ఏ రవినాయుడు గురువారం సందర్శించి అక్కడ క్రీడాకారులతో మాట్లాడారు. అకాడమీలోని క్రీడాకారులంతా సత్తా చాటుతూ జాతీయ పోటీలకు సిద్ధంగా ఉండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అకాడమీకి కావాల్సిన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన్ను ఆర్చరీ అకాడమీ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ శాలువాతో సత్కరించారు.



క్రీడాకారులను శాప్ ఎండీకి పరిచయం చేస్తున్న తరుణ్ కాకాని

జాతీయస్థాయి రోయింగ్‌కు కుశాల్, లిఖిత్

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగే జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్‌కు రాష్ట్రానికి చెందిన రోయింగ్ క్రీడాకారులు కుశాల్, లిఖిత్ అర్హత సాధించారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని, కోచ్ కృష్ణమూర్తికి ఆర్థిక సహాయం అందించే ధ్రువీకరణ పత్రాలను అందించారు. కుశాల్, లిఖిత్‌ను శాప్ వీసీఎండీ పీఎస్ గిరిషాకు తరుణ్ పరిచయం చేయగా, వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఏపీలో వాటర్ స్పోర్ట్స్ రోయింగ్‌కు మద్దతిస్తామని గిరిషా హామీ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 19 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com


ఆ భయంతోనే మీడియా ముందుకు రాలేదు



అనీ

'తోటి మహిళా కొరియోగ్రాఫర్‌పై జానీమాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడనే విషయం మమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒక అమ్మాయి జీవితంతో ముడిపడి ఉన్న విషయం కావడంతో ఏం మాట్లాడితే ఏమవుతుందో అని అందరం భయపడ్డాం. అందుకే డ్యాన్సర్స్ అసోసియేషన్, కొరియోగ్రాఫర్లు ఇప్పటివరకూ మీడియా ముందుకు రాలేదు' అని టాలీవుడ్ మహిళా కొరియోగ్రాఫర్ అనీ అన్నారు. జానీ మాస్టర్, బాధితురాలి మధ్య ఏం జరిగిందనేది మనకెవరికీ తెలియదు. ఒకవేళ ఆమె ఆరోపణలు నిజమైతే ఆయన్ని కఠినంగా శిక్షించాల్సిందే. కానీ జానీ మాస్టర్ నిరపరాధి అని తేలితే పరిస్థితి ఏమిటి? అలాగే కోర్టు తీర్పు చెప్పేంతవరకూ మనందరం సంయమనం పాటించాలి. జానీ మాస్టర్ దగ్గర నేను మూడేళ్లపాటు అసిస్టెంట్‌గా చేశాను. ఎప్పుడూ ఇబ్బందులు ఎదుర్కోలేదు. బాధితురాలు కొన్నాళ్ల క్రితం వరకూ 'జానీమాస్టర్ నా దేవుడు' అని చెప్పింది. కానీ ఇప్పుడు మాట మార్చి ఆరోపణలు చేసింది. ఆమెను జానీ మాస్టర్ భార్య కూడా ఎంతగానో ప్రోత్సహించారు' అని అన్నారు.

తొలి ఎపిసోడ్‌లో అల్లు అర్జున్?





నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించే 'అన్‌స్టాపబుల్ సీజన్ 4' ఓటీటీ వేదిక 'ఆహా'లో ఈ నెల 24 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తొలి ఎపిసోడ్‌లో అల్లు అర్జున్ గెస్ట్‌గా కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే ఈ ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయిందనీ, అల్లు అర్జున్ తాజా చిత్రం 'పుష్ప 2' విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆ చిత్రబృందం కూడా 'అన్‌స్టాపబుల్' షో లో పాల్గొందని అంటున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను త్వరలో విడుదల చేయనున్నారు. ఇద్దరు మాస్ హీరోలు పాల్గొంటున్న ఈ ఎపిసోడ్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన నంద్యాల ఎపిసోడ్ గురించి అల్లు అర్జున్‌ని బాలకృష్ణ ప్రశ్నించినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. 'అన్‌స్టాపబుల్' వేదికగా ఆ వివాదం గురించి వివరణ ఇచ్చి ఇంతటితో దాన్ని ముగించాలని అగ్ర నిర్మాత అల్లు అరవింద్ ప్లాన్ చేసినట్లుగా చెబుతున్నారు. ఈ తొలి ఎపిసోడ్‌కు సంబంధించిన ప్రోమో విడుదలయ్యాక ఈ విషయం మీద క్లారిటీ వస్తుందని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

గుర్తుండి పోయే జ్ఞాపకాలు



విజయ్‌దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం (వీడీ 12- వర్కింగ్ టైటిల్) షూటింగ్ ప్రస్తుతం కేరళలో శరవేగంగా సాగుతోంది. ఈ సందర్భంగా విజయ్ కేరళ అభిమానులతో భేటీ అయ్యారు. 'కేరళలో షూటింగ్ మరచిపోలేని అనుభూతులు ఇచ్చింది. ఈ జ్ఞాపకాలు ఎన్నేళ్లైనా గుర్తుండిపోతాయి. ప్రకృతి అందాల మధ్య గడిపిన క్షణాలు నాకెంతో ప్రత్యేకం. ఈ సినిమా ప్రేక్షకుల మనసులను చూరగొంటుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. కేరళ అభిమానులతో విజయ్ ముచ్చటిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ చిత్రంలో విజయ్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది వేసవిలో 'వీడీ 12' ప్రేక్షకుల ముందుకు రానుంది.

మరో తెలుగు సినిమా చేస్తా



విద్యాబాలన్

'ఎన్టీఆర్: కథానాయకుడు', 'ఎన్టీఆర్: మహానాయకుడు' చిత్రాల్లో నటించా. మరిన్ని తెలుగు సినిమాలు చేయాలనుంది. మంచి కథ దొరికితే మరో తెలుగు సినిమా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను' అని బాలీవుడ్ నటి విద్యాబాలన్ అన్నారు. కార్తిక్ ఆర్యన్‌తో కలసి ఆమె కీలకపాత్ర పోషించిన 'భూల్ భూలయ్య' చిత్రం ఈ దీపావళికి ప్రేక్షకుల ముందుకొస్తోంది. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వారిద్దరూ హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు. విద్యాబాలన్ మాట్లాడుతూ "భూల్ భూలయ్య 3' చిత్రంతో రెండింతల వినోదం ఖాయం. అన్ని అంశాలు అద్భుతంగా కుదిరాయి. హారర్, కామెడీ, థ్రిల్, సంగీతం... ఒకటేమిటి అన్నీ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. కార్తిక్ ఆర్యన్, నేను ప్రేక్షకులను భయపెట్టడంతో పాటు కడుపుబ్బా నవ్విస్తాం. దీపావళికి మా సినిమా ప్రేక్షకులకు మంచి మజా ఇస్తుంది' అన్నారు. కార్తిక్ ఆర్యన్ మాట్లాడుతూ 'వృత్తిపట్ల అంకిత భావం ఉన్న గొప్ప నటి విద్యాబాలన్. బయటే కాదు షూటింగ్‌లోనూ ఆమె సరదాగా ఉంటారు. తనతో కలసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను. 'భూల్ భూలయ్య 2'తో పోల్చితే మూడో పార్ట్‌లో మరింత వినోదం ఉంటుంది. కథతో పాటు పాత్రల విషయంలోనూ ప్రేక్షకులను ఆకట్టుకునే మరిన్ని మార్పులు చేశాం' అన్నారు.



బిల్లు నేనే చెల్లించేదాన్ని

'మహిళలు ఆర్థికంగా స్వతంత్రులుగా ఉండటం ఎంతో ముఖ్యం. ఆర్థిక విషయాల్లో ఇతరులపై ఆధారపడటం నాకు నచ్చదు. ఎప్పుడైనా ఎవరితోనైనా డేట్‌కి వెళ్తే... బిల్లు నేనే చెల్లించేదాన్ని' అని అన్నారు శ్రుతిహాసన్. కొందరు అబ్బాయిలు ఖర్చులన్నీ తనతోనే పెట్టించేవారని ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. 'మొదట్లో ఎదుటి వ్యక్తిని అడగకుండానే నేను అన్నింటికీ డబ్బులు చెల్లించేదాన్ని. కొంత కాలం తర్వాత ఎప్పుడైనా ఈ విషయాన్ని అడిగితే..నువ్వు ఇష్టపడి కడుతున్నావేమో అనుకున్నామని అంటారు. ఇలాంటి అనుభవాలు ఎదురైన తర్వాత డబ్బుల విషయంలో స్పష్టమైన వైఖరితో ఉండాలని అర్థం చేసుకున్నా' అని శ్రుతిహాసన్ చెప్పారు.

అరవై మంది భద్రతా సిబ్బంది రక్షణలో సల్మాన్

బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి వరుస బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో ఆయన తన భద్రతను కట్టుదిట్టం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా రూ.రెండు కోట్లు వెచ్చించి దుబాయ్ నుంచి బుల్లెట్ ప్రూఫ్ కారు 'నిస్సాన్ పెట్రోల్ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్'ని దిగుమతి చేసుకున్నారు. సల్మాన్‌కు ఇదివరకే ఒక బుల్లెట్ ప్రూఫ్ కారు ఉండగా, ఇది రెండోది. ఖరీదుకు తగ్గట్టుగానే ఈ కారులో అధునాతన సౌకర్యాలతో పాటు ప్రత్యేకించి ప్రమాదాల నుంచి గట్టెక్కించే రక్షణ వ్యవస్థను కలిగి ఉంది. అంటే.. బాంబు అలెర్ట్ ఇండికేటర్స్, అతి సమీపం నుంచి కాల్పులు జరిపినా తట్టుకునే బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు, కారులో ప్రయాణిస్తున్న వారిని బయటి వారు గుర్తించకుండా ఉండేలా టింటెడ్ విండోస్ వంటివి. ప్రస్తుతం ఈ కారు ఇండియాలో లభించడం లేదు.



రూ. ఐదు కోట్లు చెల్లిస్తే...

ఇదిలా ఉండగా.... 'ఐదు కోట్ల రూపాయలు చెల్లిస్తే సల్మాన్‌ని క్షమించి విడిచిపెడతాం, లేదంటే బాబా సిద్దీఖికి పట్టిన గతే పడుతుంది' అని హెచ్చరిస్తూ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి ముంబై పోలీసులకు వచ్చిన తాజా బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. దీంతో ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం సల్మాన్‌కు ఉన్న గన్‌మెన్‌ల సంఖ్యను ఎనిమిది నుంచి పదికి పెంచారు. 24 గంటలు సల్మాన్ భద్రతను పర్యవేక్షించేందుకు ఆయన నివాసమైన గెలక్సీ అపార్ట్‌మెంట్‌లో ప్రత్యేకంగా కమాండ్ సెంటర్‌ను ముంబై పోలీసులు ఏర్పాటు చేశారు.

'బిగ్ బాస్' హౌస్‌లో...

మరో వైపు... సల్మాన్ కొంత కాలం పాటు 'బిగ్ బాస్ షో' హోస్టింగ్‌కు దూరంగా ఉంటారనే వార్తలు బాలీవుడ్‌లో చక్కర్లు కొట్టాయి. అయితే ఈ వార్తలకు చెక్ పెడుతూ 'బిగ్ బాస్ 18' షూటింగ్ కోసం సల్మాన్ సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ముంబై పోలీసులు షూటింగ్ సెట్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. దాదాపు 60 మంది భద్రతా సిబ్బంది సెట్‌లో ఉంటూ సల్మాన్‌ను నిరంతరం పర్యవేక్షించనున్నారు. బయటి వారికి సెట్‌లోకి అనుమతి లేదని, షోకు సంబంధించిన సిబ్బంది సైతం గుర్తింపు కార్డు చూపించిన తర్వాతే లోనికి అడుగు పెట్టేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

మీ ఫోన్ నంబర్ ఇస్తారా?



సల్మాన్ ఖాన్ మాజీ ప్రియురాలు సోమీ అలీ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టు వైరల్ అయింది. ఆమె లారెన్స్ బిష్ణోయ్‌ని ఉద్దేశించి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. "నమస్తే లారెన్స్ భాయ్"... అంటూ సోమీ అలీ తన సందేశాన్ని మొదలుపెట్టారు. "మీరు జైలు నుంచే జూమ్ కాల్ చేస్తున్నారని విన్నాను. నేను కూడా మీతో కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పాలి. అందుకు మార్గం ఏమిటో చెప్పండి. మన ప్రపంచంలో అన్నింటికంటే అందమైన ప్రదేశం రాజస్థాన్. మేము మీ దేవాలయానికి రావాలనుకుంటున్నాం. కానీ అంతకంటే ముందుగా మేము మీతో జూమ్ కాల్ మాట్లాడాలి. కొన్ని విషయాలు చెప్పాలి. నా మాట నమ్మండి. ఇది నేను మీ ప్రయోజనం కోసమే చెబుతున్నాను. నాకు మీ మొబైల్ నెంబరు ఇవ్వండి' అంటూ సోమీ అలీ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు.

పాన్ ఇండియా సినిమాలా అనిపించింది



సంయుక్త

యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్ఖూరి దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మించారు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కథానాయిక సంయుక్త 'పొట్టేల్' ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంయుక్త మాట్లాడుతూ 'దర్శకుడు నాలుగేళ్లు కష్టపడి కథను సిద్ధం చేశాడు. అద్భుతంగా తెరపైన ఆవిష్కరించాడు. ట్రైలర్‌లో తొలి షాట్ చూడగానే రియల్ పాన్ ఇండియన్ ఫిల్మ్ అనిపించింది. ప్రతిభావంతులైన నటీనటులు ఈ సినిమాతో వెండితెరకు పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉంది. అజయ్ పాత్ర ఆసక్తికరంగా అనిపించింది. నిర్మాతల అభిరుచి వల్లే ఇంత మంచి చిత్రం రూపుదిద్దుకుంది' అని ప్రశంసించారు. అనన్య మాట్లాడుతూ 'ట్రైలర్‌లో చూసింది కొంచెమే. మా సినిమా కొన్ని రోజుల పాటు ప్రేక్షకుల మనసులో నిలిచిపోతుంది. వాణిజ్య హంగులతో పాటు చక్కని కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అని సాహిత్ చెప్పారు. విక్రమార్కుడు చిత్రం తర్వాత ఆ స్థాయిలో ఉన్న విలన్ పాత్రను ఈ సినిమాలో చేశాను అని అజయ్ తెలిపారు.



మూడేళ్ల తరవాత..

బాలీవుడ్ జంట సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ మూడేళ్ల తరవాత కలిసి ఆన్‌స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. ఈ చిత్రాన్ని 'మ్యాడ్ డాక్ ఫిల్మ్స్' బేనర్‌పై దినేష్ విజన్ నిర్మిస్తున్నారు. సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ ఓకే అయినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కాగా, 2021లో విడుదలైన 'షేర్‌షా' సినిమాలో సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ తొలిసారిగా కలిసి నటించారు. గతేడాది వీరు వివాహం చేసుకున్నారు. పెళ్లి తరవాత ఇద్దరు కలిసి నటించబోతున్న తొలి చిత్రం ఇదే.

ఇన్ ప్రోగ్రెస్

తెల్లారు పొద్దుల్లో

సదన్, ప్రియాంక జంటగా రూపొందుతున్న 'ప్రణయ గోదారి' చిత్రం నుంచి తాజాగా 'తెల్లారు పొద్దుల్లో' అంటూ సాగే మెలోడియస్, రొమాంటిక్ సాంగ్‌ను నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ విడుదల చేశారు. సంగీత దర్శకుడు మార్కండేయ రాసి, స్వరపరిచిన ఈ పాటను ధనుంజయ్, అదితి



భావరాజు పాడారు. పాట చాలా బాగుందని, అరకులో అందమైన ప్రదేశాల్లో చక్కగా చిత్రీకరించారని శేఖర్ మాస్టర్ ప్రశంసించారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర నిర్మాత పారమళ్ల లింగయ్య చెప్పారు. పి.ఎల్.విఘ్నేష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

అమ్మ మనసు బాధపడితే..

అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రేమమయిగానే కాదు త్యాగమూర్తిగా కూడా ఆమెకు సాటి మరెవరూ లేరు. అటువంటి ఓ అమ్మ మనసు ఎలాంటి భావోద్వేగాలకు గురైంది, అందుకు దారి తీసిన పరిస్థితులు ఏమిటి.. అనే అంశాలతో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన




పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు కిశోర్ నిర్మిస్తున్నారు. చిత్రం ప్రోగ్రెస్ గురించి ఆయన మాట్లాడుతూ 'షూటింగ్ పార్ట్ , డబ్బింగ్ పూర్తయ్యాయి. మిగిలిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంతో జరుగుతున్నాయి. సోషల్ మీడియా లో గురువారం టీజర్‌ను విడుదల చేశాం. అద్భుతమైన స్పందన వస్తోంది' అని తెలిపారు.'మంచి కథ, కథనాలతో తొలి ప్రయత్నంగా మా బేనర్‌లో ఒక సినిమా తీయాలని సంకల్పించి ఈ సినిమా తీశాం. నవంబర్‌లో విడుదల చేస్తాం' అని చెప్పారు ముత్యాల సుబ్బయ్య. ఓ మధ్యతరగతి తల్లి కథ ఇదనీ, ప్రేక్షకులను ఆకట్టుకొనే రీతిలో రూపొందించామనీ దర్శకుడు వి.శ్రీనివాస్(సిప్పీ) చెప్పారు.

పవన్ కల్యాణ్ టైటిల్‌తో

ప్రదీప్ మాచిరాజు కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం ఖరారైంది. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన తొలి చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' టైటిల్‌ను యూనిట్ ఖరారు చేసింది. దీంతో పాటు ఫస్ట్‌లుక్, మోషన్ వీడియోను విడుదల చేశారు. నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దీపికా పిల్లి కథానాయిక. వెన్నెల కిశోర్, సత్య, గెటప్ శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. మాంక్స్ అండ్ మంకీస్ సంస్థ నిర్మిస్తోంది. సంగీతం: రధన్, సినిమాటోగ్రఫీ: ఎంఎన్ బాలరెడ్డి.





గ్లాడియేటర్ 2 వస్తోంది

పురాతన రోమ్ సామ్రాజ్యాన్ని పాలించిన నిరంకుశ చక్రవర్తుల ఆగడాలు, వారిపై లూసియస్ పోరాటం.. కథాంశంగా రూపుదిద్దుకున్న 'గ్లాడియేటర్' చిత్రం 2000 సంవత్సరంలో విడుదలై ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. దీనికి సీక్వెల్‌గా రూపొందిన 'గ్లాడియేటర్ 2' చిత్రం నవంబర్ 15న ఇంగ్లీష్, తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. పెడ్రో పాస్కల్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రం గ్రిప్పింగ్ యాక్షన్, హై స్టాక్స్ డ్రామాతో ప్రేక్షకుల్ని అలరించనుంది. రిడ్లీ స్కాట్ అద్భుతమైన విజువల్స్‌తో, ఆకట్టుకునే విధంగా 'గ్లాడియేటర్ 2' చిత్రాన్ని రూపొందించారు.

'బ్యాక్‌డోర్' దర్శకుడి కొత్త చిత్రం

'బ్యాక్‌డోర్' అనే సందేశాత్మక చిత్రంతో ప్రేక్షకుల మన్ననలతోపాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు దర్శకుడు కర్రి బాలాజీ. ఆయన దర్శకత్వంలో మరో చిత్రాన్ని ప్రకటించారు. గతంలో 'అన్‌స్టాపబుల్' అనే కామెడీ ఎంటర్‌టైనర్‌ను నిర్మించిన రంజిత్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలాజీ సినిమా విశేషాలను గురించి వివరిస్తూ 'రేవ్‌పార్టీలు, పబ్బుల్లో జల్సా చేస్తున్న ఈ తరం యువత ఎలా మత్తులో చిత్తవుతోంది, తమ జీవితాలను నాశనం చేసుకుంటోంది అనే అంశాల చుట్టూ అల్లుకున్న కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశాం. ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభిస్తాం' అని చెప్పారు.



పసిడి రూ.80,000కు చేరువలో



సరికొత్త రికార్డు స్థాయికి 10 గ్రాముల ధర

ఢిల్లీ మార్కెట్లో రూ.79,900కు చేరిక

అంతర్జాతీయ విపణిలో 2,700 డాలర్లు దాటిన ఔన్స్ పసిడి

న్యూఢిల్లీ: బంగారం ధరలు మళ్లీ దూసుకుపోతున్నాయి. శుక్రవారం పసిడి రూ.80,000 మైలురాయికి చేరువైంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం మరో రూ.550 పెరిగి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.79,900కు చేరుకుంది. దేశీయంగా పసిడి ధర ఎగబాకడం వరుసగా ఇది మూడో రోజు. అంతర్జాతీయ విపణిలో స్వర్ణం మరింత ప్రియమవడం, పండగ సీజన్ కావడంతో ఆభరణ వర్తకులు, స్టాకిస్టులు కొనుగోళ్లు పెంచడం ఇందుకు కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. పుత్తడితో పాటు వెండి కూడా ఎగబాకింది. కిలో వెండి రూ.1,000 పెరిగి రూ.94,500 ధర పలికింది. కాగా, హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర పది గ్రాములకు రూ.870 పెరుగుదలతో రూ.78,980కి చేరుకుంది. 22 క్యారెట్ల రేటు రూ.800 పెరిగి రూ.72,400గా నమోదైంది. కిలో వెండి రూ.2,000 ఎగబాకి రూ.1.05 లక్షలు ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ తొలిసారిగా 2,700 డాలర్ల స్థాయిని అధిగమించి, సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో 0.76 శాతం పెరిగి 2,728.10 డాలర్ల వద్దకు చేరుకుంది. సిల్వర్ 32.30 డాలర్ల వద్ద ట్రేడైంది.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్న విషయంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా బులియన్ ధరలు మళ్లీ దూసుకెళ్తున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. అంతేకాదు, అమెరికాతో పాటు అభివృద్ధి చెందిన దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు వడ్డీ రేట్లు తగ్గిస్తుండటం కూడా పసిడి ధరలను ఎగదోస్తున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ విభాగ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. గత ద్రవ్యపరపతి సమీక్షలో అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేటును ఏకంగా 0.5 శాతం తగ్గించింది. వచ్చే సమీక్షల్లో ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. అంతేకాదు, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లను గురువారం మరో 0.25 శాతం తగ్గించింది. తాజా గోల్డ్ ర్యాలీకి ఇది కూడా కారణమైంది.

సాధారణంగా ఫెడ్ రేట్లు-గోల్డ్ డిమాండ్‌ది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో బంగారం కంటే స్థిర ఆదాయాన్ని పంచే బాండ్లు, మార్కెట్ ఫండ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. వడ్డీ రేట్లు తగ్గే సందర్భంలో బాండ్ల నుంచి పెట్టుబడులు విలువైన లోహాల్లోకి మళ్లుతుంటాయి.

రూ.500 లక్షల కోట్లు

ఎన్ఎస్‌డీఎల్ వద్ద డీమ్యాట్ రూపంలో ఉన్న మొత్తం సెక్యూరిటీల విలువ ఇది..

న్యూఢిల్లీ: ఈ ఏడాది సెప్టెంబరు చివరినాటికి తమ వద్ద ఎలక్ట్రానిక్ లేదా డీమెటీరియలైజ్ (డీమ్యాట్) రూపంలో ఉన్న మొత్తం సెక్యూరిటీల విలువ తొలిసారిగా రూ.500 లక్షల కోట్ల (6 లక్షల కోట్ల డాలర్లు) స్థాయిని దాటిందని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) వెల్లడించింది. ఈ చారిత్రక సందర్భంలో ఇన్వెస్టర్లు, మార్కెట్ వర్గాలు, నియంత్రణ సంస్థలతో పాటు సంబంధిత వర్గాలందరికీ ఎన్ఎస్‌డీఎల్ తాత్కాలిక ఎండీ ఎస్ గోపాలన్ ధన్యవాదాలు తెలిపారు. డిపాజిటరీ వద్ద డీమ్యాట్ రూపంలో ఉన్న సెక్యూరిటీల విలువ 2014 జూన్‌లో రూ.100 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది. ఇందుకు 18 ఏళ్లు పట్టింది. ఆ తర్వాత ఆరేళ్లలో (2020 నవంబరు) రూ.200 లక్షల కోట్లకు, ఆపై నాలుగేళ్లలో రూ.500 లక్షల కోట్లకు ఎగబాకింది. గత నెలాఖరు నాటికి ఎన్ఎస్‌డీఎల్ యాక్టివ్ క్లయింట్ ఖాతాల సంఖ్య 3,80,89,585కు చేరుకుంది.

3 రోజుల తర్వాత లాభాలు

సెన్సెక్స్ 218 పాయింట్లు అప్

ముంబై: వరుసగా మూడు రోజులు నష్టపోయిన ప్రామాణిక సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో స్వల్పంగా లాభపడ్డాయి. శుక్రవారం నష్టాల్లోనే ప్రారంభమైన సెన్సెక్స్.. క్రమంగా తేరుకుని మధ్యాహ్నానికల్లా లాభాలబాటపట్టింది. ఒక దశలో సూచీ 385 పాయింట్లు ఎగబాకి 81,391 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 218.14 పాయింట్ల లాభంతో 81,224.75 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104.20 పాయింట్ల వృద్ధితో 24,854.05 వద్ద ముగిసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,980 ▲	72,400 ▲	1,05,000 ▲
ముంబై	77,410 ▲	70,908 ▲	92,283 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	510
వరంగల్	492	గోదావరి	505
చిత్తూరు	538	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	129
కర్నూలు	120	నెల్లూరు	129
విశాఖపట్నం	120	అనంతపురం	129
గోదావరి	130		

జోయాలుక్కాస్ దీపావళి ఆఫర్లు

హైదరాబాద్: దీపావళి పండగను పురస్కరించుకుని ప్రముఖ ఆభరణాల రిటైల్ సంస్థ జోయాలుక్కాస్ ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. జోయ్ దీపావళి పేరుతో తీసుకువచ్చిన ఈ ఆఫర్లు ఈ నెల 18 నుంచి నవంబరు 3 వరకు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఆఫర్‌లో భాగంగా వినియోగదారులు రూ.లక్ష అంతకుపైబడి విలువ చేసే డైమండ్, అన్ కట్ డైమండ్ ఆభరణాల కొనుగోలుపై ఉచితంగా 1 గ్రాము బంగారు కాయిన్‌ను అందించనున్నట్లు వెల్లడించింది. అలాగే రూ.50,000 అంతకు పైబడిన విలువ చేసే బంగారం, ప్రీషియస్ జువెలరీ కొనుగోళ్లపై రూ.1,000 గిఫ్ట్ వోచర్, రూ.10,000 అంతకు మించిన వెండి ఆభరణాల కొనుగోలుపై రూ.500 గిఫ్ట్ వోచర్‌ను అందించనుంది. అలాగే వినియోగదారులు 10 శాతం ముందస్తు చెల్లింపుతో ప్రస్తుతమున్న బంగారం ధరను లాక్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, ఎండీ జోయ్ అలుక్కాస్ తెలిపారు. కస్టమర్లు తమ పాత బంగారాన్ని.. హెచ్‌యూఐడీ 916 హాల్‌మార్క్ కలిగిన జువెలరీతో మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు జోయాలుక్కాస్ తెలిపింది.

మాసే ఫెర్గూసన్ బ్రాండ్‌పై 'టఫే'కు ఊరట

న్యూఢిల్లీ: మాసే ఫెర్గూసన్ బ్రాండ్ వినియోగంపై చెన్నై కేంద్రంగా పనిచేసే వ్యవసాయ పరికరాల సంస్థ టఫేకు, మద్రాస్ హైకోర్టు నుంచి తాత్కాలిక ఊరట లభించింది. ఈ బ్రాండ్ తమదేనని, ఈ విషయంలో అమెరికా కంపెనీ ఏజీసీఓ కార్పొరేషన్ అనుబంధ సంస్థ మాసే ఫెర్గూసన్ కార్పొరేషన్‌కు ఎలాంటి హక్కులు లేవని 'టఫే' దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు కంపెనీకి అనుకూలంగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బ్రాండ్, ట్రేడ్ మార్క్ టఫే ఇండియాకు ప్రత్యేకమని కంపెనీ తన పిటిషన్‌లో న్యాయస్థానానికి తెలిపింది.

హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్‌ఎల్).. సెప్టెంబరు త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.2,327 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.1,729 కోట్లు)తో పోల్చితే లాభం 34.5 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.7,014 కోట్ల నుంచి రూ.8,522 కోట్లకు పెరిగింది.



ఐసీఎస్ఐ సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సామాజిక బాధ్యతలో సీఎస్‌లది కీలక పాత్ర

యువ సీఎస్‌లు కొత్త నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి
తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కంపెనీల సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)ల నిర్వహణలో కంపెనీ సెక్రటరీ (సీఎస్)లది కీలక పాత్ర అని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) సౌత్ ఇండియా రీజినల్ చాప్టర్ నిర్వహించిన సదస్సులో ఆయన ఈ విషయం తెలిపారు. తెలివితేటలే ప్రగతికి చోదక శక్తులన్నారు. దివాలా, మధ్యవర్తిత్వం, ఆర్బిట్రేషన్, వాల్యుయేషన్, ఫోరెన్సిక్ ఆడిట్, రిస్క్ మేనేజ్‌మెంట్లలోనూ సీఎస్‌లది కీలక పాత్ర అన్నారు. సీఎస్ కోర్సు పూర్తి చేస్తున్న యువకులు తాజా మార్పులనూ ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని గవర్నర్ కోరారు. మారిటైమ్ లా, క్యాపిటల్ మార్కెట్లకు సంబంధించి ఐసీఎస్ఐ ప్రత్యేక సీఎస్‌లను తీర్చిదిద్దడంపైనా గవర్నర్ సంతోషం వ్యక్తం చేశారు.

రెండు లక్షల మంది సీఎస్‌లు అవసరం: దేశంలో కంపెనీ సెక్రటరీల అవసరం ఏటికేటికీ పెరుగుతోందని ఐసీఎస్ఐ జాతీయ అధ్యక్షుడు నరసింహన్ అన్నారు. ప్రస్తుతం దేశంలో 74,000 మంది సీఎస్‌లు ఉన్నారు. 2047 నాటికి వీరి సంఖ్య రెండు లక్షలకు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌సీఎల్‌టీ కేసులు చూసే ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీల కోసం హైదరాబాద్‌లో రూ.10 కోట్ల అంచనాతో ప్రత్యేక భవనం నిర్మించనున్నట్లు ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ సభ్యుడు ఆర్ వెంకటరమణ ఈ సందర్భంగా వెల్లడించారు.

ఏపీ, తెలంగాణల్లో గోద్రెజ్ క్యాపిటల్ విస్తరణ

వచ్చే మార్చి నాటికి రూ.800 కోట్ల ఏయూఎం లక్ష్యం
సంస్థ ఎండీ మనీష్ షా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎస్ఎంఈ, ఎంఎస్ఎంఈ విభాగాలకు అవసరమైన రుణాలను అందిస్తున్న గోద్రెజ్ క్యాపిటల్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమవుతోంది. దక్షిణాదిలో రెండు తెలుగు రాష్ట్రాలు కంపెనీకి ఎంతో కీలకంగా ఉన్నాయని, కార్యకలాపాల విస్తరణ ద్వారా మరింత పట్టును చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు గోద్రెజ్ క్యాపిటల్ ఎండీ,సీఈఓ మనీష్ షా తెలిపారు. శుక్రవారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోని ఐదు నగరాల్లో 6 శాఖల ద్వారా కంపెనీ కార్యకలాపాలు సాగిస్తోందని, విస్తరణలో భాగంగా ఈ ఏడాది కొత్తగా మరో 10 శాఖలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కాగా ఏపీ, తెలంగాణల్లో కంపెనీ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.500 కోట్లుగా ఉందని, వచ్చే ఏడాది మార్చి నాటికి దీన్ని రూ.800 కోట్లకు పెంచుకోవాలని చూస్తున్నట్లు షా తెలిపారు. ఎంఎస్ఎంఈ, ఎస్ఎంఈ రంగంలోని కంపెనీలకు వర్కింగ్ క్యాపిటల్ కింద సెక్యూర్డ్, అన్ సెక్యూర్డ్ రుణాలను గోద్రెజ్ క్యాపిటల్ అందిస్తోంది. కాగా సప్లయ్-చెయిన్ రంగాలకు ఫైనాన్సింగ్ సేవలను విస్తరించామని, ఇందులో భాగంగా క్రీమ్‌లైన్ డెయిరీతో కలిసి డెయిరీ ఫార్మ్ లోన్‌ను ప్రారంభించినట్లు షా చెప్పారు. అలాగే వచ్చే రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లోని గృహ రుణ విభాగంలోకి ప్రవేశించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కంపెనీ ఏయూఎం రూ.13,600 కోట్లుగా ఉందని, మార్చి నాటికి దీన్ని రూ.17,000 కోట్లకు పెంచుకోవాలని చూస్తున్నట్లు షా చెప్పారు.

రెండు ఉపగ్రహాల అనుసంధానం

అనంత్ టెక్నాలజీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న అనంత్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏటీఎల్) మరో రెండు ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) త్వరలో ప్రయోగించే 400 కిలోల శ్రేణిలోని రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అసెంబ్లింగ్, అనుసంధానం, టెస్టింగ్ (ఏఐటీ) పూర్తి చేసినట్లు తెలిపింది. బెంగళూరులో ఏటీఎల్‌కు చెందిన ఏరోస్పేస్ పార్కులో కంపెనీ ఈ పని పూర్తి చేసింది. ఇస్రోకు చెందిన ఈ తరహా ఉపగ్రహాలకు ఒక ప్రైవేట్ కంపెనీ ఇలాంటి సేవలు అందించడం ఇదే మొదటిసారి. గత కొద్ది సంవత్సరాలుగా మౌలిక సదుపాయాలు, సుశిక్షితులైన మానవ వనరులపై పెట్టిన పెట్టుబడులతో ఇది సాధ్యమైందని కంపెనీ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు తెలిపారు.

స్పోర్ట్స్

1 — 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఓ క్యాలెండర్ ఇయర్‌లో 100 సిక్స్‌లు బాదిన తొలి జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. ఇంతకుముందు (2022) 89 సిక్స్‌లు కొట్టిన రికార్డు ఇంగ్లండ్ పేరిట ఉంది.

4 — టెస్టుల్లో కోహ్లీ 9000 పరుగుల మైలురాయిని చేరుకొన్నాడు. దీంతో సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన సచిన్ (15,921), ద్రవిడ్ (13,265), గవాస్కర్ (10,122) తర్వాత నాలుగో భారత బ్యాటర్‌గా.. ఓవరాల్‌గా 18వ ఆటగాడిగా విరాట్ నిలిచాడు.

అద్భుతం చేస్తారా!

పోరాడుతున్న టీవీ ఇండియా

కోహ్లీ, రోహిత్, సర్ఫరాజ్ అర్ధ శతకాలు



సర్ఫరాజ్ (70 బ్యాటింగ్)
కోహ్లీ (70)

● భారత్ రెండో ఇన్నింగ్స్ 231/3
● రచిన్ సెంచరీ ● కివీస్ 402 ఆలౌట్

బెంగళూరు: తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 46 పరుగులకే కుప్పకూలిన భారత్.. విరాట్, రోహిత్, సర్ఫరాజ్ దూకుడైన అర్ధ శతకాలతో ఏదో అద్భుతం చేసే విధంగా పోరాడుతోంది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 180/3తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కివీస్ 402 పరుగుల భారీ స్కోరు చేసింది. రచిన్ రవీంద్ర (134) శతకంతో అదరగొట్టగా.. టిమ్ సౌథీ (65) విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. జడేజా, కుల్దీప్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. 356 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన భారత్ ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. ఆఖరి బంతికి కోహ్లీ (70) అవుట్ కాగా.. సర్ఫరాజ్ (70 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (52), యశస్వీ జైస్వాల్ (35)ను ఎజాజ్ పటేల్ అవుట్ చేశాడు. కివీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు టీమిండియా ఇంకా 125 పరుగులు వెనుకబడింది. మొత్తంగా బ్యాటర్ల జోరుతో శుక్రవారం ఒక్కరోజే 453 పరుగులు నమోదయ్యాయి.

సౌథీ ఎదురుదాడి..: రచిన్, సౌథీ అనూహ్యంగా 8వ వికెట్‌కు 137 పరుగులు జోడించడంతో.. న్యూజిలాండ్ స్కోరు 400 పరుగులు దాటింది. తొలి సెషన్‌లోనే ఓవర్‌నైట్ బ్యాటర్ మిచెల్ (18)ను సిరాజ్ అవుట్ చేయగా.. బ్లండెల్ (5)ను బుమ్రా పెవిలియన్ చేర్చాడు. ఫిలిప్స్ (14), హెన్రీ (8)ను జడేజా బౌల్డ్ చేయడంతో.. కివీస్ ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగదనిపించింది. అయితే, సెటిల్డ్ బ్యాటర్‌కు సౌథీ అండగా నిలిచాడు. భారత స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొన్న రచిన్ సెంచరీ పూర్తి చేసుకోగా.. సౌథీ దూకుడు కనబర్చాడు. దీంతో లంచ్ సమయానికి న్యూజిలాండ్ 345/7తో నిలిచింది. తిరిగి వచ్చిన తర్వాత ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న సౌథీని సిరాజ్ క్యాచవుట్ చేసి జట్టుకు బ్రేక్ ఇచ్చాడు. ఎజాజ్ పటేల్ (4), రచిన్‌ను అవుట్ చేసిన కుల్దీప్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. 12 ఏళ్ల తర్వాత భారత గడ్డపై శతకం చేసిన కివీస్ ఆటగాడిగా రచిన్ నిలిచాడు.



రచిన్ రవీంద్ర (134)

అదరగొట్టిన కోహ్లీ, సర్ఫరాజ్..: భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్.. దూకుడైన ఆటతో అలరించింది. కోహ్లీ ఈ ఏడాది తొలి అర్ధ శతకంతోపాటు భారీషాట్లు ఆడడం ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. ఆరంభంలో జైస్వాల్‌లో కొంత తడబాటు కనిపించినా.. రోహిత్ మాత్రం సహజశైలిలో షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అయితే, 17వ ఓవర్‌లో పటేల్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన జైస్వాల్ స్టంపౌట్ కావడంతో.. తొలి వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాగా, ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న రోహిత్ భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించినా.. దురదృష్టవశాత్తు పటేల్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. ఆ దశలో కోహ్లీ, సర్ఫరాజ్ జట్టు బాధ్యతలను భుజాన వేసుకొన్నారు. విరాట్‌కు ఈ ఏడాది ఇదే తొలి హాఫ్ సెంచరీ. క్రీజులో కుదురుకొన్న వీరిద్దరూ మూడో వికెట్‌కు 136 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో టీమిండియా రోజును మెరుగ్గా ముగిస్తుందనిపించింది. కానీ, చివరి బంతికి ఫిలిప్స్ బౌలింగ్‌లో కోహ్లీ క్యాచవుట్ కావడం.. అభిమానులను నిరాశకు గురిచేసింది.



వెంటాడిన దురదృష్టం

జోరుమీదున్న రోహిత్ అనూహ్యంగా అవుటయ్యాడు. స్పిన్నర్ పటేల్ వేసిన బంతిని డిఫెన్స్ ఆడేందుకు రోహిత్ ముందుకు వంగాడు. కానీ, బ్యాట్ లోపలి అంచుకు తగిలిన బంతి బౌన్స్ అయి వికెట్లకు తగిలింది. దీంతో రోహిత్ నమ్మశక్యం కానిరీతిలో క్రీజును వదిలాడు.

స్కోరు బోర్డు

భారత్ భారత్ తొలి ఇన్నింగ్స్: **46 ఆలౌట్; న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** లేథమ్ (ఎల్బీ) కుల్దీప్ 15, కాన్వే (బి) అశ్విన్ 91, యంగ్ (సి) కుల్దీప్ (బి) జడేజా 33, రచిన్ (సి/సబ్) జురెల్ (బి) కుల్దీప్ 134, మిచెల్ (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 18, బ్లండెల్ (సి) రాహుల్ (బి) బుమ్రా 5, ఫిలిప్స్ (బి) జడేజా 14, హెన్రీ (బి) జడేజా 8, సౌథీ (సి) జడేజా (బి) సిరాజ్ 65, ఎజాజ్ (ఎల్బీ) కుల్దీప్ 4, ఓరోక్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 91.3 ఓవర్లలో 402 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-67, 2-142, 3-154, 4-193, 5-204, 6-223, 7-233, 8-370, 9-384; **బౌలింగ్:** బుమ్రా 19-7-41-1, సిరాజ్ 18-2-84-2, అశ్విన్ 16-1-94-1, కుల్దీప్ 18.3-1- 99-3, జడేజా 20-1-72-3.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (స్టంప్డ్) బ్లండెల్ (బి) పటేల్ 35, రోహిత్ (బి) పటేల్ 52, కోహ్లీ (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 70, సర్ఫరాజ్ (బ్యాటింగ్) 70; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 49 ఓవర్లలో 231/3; వికెట్ల పతనం:** 1-72, 2-95, 3-231; **బౌలింగ్:** సౌథీ 7-1-22-0, హెన్రీ 11-1-52-0, ఓరోక్ 11-1-48-0, ఎజాజ్ పటేల్ 12-2-70-2, ఫిలిప్స్ 8-1-36-1.

ఫైనల్లో న్యూజిలాండ్

టీ20 మహిళల వరల్డ్ కప్

- వెస్టిండీస్ ఓటమి
- దక్షిణాఫ్రికాతో తుదిపోరు రేపు

షార్జా: పద్నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత న్యూజిలాండ్ మహిళలు టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరారు. శుక్రవారం ఉత్కంఠగా జరిగిన రెండో సెమీఫైనల్లో న్యూజిలాండ్ 8 పరుగులతో వెస్టిండీస్‌ను ఓడించింది. తొలుత కివీస్ 20 ఓవర్లలో 128/9 స్కోరు చేసింది. జార్జ్ ప్లిమ్మర్ (33), సుజీ బేట్స్ (26), ఇసబెల్లా గేజ్ (20) సత్తాచాటారు. డాటిన్ 4, ఫ్లెచర్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 120/8 స్కోరుకే పరిమితమైంది. బౌలింగ్‌లో అదరగొట్టిన డాటిన్ (33) మెరుపు బ్యాటింగ్‌తో పోరాడింది. కానీ 17వ ఓవర్లో డాటిన్ అవుటవడంతో మ్యాచ్ కివీస్‌వైపు మొగ్గింది. ఆపై ఫ్లెచర్ (17 నాటౌట్), జైదా (14) విండీస్‌ను గెలిపించేందుకు చేసిన యత్నాలు ఫలించలేదు. కార్సన్ 3, కెర్ 2 వికెట్లు తీశారు. ఇక.. ఆదివారం జరిగే ఫైనల్లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ తలపడనున్నాయి.

సంక్షిప్తస్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 128/9 (ప్లిమ్మర్ 33, బేట్స్ 26, ఇసబెల్లా 20 నాటౌట్, డోటిన్ 4/22, అలీ ఫ్లెచర్ 2/22).
వెస్టిండీస్: 20 ఓవర్లలో 120/8 (డాటిన్ 33, ఫ్లెచర్ 17 నాటౌట్, జైదా 14, కార్సన్ 3/29, కెర్ 2/14).

భారత్-పాక్ సై

ఎమర్జింగ్ టీమ్స్ పోరు నేడు



మ్యాచ్ రా. 7 నుంచి

అల్‌అమారత్ (మస్కట్): ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో భాగంగా శనివారం కీలక మ్యాచ్ జరగనుంది. గ్రూప్ 'బి'లో హైదరాబాదీ తిలక్ వర్మ కెప్టెన్సీలోని భారత్ 'ఎ' జట్టు పాకిస్థాన్ 'ఎ'ను ఢీకొననుంది. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడుతున్నాయి. గ్రూప్ 'బి'లో భారత్, పాక్‌తోపాటు ఒమన్, యూఏఈ జట్లున్నాయి. రెండు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచే జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి.



ప్రారంభ వేడుకలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్ టైటాన్స్, బుల్స్ సారథులు పవన్, ప్రదీప్

టైటాన్స్ బోణీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్ 11లో తెలుగు టైటాన్స్ శుభారంభం చేసింది. శుక్రవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన లీగ్ ప్రారంభోత్సవానికి బాలీవుడ్ నటులు విద్యాబాలన్, కార్తీక్ ఆర్యన్ హాజరై సందడి చేశారు. ఆ తర్వాత జరిగిన సీజన్ తొలి మ్యాచ్‌లో టైటాన్స్ 37-29తో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. టైటాన్స్ కెప్టెన్ పవన్ షెహ్రావత్ 13 పాయింట్లతో అదరగొట్టగా, డిఫెండర్ క్రిషన్ ధుల్ 6 పాయింట్లు సాధించి, జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు. టైటాన్స్ స్టార్ రైడర్ పవన్ ప్రొ కబడ్డీ లీగ్‌లో 1200 రైడ్ పాయింట్ల మైలురాయిని చేరుకోవడం విశేషం. ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థి బెంగళూరును టైటాన్స్ రెండుసార్లు ఆలౌట్ చేసింది. బెంగళూరు కెప్టెన్, స్టార్ రైడర్ పర్దీప్ నర్వాల్ 3 పాయింట్లకే పరిమితమవడం ఆ జట్టు విజయావకాశాలను దెబ్బతీసింది. మరోమ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 36-28తో యుముంబాను ఓడించింది.



చాంపియన్ అర్జున్

లండన్: వరంగల్ కుర్రాడు అర్జున్ ఇరిగేసి డబ్ల్యూఆర్ చెస్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలిచాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఫైనల్ రౌండ్లో ఫ్రాన్స్ జీఎం మాగ్జిమ్ వాచెర్ లగ్రావెను ఓడించి అర్జున్ టైటిల్ దక్కించుకున్నాడు. ఫైనల్లో మొదట క్లాసికల్ చెస్‌లో రెండు గేమ్‌లూ డ్రాగా ముగిశాయి. దీంతో విజేతను తేల్చేందుకు జరిగిన ఆర్మగెడాన్ గేమ్‌లో మాగ్జిమ్‌ను అర్జున్ ఓడించి ట్రోఫీ అందుకున్నాడు. అర్జున్‌కు రూ. 18 లక్షలు ప్రైజ్‌మనీ లభించింది. అంతేకాదు, ఈ ప్రదర్శనతో అర్జున్ లైవ్ ఎలో రేటింగ్‌లో 2796కు చేరుకున్నాడు. ఆదివారం నుంచి జరిగే యూరోపియన్ కప్‌తో 2800 ఎలో రేటింగ్ మార్క్‌ను కూడా అర్జున్ అందుకునే అవకాశముంది.



లలిత్‌బాబుకు 'పట్టాయ' టైటిల్

పట్టాయ శ్రీరాచ చెస్ టైటిల్‌ను విజయవాడ గ్రాండ్‌మాస్టర్ లలిత్ బాబు గెల్చుకున్నాడు. థాయ్‌లాండ్‌లో శుక్రవారం ముగిసిన ఆఖరిదైన 9వ రౌండ్‌లో ఇండోనేసియా ఐఎం ఆదిత్య బగుస్ అర్ఫాన్‌తో తలపడిన లలిత్ డ్రాగా ముగించాడు. తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి లలిత్ 7 పాయింట్లతో విజేతగా నిలిచాడు.

పాక్ ఘన విజయం

నోమన్‌కు 8 వికెట్లు | **మూడున్నరేళ్ల తర్వాత స్వదేశంలో టెస్ట్ గెలుపు**

ముల్తాన్: మూడున్నర సంవత్సరాలు, 11 టెస్టుల అనంతరం పాకిస్తాన్ జట్టు స్వదేశంలో విజయాన్ని అందుకుంది. శుక్రవారం ముగిసిన రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్ 152 పరుగులతో పాక్ చేతిలో చిత్తయింది. 297 పరుగుల లక్ష్యంతో, ఓవర్‌నైట్ 36/2 స్కోరుతో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పర్యాటక జట్టు 144 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ పది వికెట్లను స్పిన్నర్లు నోమన్ అలీ (8/46), సాజిద్ ఖాన్ (2/93) తీశారు. మొదటి ఇన్నింగ్స్ పది వికెట్లనూ వారిద్దరే చేజిక్కించుకున్నారు. ఇలా ఓ టెస్ట్ మ్యాచ్‌లో 20 వికెట్లను ఇద్దరు బౌలర్లే కైవసం చేసుకోవడం 1972 తర్వాత ఇదే తొలిసారి ఇక..మ్యాచ్‌లో పాక్ 366, 221 రన్స్ చేయగా, ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 291 స్కోరు సాధించింది.

క్వార్టర్స్‌లో సింధు ఓటమి

ఓడెన్స్: డెన్మార్క్ ఓపెన్‌లో క్వార్టర్స్‌లో పీవీ సింధు పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సింధు 13-21, 21-16, 9-21తో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో ఓటమిపాలైంది. గతంలో గ్రెగోరియాతో 12 సార్లు ముఖాముఖి తలపడి ఏకంగా పదిసార్లు గెలిచిన సింధు ఈసారి మాత్రం మునుపటి ప్రదర్శన కనబర్చలేకపోయింది.

గుజరాత్‌ను ఆదుకున్న అర్జాన్

అహ్మదాబాద్: అర్జాన్ రోహిన్‌టన్ తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి అజేయ అర్ధ శతకం (59)తో గుజరాత్ జట్టును ఆదుకున్నాడు. ఆంధ్రతో శుక్రవారం మొదలైన ఈ రంజీ మ్యాచ్‌లో టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ తొలిరోజు ఆట ముగిసేసరికి 87 ఓవర్లలో 8 వికెట్లకు 289 పరుగులు చేసింది. ఆంధ్ర బౌలర్లలో లలిత్ 3, విజయ్ 2, శశికాంత్, నితీశ్, రాజు తలో వికెట్ తీశారు.

మేకప్

చలికి చెదరని అందం

చలి కాలం చర్మం పొడిబారి, నిర్జీవంగా మారుతుంది. మరి ఇలాంటి వాతావరణంలో మేకప్ ఎలా చేసుకోవాలి? తెలుసుకుందాం!

మాయిశ్చరైజింగ్ మాస్క్: చలి కాలంలో మాయిశ్చరైజర్ వాడకం పెంచాలి. చర్మం తేమగా మారడం కోసం మాయిశ్చరైజింగ్ మాస్క్‌లను మేకప్‌కు అరగంట ముందు అప్లై చేసుకుంటూ ఉండాలి. అలాగే ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత, మాయిశ్చరైజర్ అప్లై చేసి, అది చర్మంలో పూర్తిగా ఇంకిన తర్వాత మేకప్ మొదలుపెట్టాలి.

వాటర్‌ప్రూఫ్ మస్కారా: చలి కాలం చల్లని గాలులు సోకినప్పుడు కళ్లు తడిగా మారతాయి. దాంతో మస్కారా, కాటుకలు చెదిరిపోకుండా ఉండడం కోసం చలి కాలంలో తప్పనిసరిగా వాటర్‌ప్రూఫ్ మస్కారా, కాజల్ అప్లై చేసుకోవాలి.

ఫౌండేషన్: పౌడర్ ఫౌండేషన్లను చర్మం పీల్చుకోలేదు. కాబట్టి ఈ కాలంలో లిక్విడ్ ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. వాలైతే మాయిశ్చరైజర్, ఫౌండేషన్ రెండూ కలిపి వాడుకోవచ్చు.

ఐ షాడో: ఐ షాడో కోసం న్యూట్రల్ కలర్స్ ఎంచుకోవాలి. ఇందుకోసం కాపర్, బ్రాంజ్ కలర్స్ బాగుంటాయి.

బ్లష్: పింక్, పీచ్ కలర్ బ్లష్‌లు వింటర్‌కు నూటవుతాయి.

లిప్ బామ్: చల్లని గాలులకు పెదాలు పగిలిపోకుండా ఉండడం కోసం వెంట లిప్‌బామ్ ఉంచుకుని, తరచూ అప్లై చేసుకుంటూ ఉండాలి.



చర్మాన్ని ఇలా సిద్ధం చేయాలి

చలికాలం చర్మం పగలకుండా రాత్రి వేళ మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవడం తప్పనిసరి. అయితే ఆ జిడ్డును ముఖం నుంచి పూర్తిగా వదిలించిన తర్వాతే మేకప్ వేసుకోవాలి. మేకప్‌కు ముందు ముఖం తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలి. అలాగే తడి ఆరిన తర్వాత, తేమగా ఉన్నప్పుడే మేకప్ మొదలుపెట్టాలి. ఇలా ఆలస్యం చేయకుండా మేకప్ వేసుకోవడం వల్ల, చర్మానికి చక్కగా అంటుకుపోయి, ఎక్కువ సమయం చెక్కుచెదరకుండా ఉంటుంది. మేకప్ అప్లికేషన్ కోసం తడిపి, పిండిన స్పాంజిని వాడుకోవచ్చు. దీంతో ముఖం మీద ఫౌండేషన్ సమంగా పరుచుకుంటుంది. కళ్ల దిగువన అప్లై చేసేటప్పుడు వీలైనంత తక్కువ ఫౌండేషన్ వాడుకోవాలి.

పేరెంటింగ్

పిల్లలతో ఎలా మాట్లాడాలి?

పిల్లలతో మాట్లాడడం, వాళ్లచేత మాట్లాడించడం ఒక కళ. ముఖ్యంగా అయిదు నుంచి పదేళ్ల మధ్య వయసు పిల్లలతో అయితే మరీ సున్నితమైన అంశమనే చెప్పాలి. ఈ వయసు పిల్లలు కనిపించిన ప్రతీదాని గురించి ప్రశ్నిస్తూ వాటి గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. ఈ క్రమంలోనే మాట్లాడడం నేర్చుకుంటారు. తల్లిదండ్రులు పిల్లల ప్రశ్నలకు సమాధానాలిస్తూ వాళ్లని కూడా మాట్లాడనివ్వాలి. సంభాషణను మధ్యలోనే ముగించే ప్రయత్నం చేయకూడదు. పిల్లలు మాట్లాడుతూ దగ్గరకు వచ్చినపుడు వారిని గమనిస్తూ చిరునవ్వుతో స్వాగతించాలి. ప్రశాంతంగా వాళ్లు చెప్పే మాటలు వినాలి. అప్పుడే పిల్లలు తమ భావాలను తల్లిదండ్రులతో పంచుకోవడం అలవాటు చేసుకుంటారు. పిల్లలు అల్లరి చేయడం సహజం. ఇది అందరికీ తెలిసిందే! అయినా కొంతమంది తల్లిదండ్రులు పరుషమైన పదాలతో పిల్లలపై తమ కోపాన్ని విసుగును ప్రదర్శిస్తుంటారు. దీనివల్ల పిల్లలు స్తబ్దుగా మారే ప్రమాదముంది. ఇలా కాకుండా పిల్లలతో ఏ సందర్భంలో ఎలా మాట్లాడాలి? ఏం మాట్లాడాలి? ఏం మాట్లాడకూడదు? అనే అంశాలు తెలుసుకుందాం!

- పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి రాగానే ఆ రోజు జరిగిన విషయాలన్నీ తల్లిదండ్రులతో చెప్పాలనుకుంటారు. వాళ్లని చెప్పనివ్వాలి. మధ్యలో మాట్లాడుతూ పిల్లలను తప్పు పట్టడం, వాళ్లని కోప్పడడం చేయకూడదు. ఇలా చేస్తే పిల్లలు స్కూల్ విషయాలు ఇంట్లో చెప్పడానికి ఆసక్తి చూపరు.
- స్కూల్ నుంచి కానీ, తోటి పిల్లల తల్లిదండ్రుల నుంచి కానీ, ఇరుగు-పొరుగు వారి నుంచి కానీ ఏదైనా కంప్లయింట్ వచ్చినపుడు వెంటనే పిల్లలను తప్పు పట్టకూడదు. కంప్లయింట్ ఇచ్చినవారికి సామరస్యంగా సర్దిచెప్పాలి. పిల్లలను దగ్గరికి పిలిచి వారితో సౌమ్యంగా మాట్లాడుతూ అసలు విషయం తెలుసుకునే ప్రయత్నం చేయాలి. పిల్లల తప్పు ఉంటే ఇంకోసారి అలా చేయకుండా బుజ్జగింపు ధోరణిలో నచ్చచెప్పాలి. పిల్లలపై తమకున్న ప్రేమను తెలుపుతూ మాట్లాడాలి.
- పిల్లలను ప్రతిదానికీ విమర్శించడం, కఠినమైన పదాలతో తిట్టడం, ఏ పనిచేసినా వాళ్లని తక్కువ చేయడం, తోటి పిల్లలతో పోల్చడం, వాళ్లపై నెగెటివ్ కామెంట్స్ చేయడం, వెటకారంగా మాట్లాడడం వల్ల వాళ్లలో ఆత్మవిశ్వాసం లోపిస్తుంది. ఆత్మన్యూనత, ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయి. తల్లిదండ్రులపై ద్వేషభావం ఏర్పడుతుంది. ఇలా కాకుండా పిల్లలు చెప్పిన మాట విని క్రమశిక్షణతో మెలగాలంటే వారికి సమస్య, సందర్భాలను సూటిగా చిన్న పదాలతో వివరిస్తూ సౌమ్యంగా సంభాషించాలి.
- పిల్లలు చేసిన పనికి వారిని తిట్టకుండా వాళ్లు ఏమి చేయాలో చెప్పి చేయించాలి. 'గదిలోనుంచి వచ్చేటపుడు ఫ్యాన్ ఆఫ్ చేయాలని నీకెన్నిసార్లు చెప్పాలి' అనే బదులు 'గదిలో ఫ్యాన్ అనవసరంగా తిరుగుతుందమ్మా' అని చెప్పవచ్చు. సమస్యను వివరిస్తూ సందర్భానుసారంగా పిల్లలు చేయాల్సిన పని వారికి అర్థమయ్యేలా మాట్లాడాలి.
- పిల్లలకు సమాచారమిస్తూ చేయాల్సిన పనిని కూడా చెప్పేస్తే పిల్లలకు విషయం సులువుగా అర్థమవుతుంది. 'ఎన్నిసార్లు చెప్పినా ట్యాబ్ ఎక్కడ పడితే అక్కడ పెడతావెందుకు?అనవసరంగా కొన్నాను' అనే బదులు 'ట్యాబ్ డైనింగ్ టేబుల్ మీద పెడితే పొరబాటున నీళ్లు పడి పాడవుతుంది. ఇక్కడ నుంచి తీసెయ్' అని చెప్పవచ్చు.
- పిల్లలకు పెద్ద పెద్ద లెక్చర్స్, స్పీచ్‌లు నచ్చవు. ఎంత తక్కువగా చెప్తే అంత తొందరగా అర్థం చేసుకుంటారు. 'ఎన్నిసార్లు చెప్పినా వాటర్ బాటిల్ మర్చిపోతావేంటి' అనే బదులు 'నాన్నా వాటర్ బాటిల్' అంటే చాలు.
- పిల్లలు చేయాల్సిన పనిని సూచిస్తూ నోట్ రాసినా కూడా వాళ్లు సంబరపడతారు. నోటితో చెప్పినదాని కంటే ఇది ప్రభావవంతంగా ఉంటుంది. చెప్పుల స్టాండ్ మీద 'కీప్ యువర్ స్లిప్పర్స్ హియర్' అని రాసిన పేపర్‌ను క్లిప్ చేయవచ్చు.
- మర్యాదతో కూడిన కమ్యూనికేషన్‌ను తల్లిదండ్రులు పాటిస్తుంటే పిల్లలు కూడా అదే నేర్చుకుంటారు.



వంటిల్లు



ఈ మధ్యకాలంలో ఆరోగ్యకరమైన ఆహారాన్ని మాత్రమే తినాలనుకొనే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అలాంటి వారి కోసం కొన్ని వంటలు అందిస్తున్నాం.. ఆస్వాదించండి..

ఆరోగ్యానికి ఆరోగ్యం | రుచికి రుచి

క్యాబేజీ దాల్ పరాటా

కావాల్సిన పదార్థాలు: గోధుమ పిండి - ఒక కప్పు, క్యాబేజీ తురుము- ఒక కప్పు, పెసరపప్పు- మూడు స్పూనులు, సోంపు- ఒక టేబుల్ స్పూను, సన్నటి ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, తరిగిన పచ్చి మిర్చి ముక్కలు- ఒక టేబుల్ స్పూను, సన్నగా తరిగిన పుదీనా- రెండు స్పూనులు, పసుపు- పావు స్పూను, నూనె- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

పరాటా కోసం..

గోధుమ పిండిలో ఒక స్పూను నూనె, కొద్దిగా ఉప్పు వేసి - నీళ్లు పోసి కలపాలి. ఈ పిండి పలుచగా ఉండకూడదు. అలాగని పూరీ పిండిలా బాగా గట్టిగా కూడా ఉండకూడదు. దీనిని ఒక బేసిన్‌లో పెట్టి తడిగుడ్డ కప్పి 15 నిమిషాలు ఉంచాలి.

జాగ్రత్తలు
- స్టఫింగ్ బాగా ముద్దగా ఉండకూడదు. పొడిగా ఉంటేనే పరాటా బావుంటుంది.
- స్టఫింగ్ పెట్టిన తర్వాత పరాటాను గట్టిగా ఒత్తకూడదు. ఒత్తితే స్టఫింగ్ బయటకు వచ్చేస్తుంది.

స్టఫింగ్ కోసం..
- ఒక మూకుడులో నూనె వేసి సోంపు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా వేయించాలి. ఆ తర్వాత దానిలో పచ్చి మిర్చి ముక్కలు, క్యాబేజీ వేసి మూత పెట్టి మగ్గనివ్వాలి.
- ఆ తర్వాత పెసరపప్పు, పుదీనా, పసుపు కూడా వేసి మగ్గనివ్వాలి. మధ్యలో కొద్దిగా నీళ్లు చల్లాలి. బాగా మగ్గిన తర్వాత చల్లార్చాలి.

చివరగా..
- గోధుమ పిండిని గుండ్రంగా ఒత్తాలి. దాని మధ్యలో స్టఫింగ్ పెట్టి - గుండ్రంగా ఉండలా చేయాలి.
- ఈ ఉండను చేతితో కానీ అప్పడాల కర్రతో కానీ ఒత్తుకోవాలి. దానిని పెనంపై కొద్దిగా నూనె రాసి కాల్చాలి.

బెండకాయ పెరుగు కూర

కావాల్సిన పదార్థాలు:

బెండకాయలు (250గ్రాములు), పెద్ద టమోటాలు- రెండు, పెరుగు (ఒక కప్పు), ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక స్పూను, శనగ పిండి- మూడు స్పూన్లు, జీలకర్ర- అర స్పూను, ధనియాల పొడి- అర స్పూను, కాశ్మీరీ కారం- ఒక స్పూను, పసుపు- పావు స్పూను, గరం మసాలా- ఒక స్పూను, క్రీమ్- రెండు స్పూనులు, నూనె- నాలుగు స్పూనులు, నెయ్యి- ఒక స్పూను, మెంతి పొడి- పావు స్పూను, జీడిపప్పులు- 10, తరిగిన కొత్తిమీర- ఒక స్పూను, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం
- బెండకాయలను బాగా కడిగి.. తుడిచి.. చిన్న ముక్కలుగా తరగాలి. ఈ ముక్కలను ఒక మూకుడులో రెండు స్పూన్ల నూనెలో వేసి మూత పెట్టాలి. పది నిమిషాల తర్వాత ఈ ముక్కలు మెత్తపడతాయి. అప్పుడు వాటిని మూకుడులో నుంచి బయటకు తీసి చల్లబర్చాలి.
- టమోటాలను చిన్న ముక్కలుగా చేయాలి. వీటిని, జీడిపప్పులను ఒక మిక్సీ జార్‌లో వేసి ముద్దగా చేయాలి.
- పెరుగును ఒక గిన్నెలో వేసి ఒక స్పూనుతో బాగా తిప్పాలి.
- బెండకాయ ముక్కలు వేయించిన మూకుడులో నెయ్యి వేయాలి. ముందు జీలకర్రను దానిలో వేసి వేయించాలి. ఆ తర్వాత దానిలో ఉల్లిపాయ ముక్కలు వేయాలి. ఉల్లిపాయ ముక్కలు బాగా వేగిన తర్వాత దానిలో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయాలి. ఆ తర్వాత టమోటా, జీడిపప్పు ముద్దను వేసి వేయించాలి.
- ఆ మిశ్రమంలో మసాలా, శనగ పిండి, ధనియాల పొడి, కారం, పసుపు వేయాలి. ఈ మిశ్రమాన్ని కొద్ది సేపు మగ్గనివ్వాలి. ఆ తర్వాత చల్లార్చిన బెండకాయ ముక్కలు వేయాలి.
- ఈ మిశ్రమం చల్లారిన తర్వాత దానిలో పెరుగు కలపాలి. అవసరమైతే కొన్ని నీళ్లు కూడా కలపవచ్చు. ఈ మిశ్రమంలో ఉప్పు వేసిన తర్వాత మళ్లీ స్టౌ మీద పెట్టి ఇంకొంత సేపు ఉడకనివ్వాలి.
- ఈ మిశ్రమంలో క్రీమ్ మరియు తరిగిన కొత్తిమీర వేయాలి.

జాగ్రత్తలు
- బెండకాయలను ఎక్కువగా వేయించకూడదు. బెండకాయలు ఎక్కువగా వేగితే రుచి పోతుంది.
- కూర చల్లారిన తర్వాత మాత్రమే పెరుగును కలపాలి. వేడిగా ఉన్నప్పుడు పెరుగు కలిపితే విరిగిపోయినట్లు అవుతుంది.
- జీడిపప్పు ముద్ద వేయకపోయినా పర్వాలేదు. అయితే జీడిపప్పు ముద్ద వల్ల కూరకు మంచి రుచి వస్తుంది.



క్యాబేజీ మిక్స్ వెజ్ కూర



కావాల్సిన పదార్థాలు: తురిమిన క్యాబేజీ- ఒక కప్పు, క్యారెట్ ముక్కలు, బీన్స్, కాకరకాయ ముక్కలు, పచ్చి బఠానీలు- రెండు కప్పులు, పచ్చి మిరపకాయ ముక్కలు- రెండు స్పూనులు, తురిమిన కొబ్బరి- అర కప్పు, కరివేపాకు- ఒక రెబ్బ, ఆవాలు- ఒక స్పూను, జీలకర్ర- ఒక స్పూను, వెల్లుల్లి- నాలుగు రెబ్బలు, కారం- రెండు స్పూనులు, ఆవ పొడి- ఒక స్పూను, పసుపు- పావు స్పూను, ఇంగువ- చిటికెడు, కొబ్బరి నూనె- 3 స్పూనులు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం
- ఒక మూకుడులో నూనెను వేడి చేసి దానిలో ఆవాలు, జీలకర్ర వేసి వేగనివ్వాలి. ఆ తర్వాత పచ్చి మిరపకాయ ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు, ఇంగువ వేసి ఒక ఐదు నిమిషాలు వేయించాలి. ఆ తర్వాత దానిలో కొబ్బరి తురుము వేయాలి.
- ఈ మిశ్రమంలో కూర ముక్కలు, పసుపు, కారం, ఉప్పు వేసి మూత పెట్టాలి. ఇవి కొద్దిగా ఉడికిన తర్వాత మూత తీసి నీళ్లు చల్లాలి. కూర ముక్కలు బాగా మగ్గిన తర్వాత స్టౌ మీద నుంచి కిందకు దింపేయాలి.

జాగ్రత్తలు
- చాలా మంది కాకరకాయ ముక్కలను ఇతర కూరలతో కలపటానికి ఇష్టపడరు. కాకర చేదు ఇతర ముక్కలకు అంటుకుంటుందని భావిస్తారు. కాకరకాయను చెక్కి ముక్కలుగా చేస్తే చేదు తగ్గుతుంది. కొబ్బరినూనెలో వేయిస్తే చిరు చేదు ఉన్నా పోతుంది.
- ఈ కూరలో ఎక్కువ నీళ్లు పోయకూడదు. ఎక్కువ నీళ్లు పోస్తే కూర ముద్దగా అయిపోతుంది.

వినూత్నం

ఔషధ మొక్కలను విస్తృతంగా పెంచగలిగితే, ఔషధాలు అందరికీ అందుబాటులోకి రావడంతో పాటు, అడవుల మీద భారం తగ్గుతుందని భావించింది ఒరిస్సాకు చెందిన మమతా బిస్వాల్. వందల రకాల ఔషధ మొక్కల పట్ల, ఆ మొక్కల వ్యాప్తికి తోడ్పడే పక్షుల పట్ల అందర్లో అవగాహన పెంచుతూ వినూత్నమైన పనికి పూనుకున్న మమత గురించిన ఆసక్తికరమైన కథ ఇది.





ఔషధ మొక్కలు నాటుతూ...

అడవుల మీద భారం తగ్గిస్తూ

చిన్నప్పటి నుంచే మొక్కలను పెంచే అభిరుచిని అలవరుచుకున్న మమత, ఔషధగుణాలు కలిగిన తులసి, కలబంద, అశోక, షమి మొక్కలను విరివిగా పెంచుతూ ఉండేది. పెళ్లయ్యాక ఆమె అభిరుచికి భర్త సహకారం తోడవడంతో, ఆ మొక్కల విస్తృత సాగు గురించి ఇంటర్నెట్‌లో పరిశోధించింది. లెక్కలేనన్ని పుస్తకాలు చదివింది. అలా సమకూర్చుకున్న పరిజ్ఞానంతో, 2011లో వాసంగ, గుడూచి, తులసి, సర్పగంధ, అశ్వగంధ, స్టీవియా, కాలమేఘ మొక్కలను ఇంట్లోనే పెంచడం మొదలుపెట్టింది. క్రమేపీ ఔషధ మొక్కల పెంపకం.. బడులు, కాలేజీలు, ఆలయాలూ, ఒరిస్సాలోని మునిసిపాలిటీలకు కూడా వ్యాప్తి చెందింది. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంతో పాటు, అడవుల్లో ఔషధమొక్కల సేకరణ కోసం వెళ్లే మనుషుల సంఖ్యను తగ్గించి, తద్వారా అడవులతో పాటు వన్యప్రాణుల మీద ఒత్తిడి తగ్గించాలనే సంకల్పంతో ఔషధ మొక్కల పెంపకాలను విస్తృతంగా చేపట్టినట్టు మమత పలు సందర్భాల్లో చెప్పుకొచ్చింది. 2016 నుంచి వేలకొద్దీ ఔషధ మొక్కలను నాటిన మమత, ఆ అభిరుచికి తన ఇల్లు ఎలా తోడ్పడిందో వివరిస్తూ..."ఒరిస్సా హోమ్ డిపార్ట్‌మెంట్‌లో స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసే మా వారికి, ప్రభుత్వం విశాలమైన ఇల్లు కేటాయించింది. దాంతో ఇంట్లోనే 50 రకాల ఔషధ మొక్కలను నాటి, నెమ్మదిగా వాటి సంఖ్యను పెంచుకుంటూ పోయాను. ఇప్పుడు ఆలయాలు, బడులు, కాలేజీలు... ఇలా ఔషధ మొక్కల పెంపకానికి అనువైన ప్రతి ప్రదేశంలో వాటిని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాను." అంటూ చెప్పుకొచ్చింది. తాజాగా 'ఆమ్ ఔసధ్య ఉద్భిద' (ఒడిసాలోని ఔషధ మొక్కలు) అనే పుస్తకం కూడా రాసిందామె.

మమత తన బృందంతో కలిసి ఇప్పటివరకూ తీర ఒరిస్సాలోని 120 ఆలయాల్లో మొక్కలు నాటింది. తులసి, గంధం, అశోక, షమి మొక్కలను రోడ్ల పక్కన, ఆలయాల్లో నాటింది. అలాగే త్రిస్సూర్, కేరళలోని త్రివేండ్రంలలో 20 మంది ప్రత్యామ్నాయ వైద్యుల బృందానికి నాయకత్వం వహిస్తోంది.

రిసోర్స్ పర్సన్‌గా మారి...

"ఔషధ మొక్కలను సాగు చేయడం వల్ల ఆ మొక్కలను అంతరించిపోకుండా కాపాడుకోవడంతో పాటు, మనుషులు జంతువుల మధ్య ఘర్షణను కూడా తగ్గించవచ్చు. వాటిని సేకరించడం కోసం అడవుల్లోకి అడుగు పెట్టే మనుషుల సంఖ్య తగ్గుతుంది కాబట్టి అటవీ పర్యావరణం కూడా ఆరోగ్యంగా ఉంటుంది" అంటూ ఓ సందర్భంలో చెప్పుకొచ్చిన మమతకు, 2016లో స్టేట్ మెడిసినల్ ప్లాంట్ బోర్డు శరక అశోక అనే ట్రైనింగ్ సెషన్‌కు ఆమెను ఆహ్వానించింది. అశోకారిష్ట అనే మూలికా కషాయం తయారీకి ఉపయోగపడే 'శరక అశోక' మహిళల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఆ సెషన్‌కు వెళ్లే ముందు తాను ఆ మొక్క గురించి మరింత లోతుగా అధ్యయనం చేశాననీ, ఎస్ఎమ్‌పిబికి, రిసోర్స్ పర్సన్‌గా మారిన తర్వాత, ఔషధ మొక్కల గురించి మరెన్నో కీలకమైన





విషయాలను తెలుసుకున్నాననీ చెప్పుకొచ్చింది. సంరక్షణ, సాగు, పరిశోధన, అభివృద్ధి ద్వారా ఒరిసా ప్రభుత్వం, ఎస్ఎమ్‌పిబి ద్వారా, ఔషధ మొక్కల రంగానికి ప్రచారం కల్పిస్తోంది. సాంకేతిక సహకారం, ప్రాథమిక ప్రాసెసింగ్ సౌకర్యాలను కల్పించడం ద్వారా ఎస్ఎమ్‌పిబి, ఔషధ మొక్కల పెంపకందారులను ప్రోత్సహిస్తోంది. రిసోర్స్ పర్సన్‌గా పని చేస్తున్న మమత, స్థానికంగా ఉన్న ప్రత్యామ్నాయ వైద్యులతో తన పరిజ్ఞానాన్ని పంచుకుంటోంది.

మొక్కలను కొంటూ, ఉచితంగా పంచుతూ..

మమత ప్రతి ఏటా భువనేశ్వర్ సిటీ డివిజన్‌కు చెందిన అటవీ శాఖ నుంచి వెయ్యి ఔషధ మొక్కలను కొనుగోలు చేస్తూ, వాటి నుంచి శాంప్లింగ్స్‌ను ఉత్పత్తి చేసి, అందరికీ పంచి పెడుతోంది. హెర్బల్ గార్డెన్‌ను పెంచాలనుకునేవాళ్లకు ఉచితంగా మొక్కలను పంచడం వల్ల, వాళ్లను ప్రోత్రహించినట్టు అవుతుందని మమత భావిస్తోంది. మమత తన బృందంతో కలిసి ఇప్పటివరకూ తీర ఒరిస్సాలోని 120 ఆలయాల్లో మొక్కలు నాటింది. తులసి, గంధం, అశోక, షమి మొక్కలను రోడ్ల పక్కన, ఆలయాల్లో నాటింది. అలాగే త్రిస్సూర్, కేరళలోని త్రివేండ్రంలలో 20 మంది ప్రత్యామ్నాయ వైద్యుల బృందానికి నాయకత్వం వహిస్తోంది.

పక్షుల పట్ల ప్రేమ

మొక్కల జాతులను గుర్తుపట్టడంలో, మొక్కల వ్యాప్తిలో పక్షులెంతో సహాయపడతాయని గ్రహించిన మమత, స్థానిక పక్షుల పట్ల మక్కువ పెంచుకుంది. పక్షుల గురించిన అవగాహన పెంచుకోవడం కోసం నిపుణులతో కలిసి చిల్కా సరస్సును కూడా సందర్శిస్తూ ఉంటుంది. నిపుణుల బృందం వలస పక్షుల మీద దృష్టి పెడితే, మమత, స్థానిక పక్షుల పట్ల అవగాహన పెంచుకుంటోంది. "స్థానిక పక్షులు వేర్వేరు కీటకాలను తినడంతో పాటు, కొన్ని సముద్రపు మొక్కలను తింటూ ఉండడాన్ని నేను గమనించాను. ఈ పక్షులను ఆకర్షించేలా వాటికి ఆహారంగా ఉపయోగపడే మొక్కలను పెంచగలిగితే, స్థానికంగా పెరిగే ఔషధమొక్కలు వేర్వేరు ప్రాంతాలకు విస్తరించే అవకాశాలున్నాయి. కాబట్టి స్థానిక ప్రజలకు పక్షుల పట్ల కూడా అవగాహన పెంచుతున్నాను." అంటూ చెప్పుకొచ్చిన మమత, బ్రతికినంతకాలం ఔషధ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తూనే ఉంటాననీ, వీలున్న ప్రతిచోటా మొక్కలను నాటుతూనే ఉంటాననీ అంటోంది.

పోషకాల గని మొక్కజొన్న

మొక్కజొన్న చౌకగా లభించే పోషకాహారం. ఇది తక్షణ శక్తిని అందిస్తుంది. మొక్కపొత్తులను బొగ్గులమీద కాల్చినా, నీళ్లలో ఉడికించినా అవి అందించే ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో!

- సీజనల్‌గా లభించే మొక్కజొన్న గింజలు తినడం వలన శరీరానికి లినోలిక్ యాసిడ్, ఫోలిక్ యాసిడ్‌తోపాటు ఎ, ఇ, బీ 1, బీ 6, రైబోఫ్లవిన్, థయమిన్ అనే విటమిన్లు అందుతాయి. మధుమేహం నియంత్రణలో ఉంటుంది. రక్తహీనత తగ్గి ఎర్ర రక్తకణాలు వృద్ధి చెందుతాయి. కంటి చూపు మెరుగవుతుంది.
- మొక్కజొన్నలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మం మీద ముడతలు రాకుండా చేస్తాయి. ఈ గింజల నుంచి తీసిన నూనె చర్మవ్యాధులకు ఔషధంలా పనిచేస్తుంది.



- మొక్కజొన్న గింజల నుంచి తయారు చేసే పాప్‌కార్న్, కార్న్‌ఫ్లేక్స్ అనేవి పిల్లలకు, పెద్దలకు ఎంతో ఇష్టమైన చిరుతిండి. వీటి ద్వారా లభించే పీచుపదార్థం మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్ధకం, మొలలు, పేగు క్యాన్సర్ రాకుండా నివారిస్తుంది.
- ఉడికించిన మొక్కజొన్న గింజలు తినడం వలన రక్తంలో కొవ్వు స్థాయి తగ్గుతుంది. రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగవుతుంది. రక్తపోటు, పక్షవాతం, గుండెపోటు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.
- చలికాలంలో ఎదురయ్యే జుట్టు సమస్యలను అధిగమించేందుకు మొక్కజొన్న గింజలను రోజూ ఆహారంలో చేర్చుకోవాలి. వీటి నుంచి లభించే సి విటమిన్, ఖనిజాలు చర్మానికి, జుట్టుకు పోషణను, శక్తిని అందిస్తాయి.
- మొక్కజొన్నలో పిండిపదార్థాలు అధికంగా ఉంటాయి. బరువు పెరగాలనుకునేవారికి ఇది మంచి ఆహారం. శరీరంలోని కండరాలను ఆరోగ్యంగా ఉంచుతుంది.

జుట్టు రాలిపోతుంటే...

నల్లని ఒత్తైన పొడవాటి జుట్టు ఉండాలని అమ్మాయిలంతా కోరుకుంటారు. కానీ ఆ ఆశ అందరికీ నెరవేరడం లేదు. వాతావరణ కాలుష్యం, పోషకాహార లోపం, ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, రక్తహీనత వంటి కారణాల వల్ల యువతులు, మహిళలు జుట్టురాలే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు పాటించాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం!

పోషకాహారం
- జుట్టు రాలడానికి ప్రధాన కారణం వెంట్రుకల కుదుళ్లు బలహీనమవడమే. కుదుళ్లు బలంగా ఉండాలంటే విటమిన్లు, మినరల్స్, ప్రొటీన్లు ఉండే పోషకాహారం తీసుకోవాలి. రోజూ ఆకుకూరలు, గుడ్లు, చేపలు, నట్స్, మొలకలు, పండ్లు ఉండేలా డైట్ ప్లాన్ చేసుకోవాలి.

మసాజ్
- వెంట్రుకల కుదుళ్లు బలంగా ఉండేందుకు వాటికి తగినంత రక్త ప్రవాహం అందేందుకు మాడు మీద మసాజ్ చేసుకోవాలి. ప్రతిరోజూ కనీసం పదిహేను నిమిషాలు కొబ్బరినూనెతో తలమీద సున్నితంగా మర్దన చేసుకోవాలి. దీని వల్ల కుదుళ్లు ఉత్తేజితమై శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి.

గుడ్లు
- జుట్టు రాలడాన్ని అరికట్టి వెంట్రుకలకు పోషణ అందించడంలో గుడ్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఒక గిన్నెలో కోడిగుడ్డు తెల్ల సొన వేసి నురుగు వచ్చేలా బాగా గిలక్కొట్టాలి. దీనిని వెంట్రుకల కుదుళ్లకు చేరేలా తలకు పట్టించాలి. కనీసం ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో కడిగి మైల్డ్ షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.

కొబ్బరి పాలు
- కొబ్బరి పాలలో క్యాల్షియం, ఐరన్, పాస్ఫరస్, విటమిన్లు, ప్రొటీన్లు సమృద్ధిగా ఉంటాయి. తాజా కొబ్బరి పాలను తలకు పట్టించి అరగంట ఆరనివ్వాలి. తరవాత తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే జుట్టు రాలడం తగ్గుతుంది. వెంట్రుకలకు కావాల్సిన తేమ, పోషణ అందుతాయి.



కలబంద
- కలబంద గుజ్జును తలకు పట్టించి గంట సేపు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో కడగాలి. కలబంద గుజ్జు తలలోని పీహెచ్ లెవెల్స్‌ని సమతుల్యం చేస్తుంది. చుండ్రుని నివారిస్తుంది.

గ్రీన్ టీ
- ముందుగా గ్రీన్ టీ తయారు చేసుకుని చల్లార్చి పక్కన పెట్టండి. తలస్నానం పూర్తయిన తరవాత ఈ టీని తలకు, వెంట్రుకలకు పట్టించండి. ఇది మంచి కండిషనర్‌లా పనిచేసి వెంట్రుకలకు మెరుపునిస్తుంది. గ్రీన్ టీ లోని యాంటీ ఆక్సిడెంట్లు కుదుళ్లను బలోపేతం చేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి.

పర్మిట్ రూమ్‌లు లేవు

- ప్రభుత్వ నిర్ణయంతో 170 కోట్ల నష్టం
- నూతన మద్యం పాలసీ అమల్లోకి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మద్యం షాపుల పక్కన పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని కొత్త పాలసీలో పెట్టకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. కొత్త మద్యం పాలసీలో తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా రూ.170 కోట్ల ఆదాయం కోల్పోయింది. మరోవైపు బార్ల యాజమాన్యాలకు భారీగా మేలు చేకూరనుంది. షాపుల పక్కన మద్యం తాగేందుకు పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వకపోవడంతో బార్లకు ఆదాయం పెరిగే అవకాశం ఏర్పడింది. గతంలో ప్రైవేటు పాలసీల్లో పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇచ్చారు. దీంతో ఒక్కో షాపు నుంచి ప్రభుత్వానికి రూ.5 లక్షలు ఆదాయం వచ్చేది. అయితే జగన్ సర్కారు దశలవారీగా మద్యపాన నిషేధమంటూ పర్మిట్ రూమ్‌ల విధానం తొలగించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ప్రైవేటు మద్యం పాలసీ ప్రకటించినా, పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వలేదు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొనసాగించడంపై అనుమానాలు ఏర్పడుతున్నాయి. ఉద్దేశపూర్వకంగా బార్లకు మేలు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. మరోవైపు మద్యం షాపుల పక్కన రోడ్లపై విచ్చలవిడిగా మద్యం తాగే సంస్కృతి కొనసాగుతుందనే విమర్శలూ వస్తున్నాయి. గత ప్రభుత్వంలో రోడ్లపై మద్యం తాగి వాహనదారులతో గొడవలు పెట్టుకోవడం, కేసులు పెట్టడం అనేకం జరిగాయి.



గత విధానం ఇలా...

గతంలో ప్రైవేటు మద్యం షాపుల పాలసీలో పర్మిట్ రూమ్‌లు ఉండేవి. షాపు పక్కనే మద్యం తాగేందుకు చిన్న గదిని ఏర్పాటు చేసేవారు. అక్కడ కుర్చీలు, బల్లలు లేకుండా కేవలం నిల్చొని మద్యం తాగేందుకు అవకాశం కల్పించేవారు. షాపు లైసెన్సీకి వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు, స్నాక్స్ లాంటివి విక్రయించుకోవడం ద్వారా అదనపు ఆదాయం సమకూరేది. పర్మిట్ రూమ్‌ల వల్ల మద్యం విక్రయాలు పెరిగేవి. వ్యాపారికి, ప్రభుత్వానికి మరింత ఆదాయం వచ్చేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం సంపూర్ణ మద్యపాన నిషేధం అంటూ హడావిడి చేసి అందులో భాగంగా అంటూ పర్మిట్ రూమ్‌ల విధానాన్ని రద్దు చేసింది. రోడ్లపై తాగినా ఫరవాలేదన్నట్టుగా పర్మిట్ రూమ్‌లను తొలగించింది.

మరో 17 కోట్లు నష్టం!

పర్మిట్ రూమ్‌లు పెట్టుకోవాలంటే లైసెన్సీ అదనంగా ఏడాదికి రూ.5 లక్షలు చెల్లించాలి. సాధారణంగా పర్మిట్ రూమ్‌లు అక్కర్లేదనే లైసెన్సీలు ఉండరు. ఇటీవల నిర్వహించిన లాటరీలో 3,396 ప్రైవేటు షాపులకు రూ.5లక్షల చొప్పున రూ.169.8 కోట్లు ఒక్క విడతలో వచ్చేవి. త్వరలో గీత వృత్తి కులాలకు కోసం రిజర్వ్ చేసిన 340 షాపులకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. వాటిద్వారా మరో రూ.17 కోట్లు వచ్చేవి. పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వని కారణంగా ఎక్సైజ్‌శాఖ ఈ ఆదాయాన్ని కోల్పోయింది. పర్మిట్ రూమ్‌లు వద్దనడం వెనుక రెండు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఒకటి.. బార్ల యాజమాన్యాల కోరిక మేరకు ఏర్పాటుకు అవకాశం ఇవ్వలేదని, మరొకటి.. మంత్రివర్గ ఉపసంఘం పర్మిట్ రూమ్‌లు వద్దని సిఫారసు చేసిందని ప్రచారం జరుగుతోంది. 2022లో కొత్త బార్ పాలసీ ప్రకటించినప్పుడు ప్రభుత్వ షాపుల పాలసీలో పర్మిట్‌రూమ్‌లు లేవని, అందుకే బార్‌లు తీసుకున్నామని, ఇప్పుడు ప్రైవేటు షాపుల్లో పర్మిట్ రూమ్‌లు పెడితే తమ వ్యాపారం దెబ్బతింటుందని యాజమాన్యాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. పర్మిట్ రూమ్‌లు పెడితే కోర్టుకు వెళ్తామని అన్నట్లు తెలిసింది. ఏదేమైనా ప్రభుత్వానికి తక్షణం రూ.170 కోట్లు, త్వరలో వచ్చే మరో రూ.17 కోట్ల ఆదాయం పోయింది.

ఇప్పుడు జగన్ ఎమ్మెల్యేనే కదా..

కోర్టుకు రావడానికి ఇబ్బంది ఏమిటి?

- కోడికత్తి కేసులో శ్రీనివాస్ తరపు న్యాయవాది ప్రశ్న



విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జగన్ ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేనే కదా.. కోర్టులో విచారణకు హాజరుకావడానికి ఆయనకు ఇబ్బంది ఏమిటి..? అని కోడికత్తి కేసులో జనుపల్లి శ్రీనివాస్ తరపు న్యాయవాది సలీం ప్రశ్నించారు. విశాఖపట్నం న్యాయస్థానంలో జరుగుతున్న ఈ కేసు విచారణకు జగన్ మరోసారి గైర్హాజరయ్యారు. దాంతో ఈ కేసును నవంబరు 15వ తేదీకి వాయిదా వేశారు. ఈ సందర్భంగా కోర్టు బయట సలీం, దళిత సంఘం నాయకులు బూసి వెంకటరావు విలేకరులతో మాట్లాడారు. మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నారా లోకేశ్ పరువు నష్టం కేసులో ప్రతి వాయిదాకూ విజయవాడ నుంచి విశాఖపట్నం కోర్టుకు వస్తున్నారని చెప్పారు. ఆయనకు లేని ఇబ్బంది జగన్‌కు ఏమిటని సలీం ప్రశ్నించారు.

కీలక కేసుల నిగ్గు తేలుస్తాం

- నిందితుల్లో ఐపీఎస్‌లు ఉన్నందునే సీఐడీకి బదలాయింపు
- ఐదారు నెలల్లో కానిస్టేబుళ్ల నియామకం
- ప్రజలతో మమేకం అవుతాం: డీజీపీ



అమరావతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 'ఆదాయపు పన్ను శాఖ చీఫ్ కమిషనర్‌ను ఇంటరాగేషన్ చేసేందుకు సీబీఐలో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఏ మాత్రం వెనుకాడడు. అదే సీనియర్ ఐపీఎస్‌ను ప్రశ్నించాలంటే భయపడతాడు. ఏపీలో కొన్ని కేసుల్లో సీనియర్ ఐపీఎస్‌లు నిందితులుగా ఉన్నారు. ఇటువంటి కేసుల్లో దర్యాప్తు అధికారి స్థాయి పెంచడమో.. కేసును సీఐడీకి బదిలీ చేయడమో జరిగింది' అని డీజీపీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. పోలీసులు పూర్తి మనోధైర్యంతో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం(అక్టోబరు 21) సందర్భంగా పది రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం డీజీపీ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సంచలన కేసుల దర్యాప్తులో ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు లేకుండా ఉండేందుకు దర్యాప్తు అధికారి స్థాయి పెంపు లేదా సీఐడీకి కేసు బదిలీ చేశామన్నారు. నిందితులు పైస్థాయి వ్యక్తులైనప్పుడు వారిని ప్రశ్నించేందుకు కిందిస్థాయి వారు సరిపోరనే కీలక కేసు(జెత్వానీ, రఘురామ, టీడీపీ ఆఫీసు, చంద్రబాబు ఇంటిపై దాడి)ల్ని సీఐడీకి అప్పగించినట్లు వివరించారు. ప్రతి కేసు నిష్పాక్షికంగా దర్యాప్తు చేసి తప్పు చేసినవారిని జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. గంజాయి కట్టడికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు కేబినెట్‌లో ఆమోదం లభించిందన్నారు. ఏడీజీ లేదా ఐజీ ర్యాంకు స్థాయి అధికారి నేతృత్వంలో 459మంది వివిధ స్థాయి పోలీసు ఫోర్స్‌తో గంజాయిని కూకటివేళ్లతో పెకిలించేందుకు కృత నిశ్చయంతో ఉన్నట్లు చెప్పారు. పోలీసు శాఖలో 6,100మంది కానిస్టేబుళ్ల నియామకానికి న్యాయపరమైన ఆటంకాలు ఏర్పడ్డాయని తెలిపారు. వాటిని అధిగమించి ఐదారు నెలల్లో నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం 21న విజయవాడలో జరిగే సంస్మరణ సభకు సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. పోలీసు సంక్షేమ నిధికి గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పైసా కూడా ఇవ్వలేదని డీజీపీ తెలిపారు. అయితే 2014-19 మధ్య అప్పటి ప్రభుత్వం రూ.35కోట్లు ఇచ్చిందని, ఈసారి సంస్మరణ సభలో సీఎం చంద్రబాబు ఎంతోకొంత ప్రకటించే అవకాశం ఉందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

గతం మరిచిన జగన్ మీడియా

'మా పత్రికలో ఏదైనా రాస్తాం. మీరు కేసులు ఎలా పెడతారు. రిజాయిండర్ ఇవ్వాలి. ఏ రాష్ట్రంలోనూ కేసులు పెట్టడం లేదు. ఏపీలోనే దీనిని అమలుచేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు ఇది విరుద్ధంగా ఉంది' అంటూ విలేకరుల సమావేశంలో డీజీపీని జగన్ మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. దీనిపై డీజీపీ ఘాటుగా సమాధానమిచ్చారు. 'ఈ కేసుల పరంపర ఎప్పుడు మొదలైందో నాకు తెలుసు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేదు.. విజయవాడ పోలీసులే ఇటువంటి కేసులు పెట్టారని ఎలా అంటారు. ఇదే రాష్ట్రంలో గతంలో ఇలాంటివి చాలా నమోదయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పులకు భిన్నంగా ఏపీ పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ పనిచేయరు' అని స్పష్టం చేశారు. కాగా, రాష్ట్రంలో 2019కు ముందు పత్రికల్లో ఏవైనా తప్పుడు వార్తలు ప్రచురితమైతే సంబంధిత వ్యక్తి, లేదా ప్రభుత్వ శాఖ వివరణ లేదా ఖండన ఇచ్చేది. మరీ తీవ్రమైన తప్పులుంటే పరువు నష్టం దావా వేసేవారు. అయితే జగన్ తనకు, తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరైనా వార్తలు ప్రచురిస్తే క్రిమినల్ కేసులు పెట్టించేవారు. ఇదే క్రమంలో 'ఆంధ్రజ్యోతి' పైనా పలు తప్పుడు కేసులను నమోదు చేసింది. పాతవి ప్రజలు మరిచి పోయారనుకుని జగన్ మీడియా ప్రతినిధి ప్రశ్న అడగ్గా డీజీపీ ఘాటుగా సమాధానమిచ్చారు. విజయవాడలో వరదల సందర్భంగా ఖర్చు చేసిన మొత్తం కన్నా ఎక్కువ నిధులు అవినీతి చేసినట్లు ప్రభుత్వ పెద్దలపై రేత పత్రిక ఇటీవల తప్పుడు వార్త ప్రచురించి చిక్కుల్లో పడింది. దీనిపై పటమట పోలీసు స్టేషన్లో కేసు నమోదవడంతో దిక్కుతోచని స్థితిలో ఉంది.

పాము, కుక్క కాటు

మరణాలకు చెక్

- టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వ్యాక్సిన్ సమాచారం

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కుక్క కాటు కారణంగా రేబిస్ వ్యాధి సోకి రాష్ట్రంలో ప్రతి ఏటా వేలాది మంది చనిపోతున్నారు. పాము కాటు వల్ల కూడా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కుక్క కాటు, పాము కాటుకు గురైన వారికి సత్వర చికిత్స అందించే చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర సర్కారు కొత్తగా హెల్ప్‌లైన్ నంబరును ఏర్పాటు చేసింది. జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన 15400 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే కుక్క కాటు, పాము కాటుకు వ్యాక్సిన్లు ఎక్కడ లభ్యమవుతాయో సమాచారం లభిస్తుంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలుగులో ముద్రించిన పోస్టర్లు, కరపత్రాల్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ఆవిష్కరించారు.

నేడు డయాఫ్రమ్‌వాల్ షెడ్యూల్

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనుల షెడ్యూల్‌ను నిర్మాణ సంస్థలు మేఘా, బావర్...మంత్రి నిమ్మల రామానాయుడు, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీసాయిప్రసాద్‌కు అందించనున్నాయి. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులపై మూడు రోజుల కిందట మంత్రి నిమ్మల సమీక్ష నిర్వహించారు. దీనిపై షెడ్యూల్‌ను ఇవ్వాలని నిర్మాణ సంస్థలను కోరారు. ఈ మేరకు నిర్మాణ సంస్థలు శనివారం షెడ్యూల్‌ను అందించనున్నాయి. దానిపై సోమవారం మంత్రి నిమ్మల సమీక్ష నిర్వహిస్తారు. ఈ సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను సీఎం చంద్రబాబుకు నివేదిస్తారు.

మృతదేహం అపహరణ యత్నం

- ఏలూరు ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మార్చురీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ప్రైవేటు మెడికల్ కాలేజీలకు అమ్ముకునేందుకు మృతదేహాన్ని అపహరించే ప్రయత్నం చేశాడు. మరో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి గుర్తించి అధికారులకు చెప్పడంతో ఆ ప్రయత్నాన్ని విరమించాడు. ఈ విషయాన్ని కొద్ది రోజుల పాటు గుట్టుచప్పుడు కాకుండా తొక్కిపెట్టనప్పటికీ.. మార్చురీ విభాగం అధికారి ఉన్నతాధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా వెలుగు చూసింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి (మార్చురీ అసిస్టెంట్) అర్ధరాత్రి వేళ ఒక మృతదేహాన్ని బంధువులు గుర్తించడానికి వచ్చారంటూ నమ్మబలికి అంబులెన్స్‌లో తీసుకువెళ్లే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో విధుల్లో ఉన్న ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగి (మార్చురీ అసిస్టెంట్) వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం బయటకు పొక్కితే ప్రమాదమని భావించిన అధికారులు మృతదేహాన్ని అపహరించే ప్రయత్నం చేసిన ఉద్యోగిని అక్కడి నుంచి వైద్య కళాశాల మార్చురీ విభాగానికి పంపించారు. దీనిపై ఆస్పత్రి మార్చురీ విభాగానికి చెందిన ప్రధాన అధికారి శుక్రవారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఏలూరు ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు సిఫారసు చేశారు. ఈ సంఘటన నేపథ్యంలో.. గతంలో మార్చురీ నుంచి ఎన్ని అనాధ మృతదేహాలు అపహరణకు గురయ్యాయో అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి.

విలీనం జీవో రద్దు!

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో టీడీపీ హామీ ఇచ్చింది. దాని అమలులో భాగంగా మార్పులు చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రక్రియ ప్రారంభించింది. మూడు నెలల్లో ఆ జీవో రద్దుచేసి, అనంతరం కొత్త జీవోలు జారీ చేయనుంది. ఈలోగా ఉపాధ్యాయ సంఘాలతో పలు దఫాలుగా చర్చలు జరిపి, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. జీవో 117పై శుక్రవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ఉపాధ్యాయ సంఘాలతో ఆ శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ద్వారా భవిష్యత్తులో చేపట్టనున్న సంస్కరణలపై ఓ స్పష్టత వచ్చింది. ప్రధానంగా జీవో 117 కారణంగా దాదాపు 4,500 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. వీటిని వెనక్కి తేవాలని ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. అయితే వాటిని యథాతథంగా వెనక్కి తీసుకురావాలా? లేక ప్రత్యామ్నాయ రూపంలో తేవాలా? అనేదానిపై చర్చించారు. ఇప్పటివరకూ వెళ్లిన వారిని అక్కడే ఉంచి వచ్చే ఏడాది నుంచి విలీనానికి గురైన పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు ప్రారంభిస్తే ఆ బడులు పూర్వవిధానంలోకి వస్తాయని కొందరు సూచించారు. అలాగే పెద్ద పంచాయతీల్లో మోడల్ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించి వాటిలో 1 నుంచి 5 తరగతులు నిర్వహించాలనే ఆలోచనపైనా చర్చ జరిగింది. ప్రాథమిక పాఠశాలల్లో రెండు మీడియంలు కొనసాగించాలని సంఘాలు కోరగా డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. అయితే దానిని ఎలా అమలుచేయాలనే దానిపై తుది నిర్ణయం తీసుకోలేదు. అంగన్‌వాడీలను ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేయాలనే అంశం కూడా చర్చకొచ్చింది. ఇది మహిళా శిశుసంక్షేమ శాఖతో ముడిపడి ఉన్నందున ప్రభుత్వానికి ప్రతిపాదన చేయాలని నిర్ణయించారు. ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని, గరిష్ఠంగా వారానికి 32 తరగతులు ఉండేలా చూడాలని సంఘాల ప్రతినిధులు కోరారు. పాఠశాల యాప్‌లు వీలైనంత మేర తగ్గించి భారం లేకుండా చేస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారు. నవంబరు 11న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14న నిర్వహించే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో సీఎం, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఇకపై ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో చర్చిస్తామని డైరెక్టర్ పేర్కొన్నారు.

పాత బడుల్లో తరగతులు ప్రవేశపెట్టాలి: ఆప్టా

విలీనానికి గురైన పాఠశాలల్లో తిరిగి 3 నుంచి 5 తరగతులను ప్రవేశపెట్టాలని ఆప్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు అంగన్‌వాడీని అనుసంధానం చేయాలన్నారు. 20 మంది కంటే తక్కువ విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలకు ఒక ఎస్జీటీని, ఒక ఎంటీఎస్ టీచర్‌ను కేటాయించాలని కోరారు.

డ్రోన్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు

- విజయవంతం చేయాలని అధికారులకు సీఎస్ నీరబ్‌కుమార్ ఆదేశాలు
- 22, 23 తేదీల్లో మంగళగిరిలో సదస్సు



అమరావతి డ్రోన్ సమ్మిట్ ఏర్పాట్లపై వివిధ శాఖల కార్యదర్శులు, జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్

అమరావతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22, 23 తేదీల్లో మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'అమరావతి డ్రోన్ సమ్మిట్-2024' విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన వివిధ శాఖల కార్యదర్శులు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలు, విజయవాడ పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. సీఎస్ మాట్లాడుతూ సదస్సు జరిగే ప్రాంతాన్ని వివిధ శాఖల కార్యదర్శులు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఐఅండ్‌ఐ కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న డ్రోన్ల సమ్మిట్‌కు వివిధ శాఖల నుంచి 10 మంది ప్రత్యేక నోడల్ అధికారుల నియామకానికి ఆదేశాలు ఇచ్చామన్నారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేష్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమ్మిట్ ఏర్పాట్లను వివరించారు. సమావేశంలో సీఎస్ చెప్పిన పలు కీలక అంశాలివీ...

- డ్రోన్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు, పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, పలువురు రాష్ట్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొంటారు.
- 22న సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు విజయవాడ కృష్ణానది ఒడ్డున బెర్మ్ పార్కు వద్ద సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, 5 వేల డ్రోన్లతో దేశంలోనే అతిపెద్ద డ్రోన్ షోతో పాటు లేజర్ షో తదితర కార్యక్రమాలు ఉంటాయి.
- సదస్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 400 మంది వక్తలు, ప్రతినిధులు పాల్గొంటారు. వెయ్యి మంది వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, నిపుణులు వస్తారు.
- డ్రోన్ల తయారీ, వ్యవసాయ లాజిస్టిక్స్, పర్యావరణ పర్యవేక్షణ, విపత్తుల నిర్వహణ, ఆరోగ్యం తదితర రంగాల్లో డ్రోన్ల వినియోగంపై 9 చర్చా సెషన్లు ఉంటాయి.
- డ్రోన్ల సాంకేతికత వినియోగంపై కీలకమైన నాలుగు ప్రజెంటేషన్లు, ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ ఉంటాయి.
- వేదిక వద్ద దేశవ్యాప్తంగా డ్రోన్ తయారీదారుల ఉత్పత్తులకు సంబంధించిన 40 ప్రదర్శనశాలల ఏర్పాటు.
- 2030 నాటికి భారత్‌ను గ్లోబల్ డ్రోన్ హబ్‌గా రూపొందించడం, డ్రోన్ నిబంధనలపై బృంద చర్చలు.
- ప్రజాభద్రత, విపత్తుల నిర్వహణ, డ్రోన్ సాంకేతికత అప్లికేషన్ల వినియోగం, పర్యాటక, వినోద రంగాల్లో డ్రోన్ల ఆవిష్కరణలు తదితర అంశాలపైనా చర్చలు ఉంటాయి.
- వ్యవసాయం, ఆరోగ్యం, లాజిస్టిక్ రంగాల్లో డ్రోన్ల వినియోగం, డిజిటల్ భూరికార్డుల రూపకల్పనలో డ్రోన్ల వినియోగంపై బృంద చర్చలు.

ఇచ్చిన మాట ప్రకారం..

ఎన్నికల మేనిఫెస్టో అమలు చేస్తామని ప్రజలకు ధైర్యంగా చెప్పాలని... ఇప్పటికే అనేక హామీలు నెరవేర్చామని చెప్పారు. "ఇచ్చిన మాట ప్రకారం చెత్తపన్ను రద్దు చేశాం. మత్స్యకారుల పొట్టగొట్టే 217 జీవో రద్దు చేశాం. ఉద్యోగులకు, పెన్షనర్లకు 1న జీతాలు అందిస్తున్నాం. స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటుచేశాం. గౌడలకు మద్యం షాపుల్లో రిజర్వేషన్లు కల్పించాం. అర్చకుల జీతాలు రూ.10వేలకు, నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేలకు పెంచాం. ధూపదీప నైవేద్యాలకు రూ.10వేలకు పెంచాం. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలిస్తామని చెప్పాం. ఆ ప్రక్రియ డిసెంబరు నాటికి పూర్తవుతుంది. దాదాపు 70శాతం గ్రీవెన్స్ భూసమస్యలపైనే వస్తున్నాయి. అందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. చట్టం రాకముందే ఇలా జరిగిందంటే.. వస్తే ఇంకేలా ఉండేదో ఆలోచించాలి. పట్టాదారు పుస్తకంపైనా వారి బొమ్మలు వేసుకున్నారు. హద్దు మీరి ప్రవర్తించారు. పెన్షన్లు రూ.1000 పెంచి ఇస్తున్నాం. దివ్యాంగులకు రూ.6 వేలు, కిడ్నీ బాధితులకు రూ.10 వేలు, పూర్తిగా మంచానికి పరిమితమైన వారికి రూ.15వేలు అందిస్తున్నాం. 175 అన్న క్యాంటీన్లను ప్రారంభించాం. వాటిని 203కు పెంచుతాం. ఆదాయం పెంచి సంక్షేమాన్ని అమలు చేస్తాం" అని చంద్రబాబు తెలిపారు.





టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జిలు, ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధినేత చంద్రబాబు, పాల్గొన్న బొండా ఉమా, నందమూరి బాలకృష్ణ, కృష్ణప్రసాద్, అశోక్‌బాబు, వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, సవిత, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి, మాగుంట తదితరులు

పార్టీకి చెడ్డపేరు తెస్తే సహించేది లేదు

ఎమ్మెల్యేల ప్రవర్తన వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తే సహించేది లేదని చంద్రబాబు హెచ్చరించారు. 'తెలుగుదేశం పార్టీకి క్రమ శిక్షణ కలిగిన పార్టీ అని పేరు ఉంది. దేశంలో కూడా మనకు ప్రత్యేకత గుర్తింపు ఉంది. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉంటే ప్రజలకు మరింత ఎక్కువ మేలు జరగాలి. మీ పనితీరు ఆ మాదిరిగా ఉండాలి. ఒక్కరి వల్ల చెడ్డపేరు వచ్చినా నేను సహించేది లేదు" అని స్పష్టం చేశారు. ప్రజలతో గౌరవంగా ప్రవర్తించాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య మంచి సంబంధాలు ఉండాలని తెలిపారు. "కింది స్థాయి నాయకులను కలుపుకొని పోవాలి. ఎవరేం చేస్తున్నారో నా వద్ద పూర్తి సమాచారం ఉంది. ముందుగా మిమ్మల్ని అప్రమత్తం చేస్తున్నాను. మనం తీసుకొనే నిర్ణయాల పట్ల ప్రజలు సానుకూలంగా ఉండేలా చూసుకోవాలి. ఇది జరగకపోవడం వల్ల గతంలో నష్టపోయాం" అని చంద్రబాబు తెలిపారు. 2029లో కూడా మీరంతా గెలిచి రావాలని తాను తాపత్రయ పడుతున్నానని... అందరి పనితీరు కూడా బాగుంటేనే అది సాధ్యపడుతుందని చెప్పారు. ఇకపై ఫోన్ సర్వేతోపాటు ఇతర మార్గాల ద్వారా ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించబోతున్నామని... వెనుకబడిన ఎమ్మెల్యేలను ఉపేక్షించబోమని చెప్పారు. గతంలో వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను సమీక్షిస్తున్నామని ఆయన తెలిపారు. తప్పుడు కేసులను ఎత్తివేయడానికి చర్యలు తీసుకొంటామన్నారు. 125 రోజుల పాలనలో మనం చేసిన మంచి పనులను సమీక్షించుకుని ముందుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. వైసీపీ చేసిన అరాచకం భరించలేక ప్రజలు మనల్ని గెలిపించారని.. మళ్లీ మనం గెలవాలంటే ఎన్డీయే చేసిన మంచి పనులను వారిలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎన్డీయే అధికారంలో ఉందని.. మొన్నటి ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పోటీ చేశాయని, మన పార్టీని సమన్వయం చేసుకోవడంతో పాటు మద్దతు ఇచ్చిన ప్రజల ఆశలు నెరవేర్చాలని సూచించారు.

గీత దాటొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

జోక్యం చేసుకోవద్దు" అని సూటిగా చెప్పారు. వారసత్వంగా వస్తున్న మద్యం వ్యాపారం చేసుకుంటే ఏమీ కాదని.. కానీ ఇతరులు జోక్యం చేసుకుంటే పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని స్పష్టం చేశారు.

కమిటీ నుంచి పిలుపు వస్తే...

దారి తప్పుతున్న పార్టీ ఎమ్మెల్యేలను ఎప్పటికప్పుడు గుర్తించి, వారిని హెచ్చరించేందుకు పార్టీపరంగా పంచ సభ్య కమిటీ వేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. "వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ప్రజలు నిరసించారు. ఘోర పరాజయం పాలైనవాళ్లు మనకు ఆదర్శం కాదు. వాళ్ళ మాదిరిగా ఉండాలని మనం అనుకోవద్దు. పంచ సభ్య కమిటీ నుంచి మీకు పిలుపు వచ్చిందంటే మీరు గీత దాటినట్లు లెక్క. మీరు ఏం తప్పులు చేశారో... చేస్తున్నారో ఆ కమిటీ మీకు చెబుతుంది. దిద్దుకోవాలని సూచిస్తుంది. అప్పటికీ మార్పు రాకపోతే తర్వాత నేను పిలవాల్సి వస్తుంది. అప్పటికీ మార్పు రాకపోతే ఆ తర్వాత చర్యలు తీవ్రంగా ఉంటాయి. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటానికే నేను ఇక్కడకు వచ్చాను" అని చంద్రబాబు తేల్చి చెప్పారు. "నా నుంచి మీరు చాలా ఆశిస్తున్నారు. మీ పనితీరు బాగుండి మీకు మంచి పేరు వస్తే మీ గురించి నేను ఆలోచిస్తాను. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన వారికి... సీనియర్లకు అందరికీ ఇదే వర్తిస్తుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. చాలా మంది పనితీరులో ఇంకా మార్పు రావాల్సి ఉందని తెలిపారు.

అరాచకం నుంచి అభివృద్ధి దిశగా...

రాష్ట్రంలో ఐదేళ్లు అరాచకం జరిగిందని, అందరూ బాధలు పడ్డారని చంద్రబాబు పేర్కొన్నారు. "నన్ను కూడా జైలులో పెట్టారు. ఆ సమయంలో పవన్ కల్యాణ్ నన్ను కలిసిన అనంతరం కలిసి పోటీ చేస్తామని ప్రకటించారు. బీజేపీ కూడా కలిసి పోటీ చేయడానికి ముందుకొచ్చింది. ఎన్నికల్లో పొలిటికల్- సోషల్ రీఇంజనీరింగ్ చేశాం. టీడీపీకి అండగా ఉన్న బీసీలకు ప్రాధాన్యమిచ్చాం. ఒక్కసారి కూడా అసెంబ్లీకి రాని వర్గాలకు ప్రాధాన్యమిచ్చి సీట్లు ఇచ్చాం. పార్టీని నమ్ముకున్న వారికి కూడా పొత్తు వల్ల సీట్లు ఇవ్వలేకపోయాం. టీడీపీకి కొన్ని కుటుంబాలు అంకితమయ్యాయి. ప్రాణాలకు పణంగా పెట్టి పార్టీ కోసం పనిచేశారు. గత ఐదేళ్లలో కార్యకర్తలు అన్ని విధాలా నష్టపోయారు. రాజకీయాల్లో ఎప్పుడూ చూడని విధంగా గత పాలకులు కక్ష సాధింపులకు పాల్పడ్డారు. పార్టీ కార్యకర్తల ఆస్తులు, ఆదాయ వనరులు నాశనం చేశారు. మన ప్రభుత్వంలో పనులు చేసిన వారికి బిల్లులు ఇవ్వకుండా విజిలెన్స్ విచారణ పేరిట నిలిపేశారు. ఇలాంటి ఇబ్బందులు ఎప్పుడూ చూడలేదు. అయితే వైసీపీ ప్రభుత్వ దౌర్జన్యాలు, బెదిరింపులకు తట్టుకుని నిలదొక్కుకున్నాం. ఎదిరించాం.. కార్యకర్తలకు అండగా ఉన్నాం. మనం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.259 కోట్లు నీరు-చెట్టు, రూ.500 కోట్లు ఉపాధిలో పెండింగ్ బిల్లులు చెల్లించాం. కార్యకర్తలకు న్యాయం చేస్తేనే వారు మనకు అండగా ఉంటారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా దానికి పరిష్కార మార్గం చూపాల్సిన బాధ్యత మనపై ఉంది" అని తెలిపారు. గత పాలకులు కేంద్రం ఇచ్చిన నిధులు దారి మళ్లించారని, ఇప్పుడు నిధులు అడుగుతుంటే గతంలో ఇచ్చిన నిధులకు యూసీలు అడుగుతున్నారని తెలిపారు. పంచాయతీలకు ఇవ్వాల్సిన రూ.990 కోట్లు మళ్లించారని.. దీంతో రూ. 1,200 కోట్లు కేంద్రం నుంచి రాకుండా పోయాయని చెప్పారు. మనం వచ్చాక 990 కోట్లు చెల్లించడంతో ఇప్పుడు రూ.1,200 కోట్లు పంచాయతీలకు రాబోతున్నాయన్నారు. ఇంకా ఏమన్నారంటే..

రాజధాని ఒక్కటే..

"రాజధాని ఒక్కటే ఉంటుంది. అది అమరావతే. విశాఖ ఆర్థిక రాజధానిగా ఉంటుంది. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం. ఓర్వకల్లు పారిశ్రామిక పార్కు అభివృద్ధి చేస్తాం" అని చంద్రబాబు ప్రకటించారు. నదుల అనుసంధానం మళ్లీ ప్రారంభిస్తామన్నారు. "గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానిస్తాం. ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తాం. రాష్ట్రంలో 95 శాతం చెరువులు, ప్రాజెక్టులు నీళ్లతో కళకళలాడుతున్నాయి. ఎప్పుడూ నిండని రిజర్వాయర్లు కూడా నిండాయి. ప్రతి ఎకరాకు నీళ్లిచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

నడిచాం.. నడిపించాం..

విజయవాడలో వరదల సమయంలో రాత్రింబవళ్లూ పనిచేశామని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో ఈ వరద వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన పిలుపుతో స్వచ్ఛందంగా రూ.450 కోట్లపైన విరాళాలను ప్రజలు అందించారన్నారు. "ఎప్పుడూ వరదలు వచ్చినా బాధితులకు వెయ్యి లేదా రూ.2 వేలు ఇచ్చేవారు. కానీ మొదటి సారి దేశ చరిత్రలో ఒక్కో ఇంటికి రూ.25 వేలు ఇచ్చాం. ఆటోకు రూ.10 వేలు, బైక్‌లకు రూ.3 వేలు ఇచ్చాం. 4.15 లక్షల మందికి రూ.618 కోట్లు పరిహారం అందించాం" అని తెలిపారు. రైతులకు గత పాలకులు రూ.1,674 కోట్లు బకాయిపెట్టారని... కూటమి ప్రభుత్వం రాగానే అవి విడుదల చేశామని తెలిపారు. "రైతుల నుంచి ధాన్యం కొంటే 48 గంటల్లోనే డబ్బులు అందించే విధానం మళ్లీ తీసుకొచ్చాం. రూ.4,500 కోట్లతో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పనులు ప్రారంభించాం. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీనిని ప్రారంభించారు. ఈ పనులు జనవరికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వైసీపీ వాళ్లు గోతులు పెట్టారు. వాటిని మనం పూడ్చే కార్యక్రమం చేపట్టాం. రోడ్లపై గుంతలు పూడ్చడానికి రూ.700 కోట్లు ఖర్చవుతుంది. సంక్రాంతికి ముందే ఇవి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం" అని తెలిపారు.

మోదీని చూసి నేర్చుకోవాలి

"ప్రధాని మోదీని చూసి నేర్చుకోవాల్సింది ఆయనకున్న పట్టుదల, కృషి. మూడుసార్లు ప్రధాని అయినా మళ్లీ రాబోయే ఎన్నికల గురించి ఆలోచిస్తున్నారు" అని చంద్రబాబు తెలిపారు. దేశంలో ఎవరికీ రాని విజయం మోదీ సాధించారంటే దాని వెనక కఠోర శ్రమ, క్రమశిక్షణ ఉన్నాయన్నారు.

ఉపాధి కల్పించే వారికే ప్రోత్సాహకాలు..

'జాబ్‌ఫస్ట్' విధానంతో దేశంలోనే మొదటి సారిగా ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చే వారికి ప్రోత్సాహకాలు అదనంగా ఇస్తామని చంద్రబాబు తెలిపారు. అదనంగా ఉద్యోగాలు కల్పించే వారికి 10 శాతం ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించామన్నారు. "ఆరు పారిశ్రామిక విధానాలు తీసుకొచ్చాం. అలాగే సూపర్ సిక్సులు తెచ్చాం. ఇవి అమలైతే ఏపీ నంబర్ వన్ అవుతుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కింద అమరావతిలో హెడ్‌క్వార్టర్స్, 5 జోన్లలో 5 ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తాం. ప్రతి ఇంట్లో ఒక వ్యవస్థాపకుడు ఉండాలి. రతన్‌టాటా స్ఫూర్తితోనే ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయబోతున్నాం. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులు పెడతాం. ఇందులో రైతులను కూడా భాగస్వాములను చేస్తాం" అని తెలిపారు.

పార్టీ క్యాడర్ కీలకం...

"మనమందరం ఇక్కడ కూర్చోడానికి కారణం... ప్రజల ఆశీర్వాదం, పార్టీ క్యాడర్ కష్టం. క్యాడర్ సంతృప్తిగా లేరంటే మీరు వాళ్లతో సరిగ్గా లేరని అర్థం. పార్టీ అధినాయకత్వం ఒక నిర్ణయం తీసుకుంటే... క్యాడర్ దానిని ఆమోదించి కట్టుబడి పనిచేస్తుంది. వాళ్ల పట్ల మనం గౌరవంగా ఉండాలి. వారికి కష్టం వస్తే నిలబడాలి. వాళ్ళ సమస్యలు పరిష్కరించాలి. నేను నా వంతుగా కొన్ని చేస్తున్నాను. మీరు కూడా కింది స్థాయిలో వారి కోసం నిలబడండి' అని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బొండా ఉమా తదితరులు

26 నుంచి సభ్యత్వ నమోదు

ఈ నెల ఇరవై ఆరో తేదీ నుంచి పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. దీనిని రెండు నెలల్లో ముగించాలని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ప్రతి నలుగురు ఓటర్లలో ఒకరు టీడీపీ సభ్యుడిగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకొన్నట్లు ఆయన చెప్పారు. 'పార్టీ సభ్యులకు గతంలో రూ.2 లక్షల ప్రమాద బీమా ఉండేది. దానిని రూ. ఐదు లక్షలకు పెంచుతున్నాం. పార్టీ సభ్యులు సహజ మరణం చెందినా వారికి అంతిమ సంస్కారాల కింద రూ. పదివేలు ఇస్తాం. గతంలో ప్రమాద బీమా పొందలేకపోయిన 73 మందికి పార్టీపరంగా తలకు రూ.రెండు లక్షలు ఇస్తాం. పార్టీ సభ్యులకు ఇప్పటివరకూ ప్రమాద బీమా కింద రూ. 102 కోట్లు, సహజ మరణం... ఇతర సమస్యల కింద రూ.18 కోట్లు అందాయి. విద్యార్థుల చదువు కోసం రూ. 2.35 కోట్లు ఖర్చు చేశాం. క్యాడర్‌కు ఆర్థిక భరోసా కల్పించేందుకు వారికి నైపుణ్య శిక్షణతో ఉద్యోగ అవకాశాలు, ఇతరత్రా ఆదాయ మార్గాలు చూపించే ప్రయత్నం చేస్తున్నాం. ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల్లో ఈ పని చూడాలి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి త్వరలో నిర్ణయం తీసుకొంటాం" అని ఆయన చెప్పారు.



పల్లెవెలుగు బస్సులో విజయవాడ నుంచి తెనాలి వెళుతూ.. ప్రయాణికులతో కలిసి టికెట్‌ను చూపుతున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

మహిళలకు ఉచిత బస్సు ఎప్పుడు?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వైఎస్ షర్మిల
- విజయవాడ-తెనాలి ఆర్టీసీ బస్సులో ప్రయాణం

విజయవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎందుకు అమలు చేయడం లేదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణలో మహిళల ఉచిత బస్సు ప్రయాణం అంశాన్ని మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే అమలు చేసిందన్నారు. విజయవాడ నుంచి తెనాలి వెళ్లే ఆర్టీసీ బస్సులో ఆమె శుక్రవారం ప్రయాణించారు. తనతోపాటు బస్సులో ఉన్న మహిళా ప్రయాణికులకు టికెట్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలంతా తమకు ఉచిత ప్రయాణం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో నాలుగు మహిళలకు సంబంధించినవేనని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం లాంటి మంచి పథకాన్ని తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రికి రాసిన పోస్టు కార్డును షర్మిల బస్సులో తోటి ప్రయాణికులతో కలిసి ప్రదర్శించారు. కాగా, తెనాలి వరకు టికెట్ తీసుకున్న షర్మిల వడ్డేశ్వరం వద్దే బస్సు దిగిపోయారు.

పాఠశాలల నిర్వహణకు రూ.వంద కోట్లు

- రెండు, మూడు రోజుల్లో ఖాతాలకు నిధులు
- మంత్రి లోకేశ్ చొరవతో ఉపశమనం

అమరావతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నిర్వహణ నిధుల్లేక ఇబ్బందులు పడుతున్న పాఠశాలలకు రూ.వంద కోట్లు విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. మంత్రి లోకేశ్ చొరవతో నిధుల విడుదలకు అధికారులు చర్యలు ప్రారంభించారు. రెండు మూడు రోజుల్లో ఈ నిధులు పాఠశాలల ఖాతాలకు చేరనున్నాయి. 2024-25 విద్యా సంవత్సరం పద్దు కింద ఈ మొత్తం విడుదల చేస్తారు. 855 పీఎంశ్రీ పాఠశాలలకు రూ.8.63 కోట్లు, కేజీబీవీల్లో డైట్ నిర్వహణకు రూ.35.61కోట్లు, మండల రిసోర్స్ కేంద్రాలకు రూ.8.82కోట్లు, మిగిలిన 40,728 బడులకు కాంపోజిట్ గ్రాంట్ల కింద రూ.51.9 కోట్లు విడుదల చేస్తారు. ఇవి మొత్తం నిధుల్లో 50 శాతం కాగా మిగిలిన నిధులను తర్వాత ఇవ్వనున్నారు. గత ప్రభుత్వంలో పాఠశాలలకు నిర్వహణ నిధులు విడుదల చేయలేదు. తాజా నిర్ణయంతో పాఠశాలలకు ఉపశమనం కలగనుంది.

ట్రాక్టర్‌కూ రైట్.. రైట్..

స్థానిక అవసరాలకు ఇసుక తీసుకెళ్లవచ్చు

ఇప్పటివరకు ఎద్దులబండికే అనుమతి.. ఇకపై ట్రాక్టర్ ద్వారా కూడా రవాణా

సీఎం చొరవతో ఇసుక పాలసీలో మార్పులు

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీలో మార్పులు చేసింది. ఇకపై గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, వ్యక్తిగత, స్థానిక అవసరాలకు ప్రజలు ట్రాక్టర్ల ద్వారా కూడా ఇసుకను తీసుకెళ్లవచ్చునంటూ గనులశాఖ ఉత్తర్వులు (జీవో.64) జారీచేసింది. ఇసుక పాలసీ (జీఓ-43,49) ప్రకారం నూతన విధానంలో కేవలం ఎద్దుల బండి ద్వారా మాత్రమే స్థానిక అవసరాలకు ఇసుక తీసుకెళ్లే అవకాశం కల్పించారు. కానీ, కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ.. ఎద్దుల బండితోపాటు ట్రాక్టర్ ద్వారా కూడా గ్రామీణ ప్రజలు ఇసుక తీసుకెళ్లవచ్చని 2016లోనే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే, కూటమి సర్కారు ప్రకటించిన ఇసుక పాలసీలో అధికారులు కేంద్ర పర్యావరణ మార్గదర్శకాలను పాక్షికంగా చేర్చారు. గ్రామ పంచాయతీ పరిధిలో వ్యక్తిగత, సామాజిక, స్థానిక అవసరాల కోసం కేవలం ఎద్దుల బండిద్వారా ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తీసుకెళ్లవచ్చని మాత్రమే పేర్కొన్నారు. ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లే అవకాశాన్ని పాలసీ కిందకు తీసుకురాలేదు. దీంతో ట్రాక్టర్‌కు అనుమతి లేదనే పేరిట గ్రామీణ ప్రాంతాల్లో ఇసుక తీసుకెళ్లే స్థానికులపై పోలీసులు కేసులు నమోదుచేసి జులుం ప్రదర్శిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. కృష్ణా, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో కొందరు రైతుల ట్రాక్టర్లను సీజ్‌చేసి భారీగా పెనాల్టీలు విధించారు. ఇటీవల రైతులపై కేసులు నమోదుచేసిన ఉదంతాలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లాయి. "ఎద్దుల బండి, ట్రాక్టర్ ద్వారా ఇసుక తీసుకెళ్లడం గ్రామీణులకు ఉన్న హక్కు. మీరెందుకు కేసులు పెడుతున్నారు? మీకు ఏమి హక్కుంది?" అని చంద్రబాబు ఇటీవల పోలీసు అధికారులను ప్రశ్నించారు. ఇసుకపాలసీలో ట్రాక్టర్ రవాణాను చేర్చలేదని ఆయనకు పోలీసులు తెలిపారు. దీంతో ఆ జీవోను పరిశీలించిన ఆయన.. గనుల శాఖ అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గతంలో ఉన్నపాలసీలు, కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలను అధ్యయనం చేయకుండానే కొత్త పాలసీని తీసుకొచ్చారా? అలా ఎలా ప్రతిపాదిస్తారు? అని ఓ కీలక అధికారిపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కేసులు పెడితే ఎస్పీలు, ఇతర అధికారులను సస్పెండ్ చేస్తానని కూడా సీఎం తీవ్రంగా హెచ్చరికలు చేశారు. ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లవచ్చన్న అంశాన్ని పాలసీలో ఎందుకు చేర్చలేదని గట్టిగా నిలదీసినట్లు తెలిసింది.

ఆ కేసులకు ఎవరిది బాధ్యత?

ట్రాక్టర్లపై ఇసుక తీసుకెళుతున్న అనేకమందిపై గత మూడున్నర నెలల కాలంలో అక్రమ కేసులు పెట్టారు. వారి ట్రాక్టర్లను సీజ్‌చేశారు. భారీగా పెనాల్టీలు వేశారు. బాధితుల్లో అత్యధికులు గ్రామీణ ప్రాంత రైతులు, సామాన్యులే ఉన్నారు. తాజాగా ఇచ్చిన జీవో 64 ప్రకారం, ఆ కేసులను ఎత్తివేయాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి. గనుల శాఖ ఆ కేసులకు బాధ్యత తీసుకోవాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఇసుకపై సీనరేజీ, జీఎస్టీ రద్దు!

(మొదటి పేజీ తరువాయి)

గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఈ సీనరేజీ అంశం లేవనెత్తారు. 'మనం ప్రజలకు ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పాం. కాని సీనరేజీ, జీఎస్టీ పన్నుల పేరుతో అడ్డగోలుగా ఇసుక ధరలు పెంచేస్తున్నారు. ఉచితం అన్నప్పుడు ఈ పన్నులు ఎందుకో ప్రజలకు అర్థం కావడం లేదు. వాటిని తొలగిస్తే మంచిది' అని సూచించారు. మరి కొందరు ఎమ్మెల్యేలు ఆయన్ను బలపరిచారు. దీనిపై చంద్రబాబు స్పందించారు. ఇక ఇసుకపై సీనరేజీ ఉండదని అక్కడికక్కడే తేల్చిచెప్పారు. 'సొంత అవసరాలకు తీసుకెళ్లే ఇసుకపై జీఎస్టీ సహా ఏ పన్నులూ ఉండవు. సొంత అవసరాల కోసం సొంతంగా తవ్వుకొని ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లలో ఉచితంగా తీసుకెళ్లవచ్చు. దూరంగా ఉన్నవారు ఇసుక డోర్ డెలివరీ కావాలనుకుంటే తవ్వకం ఖర్చు, రవాణా ఖర్చులు భరించాల్సి ఉంటుంది. తామే తీసుకెళ్తే ఏ ఖర్చులూ ఉండవు. సీనరేజీ, జీఎస్టీ తీసివేయడం వల్ల ప్రభుత్వానికి ఏడాదికి రూ.270 కోట్ల ఆదాయం పోతుంది. దానిని ప్రభుత్వం భరిస్తుంది. ఇసుక ఉచితంగా దొరకడం వల్ల నిర్మాణ కార్యకలాపాలు పెరిగితే మరో రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అందుకే ఈ పన్నులను తీసివేస్తున్నాం' అని ప్రకటించారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తిపై స్పందిస్తూ.. ఇళ్ల నిర్మాణంలో పునాదులు నింపుకోవడానికి వినియోగించే మట్టిని కూడా ఉచితంగా తవ్వుకుని తీసుకెళ్లవచ్చని.. దానిపై కూడా ఏ పన్నులూ ఉండవని తెలిపారు. కడియం ప్రాంతంలో నర్సరీలు భారీగా వినియోగించే మట్టిపై పన్నును పెంచే ఆలోచన కూడా విరమిస్తున్నామని, గతం మాదిరిగానే ఇది వెయ్యి రూపాయలుగా ఉంటుందని కూడా వెల్లడించారు. నదులకు సంబంధించిన ఇసుక రేవుల్లో ఇసుకను తవ్వి లోడ్ చేయడానికి కొన్ని ఏజెన్సీలను ఎంపిక చేశామని, ముఖ్యమంత్రి తాజాగా తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో వీటిని ఏం చేయాలన్నదానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఈ సమావేశం అనంతరం తెలిపారు. ఇసుక రవాణా చేసే వాహనాలపై ఓవర్ లోడ్ పేరుతో వేసే పెనాల్టీలు కూడా ఉండబోవని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు విలేకరులకు చెప్పారు.

తిరుమలలో దర్శనాలు పెంపు

తిరుమలలో ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసు లేఖలతో వారంలో నాలుగు రోజులపాటు బ్రేక్ దర్శనాలకు అనుమతి ఇస్తుండగా.. ఇకపై దానిని ఆరు రోజులకు పెంచడానికి ముఖ్యమంత్రి అంగీకరించారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకొన్నారు. సుపథం పేరుతో రూ.300 టికెట్‌పై అనుమతించే దర్శనాలను కూడా ఆరు లేఖలకు పెంచడానికి అంగీకరించారు. అయితే సుపథం దర్శనాలు ఎన్ని కావాలంటే అన్ని ఇవ్వాలని కొందరు ఎమ్మెల్యేలు కోరగా ఆయన సమ్మతించలేదు. ఆలయ పవిత్రతకు భంగం కలిగించవద్దని, సామాన్య భక్తులకు ఇబ్బంది రానివ్వకూడదని స్పష్టం చేశారు. లేఖలు ఇచ్చే సదుపాయం తమకూ వర్తింపజేయాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జులు కోరగా ఆయన అంగీకరించారు.

7 గంటలు ఏకధాటిగా సమావేశం

ఈ సమావేశాన్ని ముఖ్యమంత్రి ఏకధాటిగా ఏడు గంటలపాటు జరిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన మొదట గంటన్నర పాటు ప్రసంగించారు. తర్వాత 45 నిమిషాలపాటు భోజన విరామం ఇచ్చి మళ్లీ రెండున్నరకు సమావేశం ప్రారంభించారు. రాత్రి 8 గంటలవరకూ కొనసాగింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇన్‌చార్జులు ఎంత మంది మాట్లాడినా.. ఏ అంశాలు లేవనెత్తినా చంద్రబాబు ఓపిగ్గా వాటికి సమాధానాలిచ్చారు. కొన్ని అంశాలపై మంత్రులతో చెప్పించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆయన వారితో ఇంత సమయం గడపడం ఇదే ప్రథమం. 'వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ముఖ్యమంత్రి ఇంత సమయం ఎమ్మెల్యేలు, ఎంపీలతో గడపడం ఎన్నడూ జరగలేదు. అరగంటకు మించి ఏ సమావేశమూ జరిగేది కాదు' అని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆయన వైసీపీ హయాంలో ఆ పార్టీ రాజ్యసభ ఎంపీగా పనిచేశారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచారు. మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్న సమావేశాన్ని కూడా అరగంటలోనే నాటి ముఖ్యమంత్రి జగన్ ముగించారని, ఇన్ని అంశాలపై ఇంత చర్చ తామెన్నడూ చూడలేదని చెప్పారు. చంద్రబాబు స్పందిస్తూ.. 'నిన్న చండీగఢ్‌లో ఎన్డీయే సమావేశంలో ప్రధాని ఐదు గంటలపాటు కదలకుండా కూర్చుని అన్ని విషయాలూ విన్నార'ని చెప్పారు. సమావేశానికి టీడీపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, పాతిక మంది పార్టీ ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

వైసీపీ నేతల అరాచకాలపై ఫిర్యాదులు

- న్యాయం చేయాలంటూ అభ్యర్థనలు.. అర్జీలు స్వీకరించిన టీడీపీ నేతలు

అమరావతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల అరాచకాలపై బాధితులు తిరుగుబాటు చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలపై అనేకమంది టీడీపీ నేతలకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలు ఎంఏ షరీఫ్, వర్ల రామయ్య, సూర సుధాకర్‌రెడ్డిలకు బాధిత ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. అర్జీలను స్వీకరించిన నేతలు సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు. ముస్లిం పిల్లల కోసం గత టీడీపీ ప్రభుత్వంలో బాలికల హాస్టల్, ఐటీఐ కళాశాల భవనాలు నిర్మించినా గత ఐదేళ్లలో వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కక్షపూరితంగా సిబ్బందిని కేటాయించకుండా అడ్డుకున్నారని నరసరావుపేటకు చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. హరిబాబు అనే బాధితుడు అర్జీ ఇస్తూ... 'అన్నమయ్య జిల్లా తిమ్మయ్య గారిపల్లెలో మాజీ ఎమ్మెల్యే కోరముట్ల శ్రీనివాసులు ప్రోద్బలంతో వైసీపీ నేత సుబ్బారాయుడు నా పొలానికి దారి విషయంలో మాపై అక్రమ కేసులు పెట్టి పోలీసులతో కొట్టించారు. దానివల్ల ఓ కుటుంబం ఆత్మహత్య చేసుకుంది' అని టీడీపీ నేతల దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వంలో ప్రకాశం జిల్లా బసిరెడ్డిపల్లెలో తన భూమిని తనకు తెలియకుండా చింతా హనుమయ్య అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో వారి పేరుపై నమోదు చేయించుకున్నారని, దానిని రద్దు చేసి, తమకు న్యాయంచేయాలని ఉప్పు చిన్న అంజయ్య కోరారు. వైసీపీ నేతలతో అధికారులు కుమ్మక్కై, తన భూమికి దొంగ పత్రాలు సృష్టించి, ఇతరుల పేరు మీద నమోదు చేశారని అనంతపురం జిల్లా పీ సిద్దరాంపురం గ్రామానికి చెందిన వడ్డే గంగన్న ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇప్పించాలని పలువురు విద్యార్థులు అర్జీలు అందజేశారు.

బీజేపీతో జతకట్టాక.. భయం లేకుండా దోచేస్తున్నారు!

- మాఫియాలా రాజ్యమేలుతున్నారు
- ఇసుక రెండింతలు ఎక్కువకు అమ్ముతున్నారు
- రూ.99 మద్యంలో క్వాలిటీ ఉంటుందా?
- ఈవీఎంలపై పోరు కొనసాగుతుంది: జగన్



అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీతో జతకట్టాక కూటమి ప్రభుత్వం భయం లేకుండా రాష్ట్రాన్ని దోచేస్తోందని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీతో కలిసి సర్కారును నడుపుతున్నందున తమనెవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో విచ్చలవిడిగా కూటమి నేతలు మాఫియాలా రాజ్యమేలుతున్నారని అన్నారు. శుక్రవారమిక్కడ తాడేపల్లి ప్యాలె్స్‌లో వైసీపీ సానుకూల మీడియా ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఇసుకను వైసీపీ ప్రభుత్వం కంటే రెండింతలు ఎక్కువ ధరకు అమ్ముతున్నారని తెలిపారు. మద్యం విషయానికి వస్తే చంద్రబాబు హయాంలో అమృతం.. తన హయాంలో విషం అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన ప్రభుత్వ హయాంలోని క్వాలిటీ మద్యాన్నే ఐదు నెలలుగా ఇస్తున్నారని అన్నారు. రూ.120 లిక్కర్‌లో క్వాలిటీ ఉంటుందా.. రూ.99కు ఇచ్చే లిక్కర్‌లో క్వాలిటీ ఉంటుందా అని జగన్ ప్రశ్నించారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుకు ఈడీ క్లీన్ చిట్ ఇవ్వలేదన్నారు. ఈ కేసులో ఆయన్ను అరెస్టు చేసే అవకాశం ఉందని తెలిపారు. తన ప్రభుత్వంలో సీమెన్స్ ప్రాజెక్టు స్కాంపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందన్నారు. జమిలి ఎన్నికలు జరుగుతాయో లేదో తెలియదని, అది తమ చేతుల్లో లేదని చెప్పారు. ఈవీఎంలపై తమ పోరాటం కొనసాగుతుందని.. న్యాయస్థానాల్లో కేసులు ఇంకా నడుస్తున్నాయని అన్నారు. ఎన్నికల సంఘంలో కల్మషం ఉన్నందునే వీవీ ప్యాట్‌లను.. ఓట్ల సంఖ్యతో సరిపోల్చడం లేదని ఆరోపించారు. వరద బాధితులకు సాయం అందించడంలో స్కాం జరిగిందని రాసినందుకు తన పత్రికపై తప్పుడు కేసు పెట్టారని.. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం తప్పా అని అడిగారు. పత్రికా స్వేచ్ఛపై మాట్లాడిన జగన్.. తన మీడియా సమావేశానికి 'ఆంధ్రజ్యోతి'ని దూరంగా పెట్టడం గమనార్హం.

బోరుగడ్డ అనిల్‌తో మాకు సంబంధం లేదు: ఆర్‌పీఐ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బోరుగడ్డ అనిల్‌కు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ)కి ఎటువంటి సంబంధం లేదని ఆ పార్టీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రభుదాస్ స్పష్టం చేశారు. శుక్రవారం గుంటూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పార్టీ పేరుతో దందాలు చేస్తున్నారనే కారణంతో ఏడాది క్రితమే అనిల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశాం. ఆయన అరెస్టు, కేసులపై మా పార్టీ స్పందించాల్సిన అవసరం లేదు. వైసీపీ అనుచరుడిగా ముద్ర పడ్డ అనిల్‌కు మేము ఎలా సహకరిస్తాం? చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌పై అనిల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను అప్పుడే ఖండించాం' అని పేర్కొన్నారు. పార్టీ జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు మాట్లాడుతూ... సభ్య సమాజం సిగ్గుపడేలా వ్యాఖ్యలు చేసిన అనిల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



ఒత్తిడి చిత్తు చేస్తోంది

యువతలో పెరుగుతున్న మైగ్రేన్ తలనొప్పి

- అధిక ఒత్తిడి, జీవన శైలే కారణం
- 'ఆంధ్రజ్యోతి'తో న్యూరాలజీ వైద్య నిపుణులు
- విశాఖలో జరుగుతున్న జాతీయ సదస్సు

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో యువత ఒత్తిడిని తట్టుకోలేకపోతోందని, దీనివల్ల మైగ్రేన్ (పార్శ్వపు) తలనొప్పితో ఎక్కువమంది బాధపడుతున్నారని వైద్య నిపుణులు తెలిపారు. మరోవైపు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్న వారి సంఖ్యా పెరుగుతోందని చెప్పారు. స్ట్రోక్ వచ్చిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తే వారు కోలుకుకే అవకాశం ఉందన్నారు. చిన్నారుల్లో అయితే ఫిట్స్ కేసులు అధికమవుతున్నాయన్నారు. విశాఖ వేదికగా ఈ నెల 16న ప్రారంభమై 21 వరకు జరిగే న్యూరాలజీ వైద్యుల జాతీయ సదస్సులో దేశ, విదేశాల నుంచి 2,600 మంది న్యూరాలజీ వైద్యులు పాల్గొన్నారు. సదస్సులో న్యూరో సంబంధిత సమస్యలు,అధునాతన వైద్య పద్ధతులపై చర్చించారు. ఆరోగ్య సమస్యపై ప్రజలకు అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. అనారోగ్య సమస్య వచ్చినపుడు మెరుగైన వైద్య సేవలు సత్వరమే పొందాలని చెప్పారు. జాతీయసదస్సు సందర్భంగా సీనియర్ వైద్యులు,నిపుణులు శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి పలు విషయాలను వివరించారు.

వృద్ధుల్లో సెరిబ్రల్ అమైలాయిడ్ యాంజియోపతి



వృద్ధుల్లో సెరిబ్రల్ అమైలాయిడ్ యాంజీయోపతి సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. వాంతులు కావడం, తలనొప్పి, మాట తడబడడం వంటివి దీని లక్షణాలు. వెంటనే వైద్య సేవలు అందించాలి. లేకపోతే హేమరేజ్ (రక్తనాళాలు చిట్లి) అయ్యి కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. .

- డాక్టర్ పి.విజయ, న్యూరాలజీ వైద్యులు, గుంటూరు

యుక్తవయస్కుల్లోనూ బ్రెయిన్ స్ట్రోక్ కేసులు



సాధారణంగా షుగర్, బీపీ అధికంగా ఉన్నవారికే బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని భావిస్తారు. ఇటీవల ఈ సమస్యలు లేని వారికి కూడా వస్తోంది. గతంతో పోలిస్తే...30 ఏళ్లు దాటిన వారిలో చాలామంది బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు, ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడమే కారణం.

- డాక్టర్ జ్ఞానేశ్వరన్ టీఆర్, మధురై

పెరుగుతున్న ఫిట్స్ కేసులు



చిన్నారుల్లో ప్రతి వేయి మందిలో ఒకరికి ఫిట్స్ వస్తుంది. ఇది అంటువ్యాధి కాదు. సరైన మందులు విని యోగిస్తే వంద మందిలో 70 మందికి పూర్తిగా తగ్గుతుంది. ఫిట్స్ రావడానికి అనేక కారణాలున్నాయి. బ్రెయిన్‌లో ట్యూమర్లు, మచ్చలు ఉన్నా ఫిట్స్ వస్తాయి. రోడ్డు ప్రమాదాల్లో చాలామంది తలకు గాయాలవుతుంటాయి. వీటివల్ల బ్రెయిన్‌లో మచ్చలు ఏర్పడతాయి. ఇవి భవిష్యత్తులో ఫిట్స్‌కు కారణమవుతున్నాయి. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి 18 ఏళ్లలోపు వారిలో ఎక్కువగా ఫిట్స్ కేసులు కనిపిస్తున్నాయి. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలను అందించాలి. అపోహలతో చాలామంది పాలు ఇవ్వడం లేదు. దీనివల్ల రక్త ప్రసరణ, గ్లూకోజ్ తగ్గి ఫిట్స్‌కు కారణమవుతుంది. ఆల్కహాల్ తాగే వారిలో, స్ట్రోక్ వచ్చి కోలుకున్న వారిలోనూ ఫిట్స్ వచ్చే అవకాశం ఉంది.

- ఎస్.సీతామహాలక్ష్మి, కిమ్స్ ఆస్పత్రి, హైదరాబాద్

వేధిస్తున్న మైగ్రేన్



ఇటీవల న్యూరాలజీ సమస్యల్లో బ్రెయిన్ స్ట్రోక్, డిమెన్షియా, ఎపిలెప్సీ, పార్కిన్‌సన్స్ చూస్తున్నాం. యువత ఎక్కువమంది ఆందోళనకర రీతిలో మైగ్రేన్ తలనొప్పితో బాధపడుతున్నారు. 15 నుంచి 40 ఏళ్లలోపు వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. న్యూరో సమస్యలతో వచ్చే వంద మందిలో 40 మంది మైగ్రేన్ తలనొప్పి అని చెబుతున్నారు. వీరిలో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే. విద్యార్థులు కూడా తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దీనికి జీవనశైలితో వచ్చే తీవ్ర ఒత్తిడి కారణమవుతుండగా, కొందరిలో జన్యుపరమైన అంశాలు ఉంటున్నాయి. ఆరోగ్య సమస్యపై అవగాహన తప్పనిసరి. మెరుగైన వైద్య సేవలు పొందాలి. ఒత్తిడికి దూరంగా ఉండడంతో పాటు మందులు, థెరపీలతో ఉపశమనం పొందవచ్చు.

- డాక్టర్ బీఎన్ కృష్ణప్రసాద్, న్యూరాలజీ వైద్యులు, బెంగళూరు

'సెకీ' విద్యుత్ భారమంతా ప్రభుత్వానిదే!

- వినియోగదారులపై ఉండదు.. ఏపీఈఆర్‌సీకి స్పష్టం చేసిన డిస్కంలు
- 8,114 కోట్ల సర్దుబాటు చార్జీల వసూలుకు ఆమోదం తెలపాలని వినతి
- తిరస్కరించండి: ప్రజాభిప్రాయ సేకరణలో సీపీఎం నేత బాబూరావు

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకుగాను సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి కొనుగోలు చేస్తున్న 7,000 మెగావాట్ల సౌర విద్యుత్ భారమంతా రాష్ట్ర ప్రభుత్వమే మోస్తుందని డిస్కంలు స్పష్టం చేశాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ఇంధన సర్దుబాటు కింద రూ.8114 కోట్ల మేర వినియోగదారుల నుంచి వసూలు చేసుకునేందుకు ఆమోదం తెలపాలని ఏపీఈఆర్‌సీని కోరాయి. ఇంధన సర్దుబాటు చార్జీలపై కమిషన్ శుక్రవారం వర్చువల్‌గా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. ఈ సందర్భంగా డిస్కంలు తమ వాదనలు వినిపించాయి. ఉత్పత్తికీ, డిమాండ్‌కు మధ్య వ్యత్యాసం కారణంగా ట్రూ-అప్, ఇంధన సర్దుబాటు చార్జీలు వేస్తున్నామని.. తాము సమర్పించిన రూ.8114 కోట్ల ఇంధన సర్దుబాటును ఆమోదించాలని విజ్ఞప్తిచేశాయి. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి విద్యుత్ చార్జీల భారాన్ని మోస్తూ వస్తున్న వినియోగదారులపై మరో రూ.8,114 కోట్ల బాదుడుకు డిస్కంలు చేసిన ప్రతిపాదనలను తిరస్కరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రజాభిప్రాయ సేకరణలో విజయవాడ నుంచి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పాల్గొన్నారు. గతంలో జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేసిన కూటమి ప్రభుత్వం తాజాగా ప్రజలపై రూ.8,114 కోట్ల భారం వేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, విద్యుత్ చార్జీల పెంపు, ట్రూ అప్ చార్జీల విధింపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాలను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం విజయవాడలోని దాసరి భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. విద్యుత్ చార్జీల భారంపై చర్చించిన కార్యవర్గం తీర్మానం ఆమోదించి, ఆమేరకు ప్రకటన చేసింది. 'కూటమి ప్రభుత్వం.. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఇప్పుడు చార్జీల బాదుడుతో వినియోగదారులకు కరెంట్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇది సరికాదు.' అని పేర్కొంది. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు.

అవునా జగన్!

మీరు అబద్ధాలే ఆడరా?

(మొదటి పేజీ తరువాయి)

విస్తుపోయారు. నిలువెత్తు అబద్ధం.. 'నేను అబద్ధం ఆడనమ్మా' అని సుద్దులు పలికినట్టు జగన్ వ్యాఖ్యలు ఉన్నాయంటూ రాజకీయపక్షాలు సెటైర్లు వేస్తుంటే... కనీసం గత పదేళ్లలో జగన్ అబద్ధాల చిట్టా లెక్కబెట్టడానికి వేళ్లు కూడా సరిపోబోవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అబద్ధాల మేత...

- రాజధాని అమరావతిపై జగన్ ఏకంగా అబద్ధాల ఫ్యాక్టరీనే తెరిచేశారు. అమరావతిలోనే రాజధాని ఉంటుందని నిండు అసెంబ్లీలో చెప్పారు.. తనకు అమరావతిలో ఇల్లు ఉన్నదని, ఇక్కడే ఉంటానని 2019 ఎన్నికల్లో ప్రజలకు తెలిపారు. కానీ, నమ్మి అధికారమిస్తే గత ఐదేళ్లూ అమరావతికి వెన్నుపోట్లు పొడిచారు. తన ఇల్లు అమరావతిలో ఉన్నదన్న నోటితోనే.. శ్మశానం, సమాధులు, ఎడారి అంటూ విషం చిమ్మారు. మూడు రాజధానులు అంటూ.. తన నిర్వాకంతో కనీసం చెప్పుకోవడానికి కూడా రాజధానే లేకుండా చేశారు.
- 2019లో బాబాయ్, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యను తొలుత గుండెపోటుగా జగన్ చిత్రీకరించారు. అనంతరం అది టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేయించిన హత్యగా ఆరోపించారు. తన పత్రికలో 'నారాసుర రక్త చరిత్ర' పేరిట కథనాలు రాయించారు. కానీ, చివరకు.. వివేకానందరెడ్డి హత్యలో చంద్రబాబు పాత్ర లేదని స్వయంగా సీబీఐయే తేల్చిచెప్పింది. జగన్ తమ్ముడు, ఎంపీ అవినాశ్ రెడ్డికి సంకెళ్లు వేసింది. బాబాయిపై గొడ్డలి వ్యవహారంలో జగన్ చెప్పినవన్నీ అబద్ధాలేనని లోకానికి తెలిసిపోయింది.
- అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేస్తానని ప్రజా సమక్షంలో ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్మోహనరెడ్డి బహిరంగంగా హామీ ఇచ్చారు. కానీ, అధికారంలోకి వచ్చాక ఆ హామీని నిలబెట్టుకోలేకపోయారు. "మీ హామీ అబద్ధం కాదా' అని ఉద్యోగులు.. జగన్‌ను నిలదీస్తున్నారు.
- యేటా జనవరి ఒకటో తేదీన జాబ్ కేలండర్ విడుదల చేస్తానని చెప్పి జగన్ నాడు అధికారంలోకి వచ్చారు. పదవిలో ఉన్న ఐదేళ్లలో ఒక్కసారి కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదు. "జగన్ వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశపడ్డాం. కానీ తాను అధికారంలోకి రావడానికి మాకు అబద్ధాలు చెప్పినట్టు ఆ తర్వాతగానీ తెలుసుకోలేకపోయాం" అని నిరుద్యోగులు చెబుతున్నాయి.
- అధికారంలోనికి వచ్చిన వెంటనే సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని దశలవారీగా అమలు చేస్తానని రాష్ట్రంలోని మహిళలకు జగన్ వాగ్దానం చేశారు. అదే నమ్మకంతో అక్కచెల్లెమ్మలు...వైసీపీని అధికారంలోకి తెచ్చారు. కానీ, జగన్ పదవిలో ఉన్న ఐదేళ్లలో ఏ 'దశ'లోనూ మద్యపాన నిషేధం గురించి ఆయన పట్టించుకోలేదు. "మరి ఇది అబద్ధపు వాగ్దానం కాదా ?" అని మహిళలు ప్రశ్నిస్తున్నారు.
- కరెంటు బిలులు చూస్తేనే .. షాక్ కొట్టేలా .. బాదుడే బాదుడుకు చంద్రబాబు పాల్పడ్డారంటూ జగన్ బిగ్గరగా అరుస్తూ బహిరంగ సభలో మాట్లాడేవారు. అధికారంలోకి వచ్చిన వెంటనే..ఎస్సీఎస్టీలకు 200 యూనిట్ల దాకా ఉచితం చేస్తానని ప్రకటించారు. రేషనలైజేషన్ పేరిట ఆస్తిని బట్టి.. కొందరికి ఈ వెసులుబాటును ఎగ్గొట్టారు. ట్రూఅప్, ఇంధన సర్దుబాటు పేరిట డబుల్ బాదుడును అమలుచేశారు.
- అధికారంలోనికి వస్తే 45 ఏళ్లకే సామాజిక భద్రతా పింఛను ఇస్తానని జగన్ హామీ ఇచ్చారు. కానీ, తాను అధికారంలో ఉండగా.. దానినీ సీపీఎస్ రద్దు ..సంపూర్ణ మద్య నిషేధం జాబితాలోకి చేర్చేశారు. అబద్ధాల్లో తన రికార్డును తానే బద్దలు కొట్టారు.
- వైసీపీకి 25 లోక్‌సభస్థానాలు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానంటూ జగన్ ఎన్నికల ప్రచారాల్లో హామీ ఇచ్చారు. 22 లోక్‌సభ స్థానాలు దక్కించుకున్నా.. ఏనాడూ ప్రత్యేక హోదా విషయంలో ప్రధాని మోదీని నిలదీయలేదు. హోదాను హుళక్కినిపించి జనం దృష్టిలో అబద్ధాల మేతగా పలచన అయ్యారు.

ఫార్మసీ సీట్ల భర్తీకి గ్రీన్ సిగ్నల్

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీ ఫార్మసీ, ఫార్మా డీ సీట్ల భర్తీకి అనుమతిస్తూ ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) అనుమతిలో జాప్యం కారణంగా ఇంత కాలం అడ్మిషన్లు జరగలేదు. తాజాగా పీసీఐ అనుమతి రావడంతో ఫార్మసీ విద్యా సంస్థల్లో సీట్ల భర్తీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. 92 విద్యా సంస్థల్లో ఈ సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపింది. అందుకు అనుగుణంగా సాంకేతిక విద్యాశాఖ సీట్ల భర్తీకి షెడ్యూలు విడుదల చేస్తుంది. రాష్ట్రంలో సుమారు 12వేల ఫార్మా సీట్లు అందుబాటులో ఉన్నాయి.

పశుగ్రాసానికి ఉపాధి నిధులు

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పేద పాడి రైతులకు ఉపాధి పథకంలో భాగంగా పశుగ్రాసం పెంచుకునేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అవకాశం కల్పించింది. పాడిరైతులు తమ పొలంలో పశుగ్రాసం పెంచుకునేందుకు అవసరమైన నిధులు ఉపాధి పథకం ద్వారా అందిస్తారు. ఈ ఏడాది రాష్ట్రంలో 25 వేల ఎకరాల్లో పశుగ్రాసం అభివృద్ధి చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతుల పొలాల్లో ఒక్కోరైతు 10 సెంట్ల నుంచి 50 సెంట్లలో పశుగ్రాసం అభివృద్ధి చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. గ్రామ సభ ఆమోదంతో పశుసంవర్ధక శాఖ అధికారులు రైతులను ఎంపిక చేస్తారు. ఈ పనులకు సంబంధించి పొలం దున్నేందుకు, విత్తనాలు వేసేందుకు మెటీరియల్ నిధులందిస్తారు. రెండేళ్ల పాటు నిర్వహణకు ఉపాధి నిధులు అందిస్తారు. వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయాలన్న కేంద్ర లక్ష్యం నెరవేరేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయం తీసుకుంది.



రేషన్ షాపుల విభజనకు బ్రేక్!

- హైకోర్టును ఆశ్రయిస్తున్న డీలర్లు
- ఇప్పటి వరకు 14 షాపులకు స్టే
- పాత జీవో ప్రకారం రేషనలైజేషన్‌పై పలువురు డీలర్ల అభ్యంతరాలు
- 2,774 కొత్త షాపుల ఏర్పాటుకు అడ్డంకులు


అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల విభజన ప్రక్రియకు బ్రేకులు పడుతున్నాయి. ఈ ప్రక్రియ హేతుబద్ధంగా జరగడం లేదని, తాము ఆర్థికంగా నష్టపోతామంటూ పలువురు రేషన్ డీలర్లు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం నుంచి ఇద్దరు, తెనాలి పట్టణం నుంచి ఒకరు, విశాఖపట్నం నుంచి 11 మంది డీలర్లు రిట్ పిటిషన్లు వేశారు. వీటిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం వారి షాపుల బైఫరికేషన్(విభజన) ప్రక్రియను నిలుపుదల చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో శనివారం మరికొందరు డీలర్లు కోర్టులో పిటిషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంతకుముందు ప్రకటించిన షెడ్యూలు ప్రకారం రేషన్ షాపుల విభజన ప్రక్రియ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడనుంది. తమ దుకాణాల పరిధిలో తక్కువ కార్డులు ఉండడంతో ప్రతినెలా వచ్చే కమీషన్ డబ్బులు షాపుల అద్దెకు కూడా సరిపోని పరిస్థితిని ఎక్కువ మంది డీలర్లు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సర్కారు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో ప్రస్తుతం 800 కంటే ఎక్కువ కార్డులు ఉన్న రేషన్ షాపులు 2,774 ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ గుర్తించింది. వాటిని విభజించి కొత్తగా మరో 2,774 షాపులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అన్ని రేషన్ షాపులకు సమాన ప్రాతిపదికన కార్డులు సర్దుబాటు చేసి రేషన్ దుకాణాల నిర్వహణను లాభదాయకంగా మార్చాలని నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్ షాపులకు 400 నుంచి 450 కార్డులు, పట్టణాల్లో 500 నుంచి 550 కార్డులు, నగరాల్లో 600 నుంచి 650 కార్డులు చొప్పున సర్దుబాటు చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అయితే 2007లో జారీ చేసిన జీవో-35 ప్రకారం రేషనలైజేషన్ ప్రక్రియను కొనసాగించడం సరికాదని డీలర్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వేతో చనిపోయిన వారు, అనర్హుల వివరాలు సేకరించాలని, ఆ డేటా ఆధారంగా రేషనలైజేషన్ చేయాలని డీలర్లు ప్రభుత్వాన్ని కోరారు. అయితే వారి విజ్ఞప్తులను పట్టించుకోకుండా పౌరసరఫరాలశాఖ అధికారులు పాత జీవో ప్రకారమే ముందుకు పోతుండడంపై డీలర్లు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు.

సహకార సంఘాలకు

నామినేటెడ్ పాలకవర్గాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సంఘాలకు ఎన్నికలు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. మిత్రపక్షాలకు నామినేటెడ్ పదవుల్లో 20 శాతం ఇస్తున్నట్లు చెప్పారు. 'రాష్ట్రం మొత్తం మీద ఈ శాతం ప్రకారం ఇస్తాం. ఏదైనా నియోజకవర్గంలో వారికి ఎక్కువ ఇస్తే మరో చోట తగ్గుతాయి' అని తెలిపారు. కింది స్థాయిలో జనసేన నేతలతో సమన్వయంలో కొన్ని సమస్యలు వస్తున్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రస్తావించారు. మిత్రపక్షాలతో ఇటువంటి సమస్యల సర్దుబాటుకు ఇద్దరు సభ్యుల కమిటీ వేస్తున్నామని, ఇందులో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు ఉంటారని సీఎం చెప్పారు. 'మనం కలసి ఎన్నికల్లో పోటీ చేశాం. కలిసే ప్రయాణించాలి. ఎక్కడైనా సమస్యలు వస్తే ముందు మీ స్థాయిలో పరిష్కరించే ప్రయత్నం చేసుకోండి. కుదరకపోతే ఈ కమిటీ దృష్టికి తీసుకురండి' అని సూచించారు. రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉందని, కేంద్రం సహకారంతోనే బండి లాక్కొస్తున్నామని, ఈ విషయం కూడా ప్రజలకు చెప్పాలని అన్నారు. 'ఎన్డీయేలో మనకు గౌరవం, ప్రాధాన్యం ఇస్తున్నారు. అయినా మనకు చేసే సాయంలో కొన్ని పరిమితులు ఉన్నాయి. వాటిని అర్థం చేసుకోవాలి. కూటమిలో ఉన్నంత మాత్రాన అన్నీ చేయలేరు. విభజన చట్టంలో కొన్ని అంశాల కింద మనకు కొంత సాయం రావలసి ఉందని ప్రధానితో చెబితే ఆయన సానుకూలంగా స్పందించారు. రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల విలువైన రోడ్లు, రూ.75 వేల కోట్ల విలువైన రైల్వే లైన్లు ఇచ్చారు' అని అన్నారు. త్వరలో జరగబోయే నీటి సంఘాల ఎన్నికలు, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాగా పనిచేయాలని, తానూ వ్యక్తిగతంగా ప్రతి రోజూ పర్యవేక్షిస్తానని చెప్పారు. రెండు పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల పేర్లు శనివారం అధికారికంగా ప్రకటించాలని పల్లాను ఆదేశించారు. వైసీపీ హయాంలో అతి చేసిన వారిని పార్టీలోకి తీసుకోవద్దని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. 'కొత్తగా ఎవరూ రావద్దనడం సరికాదు. పార్టీ అన్న తర్వాత కొంత మంది వస్తుంటారు. కానీ తప్పులు చేసిన వారు షెల్టర్ కోసం వస్తే మాత్రం తీసుకోవద్దు' అని చంద్రబాబు సలహా ఇచ్చారు. పార్టీ లైన్‌ను.. కేడర్‌ను విస్మరించి వ్యవహరించవద్దని గట్టిగా కోరారు. 'ఇవి పాటించడం ఇష్టం లేకపోతే స్వతంత్రులుగా గెలిచి రావలసింది. పార్టీ తరఫున గెలిచి వచ్చినపుడు పార్టీ లైన్‌ను విధిగా పాటించాలి' అని వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలకు పాల్పడినవారిని చట్ట ప్రకారం శిక్షించి తీరతామని స్పష్టం చేశారు. 'ఏమీ జరగడం లేదని అపోహలు పెట్టుకోవద్దు. అన్ని ఆధారాలూ సేకరించి ఒక పద్ధతి ప్రకారం పనిచేస్తాం. ఆ పని జరుగుతూనే ఉంది' అని చెప్పారు.



లేనివాళ్లకు జీతాలు పెంచాలా?

కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపిచ్చారు. 'వలంటీర్లకు పది వేలు జీతం ఇవ్వలేదని జగన్ అంటున్నాడు. వాళ్లను ఆయనే ఉద్యోగాల నుంచి తీసివేశాడు. రెన్యువల్ చేయలేదు. వలంటీర్లే లేనప్పుడు ఇక ఎవరికి జీతాలు పెంచాలి? ఆయన తాను గెలిచిన తర్వాత ఎన్ని రోజులకు డబ్బులిచ్చాడో అడగండి. ఇద్దరు పిల్లలకు అమ్మ ఒడి ఇస్తానని ఒకటికి తగ్గించాడు. ఒక ఏడాది అసలు ఇవ్వలేదు. మిగిలిన సంవత్సరాల్లో కోత పెట్టాడు. రైతు భరోసా వాగ్దానంలో సగం కోత కోసి ఇచ్చాడు. మద్యపాన నిషేధమని తర్వాత మద్యాన్ని ఏరులై పారించాడు. వీటిపై ప్రతి చోటా నిలదీయండి' అని సూచించారు.

తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్‌కు ఓకే

- మూడోసారీ రద్దయితే వ్యవస్థపై విశ్వాసమే ఉండదన్న టీ-హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థులకు ఊరట! మెయిన్స్ పరీక్షల నిర్వహణకు ఉన్న అడ్డంకులను హైకోర్టు తొలగించింది. ప్రిలిమ్స్(ప్రాథమిక పరీక్ష)ను రద్దు చేయాలని, కీలో తప్పులున్నాయని, రీ నోటిఫికేషన్ ఇవ్వడం చెల్లదని, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు చెల్లదంటూ దాఖలైన పలు అప్పీల్ పిటిషన్లను హైకోర్టు ధర్మాసనం కొట్టేసింది. మెయిన్స్ పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. 90 శాతం మంది అభ్యర్థులు హాల్‌టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇప్పటికే రెండుసార్లు ప్రిలిమ్స్ పరీక్ష రద్దయింది. మూడోసారి కూడా రద్దయితే వ్యవస్థపై విశ్వాసమే పోతుంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారని, అందులో జోక్యం అవసరం లేదని స్పష్టం చేసింది. కాగా, ఈనెల 21 నుంచి మెయిన్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని టీజీపీఎస్సీ తరఫున న్యాయవాదులు కోర్టుకు తెలిపారు.



గ్రూప్ 1 అభ్యర్థులపై పోలీసుల లాఠీచార్జీ

గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసుల లాఠీచార్జ్

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని, జీవో 29ను రద్దు చేయాలని ర్యాలీ చేసిన అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. శుక్రవారం 150 మంది అభ్యర్థులు రాహుల్ గాంధీ మాస్కులు ధరించి గాంధీనగర్ ఆంధ్రాకేఫ్ నుంచి ధర్నాచౌక్‌కు ర్యాలీ చేశారు. వీరిని అశోక్‌నగర్ వద్ద పోలీసులు అడ్డుకొని చెదరగొట్టారు. పోలీసులు వెంటపడి తమను బాదారని అభ్యర్థులు చెప్తున్నారు.

పెండింగ్ దరఖాస్తులన్నీ ఒక్కరోజే పరిష్కారం

- రూ.6.10 కోట్ల ఆర్థిక ప్రయోజనాలు మంజూరు
- ఏపీ అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ కమిటీ కీలక నిర్ణయం

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మరణానంతర ప్రయోజనాలతో పాటు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం కోరుతూ వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఏపీ అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ కమిటీ ఒకేరోజు పరిష్కరించింది. శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో హైకోర్టు, ఏపీ న్యాయశాఖ ప్రతినిధులు, అడ్వకేట్ జనరల్, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ద్వారకానాథ్ రెడ్డి, సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, పీ సింగారావు పాల్గొన్నారు. న్యాయవాదులు, వారి కుటుంబసభ్యుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన కమిటీ మొత్తం రూ.6.10 కోట్లను మంజూరు చేసింది. కాగా, మృతిచెందిన న్యాయవాదుల కుటుంబాలకు మ్యాచింగ్ గ్రాంట్ కింద ప్రభుత్వ వాటా సొమ్మును త్వరగా విడుదల చేయాలని బార్ కౌన్సిల్ ఛైర్మన్ ద్వారకానాథ్ రెడ్డి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాల విక్రయం

- నలుగురిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

ఎండాడ (విశాఖపట్నం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు విక్రయించిన నలుగురు వ్యక్తులను సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలకు చెందిన బొండా వెంకటశివసాయికృష్ణ, ముడికి యాదేశ్‌కుమార్, నిద్రా ప్రదీప్‌కుమార్, సింగంశెట్టి సాయిబాబు.. నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ చూపి వారి ఆధార్ కార్డులు, పాన్ కార్డులు తీసుకున్నారు. వారి అడ్రస్‌లు మార్చి, పలు డాక్యుమెంట్లలో సంతకాలు చేయించుకుని వారి పేరుతో మూడు కార్పొరేట్ బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు తెరిచారు. ఆ తర్వాత వాటిని సైబర్ నేరగాళ్లకు విక్రయించారు. సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

లుకౌట్ నోటీసును రద్దు చేయండి

- హైకోర్టును ఆశ్రయించిన సజ్జల

అమరావతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): లుకౌట్ సర్క్యులర్‌ను(ఎల్‌వోసీ) రద్దు చేయాలని కోరుతూ వైసీపీ సీనియర్‌నేత సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ గుంటూరు ఎస్పీ ఈ నెల 10న లుకౌట్ నోటీసులు జారీ చేశారన్నారు. ఇది కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమేనన్నారు. పోలీసుల చర్యను రాజ్యాంగవిరుద్ధమైనదిగా, చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. తక్షణం లుకౌట్ సర్క్యులర్‌ను తొలగించేలా ప్రతివాదులను ఆదేశించాలన్నారు. వ్యాజ్యం పరిష్కారం అయ్యేవరకు లుకౌట్ సర్క్యులర్ అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. కేంద్రహోంశాఖ, రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర డీజీపీ, గుంటూరుజిల్లా ఎస్పీ, మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్ సీఐలను తన వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. 'టీడీపీ కేంద్ర కార్యాలయం పై దాడి కేసులో పోలీసులు నన్ను 120వ నిందితుడిగా చేర్చారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించాను. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం... దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించింది. అదే సమయంలో తదుపరి విచారణ వరకు నాపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఈ నెల 14న ఇండోనేసియా వెళ్లి తిరిగి వస్తుండగా నాపై లుకౌట్ నోటీసు ఉందని చెబుతూ ఢిల్లీ ఎయిర్ పోర్టులో బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించారు. కఠిన చర్యలు వద్దని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఆ తరువాత విడిచిపెట్టారు. తొందరపాటు చర్యలు వద్దని ఈనెల 4న కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన తరువాత ఈ నెల 10న లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. అధికారులు కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారు. ప్రజలలో నా ప్రతిష్ఠను మసకబార్చేందుకు అధికార పార్టీ ఒత్తిడితో అధికారులు ఈ నోటీసులు ఇచ్చారు. రికార్డుల నుంచి లుకౌట్ నోటీసులు తొలగించకుంటే పూడ్చుకోలేని నష్టం జరుగుతుంది. పోలీసుల చర్య నా ప్రాథమిక హక్కులను హరించేదిగా ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని సదరు లుకౌట్ సర్క్యులర్‌ను రద్దు చేయండి' అని తన పిటిషన్‌లో కోరారు.

బెయిల్ మంజూరు చేయండి

- కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుమారుల వినతి
- నేడు విచారించనున్న హైకోర్టు

తాడిపత్రి పట్టణ పోలీసులు ఈనెల9న నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుమారులు హర్షవర్ధన్ రెడ్డి, సాయిప్రతాప్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. వ్యాజ్యం పై నిర్ణయం వెల్లడించేవరకు తమ పై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన కుమారులు, వైసీపీ నాయకులు... ఈ ఏడాది మే 14న తమ పై రాళ్లతో, మారణాయుధాలతో దాడి చేసి గాయపర్చారని తాడిపత్రి పట్టణం, రాగితోటపాలెంకు చెందిన కోర్నపల్లి చిన్న సంజన్న అనే వ్యక్తి ఈనెల 9న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు తమ పై కూడా పెద్దారెడ్డి, ఆయన కుమారులు దాడి చేశారంటూ కానాల రవీంద్రరెడ్డి, షేక్ సాదక్ వలీ అనే వ్యక్తులు... రిజిష్టర్ పోస్టు ద్వారా అదే రోజు ఫిర్యాదుచేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పెద్దారెడ్డి, ఆయన కుమారులు కోర్టును ఆశ్రయించారు.

పోలీసు కస్టడీకి నందిగం సురేశ్

మంగళగిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను మరోమారు పోలీసు కస్టడీకి ఇస్తూ మంగళగిరి కోర్టు ఆదేశాలిచ్చింది. 2020 డిసెంబరులో రెండువర్గాల మధ్య జరిగిన గొడవలో మరియమ్మ అనే మహిళ మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అప్పట్లో తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో సురేశ్‌ను 78వ నిందితుడిగా చేర్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో సెప్టెంబరు 5న అరెస్టయిన నందిగం సురేశ్ గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆ కేసులో సురేశ్‌కు బెయిల్ వచ్చినప్పటికీ మహిళ హత్య కేసులో అరెస్టు కావడంతో ఆయన జైలులోనే ఉన్నారు. ఈ కేసులో సురేశ్‌ను రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇస్తూ మంగళగిరి కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.